www.visalaandhra.com | VISALAANDHRA Regd No.VJ/042/2015-17 | పేజీలు : 12+టాబ్లాయిడ్ +ఆదివారం అనుబంధం | వెల: రూ.4.00



SUNDAY

విశాలాంధ్ర

స్థాపితం : 1952

అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 , సంచిక : 231

ఆదివారం 11-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | విజయవాడ ప్రచురణ



నీతులు సరే...

టాయిలెట్లేవీ..?

- జంట నగరాల్లో ప్రచారార్భాటమే
- మరుగుదొడ్లు తక్కువ
- విజయవాడ బందరు రోడ్, ఏలూరు రోడ్‌లో మచ్చుకైనా కానరావు
- వెతుకులాటకు నేవీగేటర్ అవసరమేమో

ఈ మధ్య ఎక్కడచూసినా....'ఇక్కడ మూత్ర విసర్జనచేయడం నేరం రూ.500ల జరిమానా విధించబడును' అని రహదారులు వెంబడి గోడలపై, బస్ షెల్టర్ల వద్ద, జన సమ్మర్ధం ఉండే ప్రాంతాలలో కన్పించే ఈ ప్రకటనలలో శుభ్రం పాటిస్తే, ఆరోగ్యరక్షణ అన్న సూక్తులు సాక్షాత్కరిస్తూ ఉంటాయి. పరిసరాలు శుభ్రంగా ఉండాలి, తద్వారా ఆరోగ్యంగా ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమే కాదు...ప్రజల ఆకాంక్ష కూడా...

7 లో

వాట్సాప్ పేమెంట్స్ వచ్చేసింది..



స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్న నేటి యువతకు వాట్సాప్ లేనిదే రోజు గడవని పరిస్థితి. ఎప్పటికప్పుడు సరికొత్త ఫీచర్లతో ఆకట్టుకుంటున్న వాట్సాప్ తాజాగా మరో కొత్త ఫీచర్‌ను యూజర్లకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటివరకూ ఏదైనా నగదు చెల్లింపులు చేయాలంటే ఆయా బ్యాంకుల యాప్‌లు లేదా, పేటీఎం వంటి పేమెంట్స్ యాప్‌లను వినియోగించాల్సి వచ్చేది. ఇక నుంచి మీకు వాట్సాప్ ఉంటే చాలు మీరు చెల్లింపులు చేసేయొచ్చు.

7 లో



భూమికే భారమవుతున్నాం

- ఏటేటా పెరుగుతున్న జనాభా
- కుటుంబ నియంత్రణే శరణ్యం
- ఇలాగైతే విష వాయువుల నియంత్రణ అసాధ్యం
- కర్బన ఉద్గారాలతో చేటు

Sunday Special

పెరిగిపోతున్న ప్రపంచ జనాభా వలన భవిష్యత్తులో భూగ్రహానికే ముప్పురావచ్చునని శాస్త్రజ్ఞుల అంచనా... వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరిగిపోవడంతో సహజమైన ప్రకృతి సంపద దారుణంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. గత కొన్నేళ్లుగా ప్రపంచ జనాభా విపరీతంగా పెరగడంతో తాగేందుకు కూడా నీరు దొరకని పరిస్థితి ఏర్పడింది.

7 లో




పూర్వ వైభవం తెద్దాం

రామకృష్ణ

విశాలాంధ్ర- భీమవరం:
మతోన్మాదంతో దేశానికి ప్రమాదం ఏర్పడిందని రాష్ట్రంలో మున్నెన్నడూ లేని అవినీతి పాలన జరుగుతోందని చంద్రబాబు కరప్షన్, కన్ఫ్యూజన్‌లో ఉన్నాడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శనివారం నాడు సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా జరిగిన ప్రతినిధుల సమావేశంలో ఆయన సౌహార్ద ప్రతినిధిగా హాజరై ప్రసంగించారు. సంతలో పశువుల మాదిరి ఎంఎల్‌ఏలను కొనుగోలు చేసి వారిలో నలుగురిని మంత్రులను చేశారని ఇది చంద్రబాబు నీతివంతపాలనని రామకృష్ణ ఎద్దేవా చేశారు. చట్టసభల్లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం తగ్గడంతోనే ప్రజలు కష్టాలు అనుభవిస్తున్నారని, వారి ఆశలు నెరవేర్చడానికి ఐక్య ఉద్యమాలతో చట్టసభల్లో మన ప్రాతినిధ్యం పెంచుకుని వారికి అండగా నిలిచే సమయం ఆసన్నమైందన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు జైలుకెళ్లింది,

- మిగతా 2 లో

ఇరకాటంలో బాబు!



- పార్లమెంటులో మొక్కుబడి నిరసనలే
- ప్రజల్లో పెరగని విశ్వసనీయత
- అధికార పార్టీది ఇదే మాట

విశాలాంధ్రప్రత్యేక ప్రతినిధి :
ఇన్నాళ్లు కేంద్రంపై సానుకూల ధోరణి ప్రదర్శించి, ఇపుడు మొక్కుబడిగా పార్లమెంటులో తెలుగుదేశం పార్టీ ఎంపీలు నిరసన తెలపడం ద్వారా రాష్ట్రానికి న్యాయం జరుగుతుందనే భావన ప్రజల్లో ఏమాత్రం కలగడం లేదు. నాలుగేళ్లుగా మిత్రపక్షంగా ఉండి, కేంద్రంపై తేలేని ఒత్తిడి ఇపుడు తెచ్చినందువల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదనే భావన అధికార పార్టీలోని వారే వ్యక్తం చేస్తున్నారు. 24లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం జరిగింది. దీనిపై తెలుగుదేశం పెదవి విప్పింది. కానీ మిత్రపక్షంగా కొనసాగుతూ చేసే ఆందోళన వల్ల కేంద్రం ఏమాత్రం స్పందించడం లేదు. ఎన్డీయే నుంచి బయటకు వచ్చి వత్తిడి పెంచితేనే కేంద్రం తల ఒగ్గే పరిస్థితులు ఉంటాయని భావిస్తున్నారు. కానీ దీనికి కేంద్ర మంత్రివర్గంలో ఉన్న ఒక మంత్రి,కొంత మంది ఎంపీలు ఏమాత్రం సుముఖంగా లేరని తెలుస్తోంది. ఇపుడు బయటకు వచ్చినందువల్ల ఉపయోగం ఏమీ ఉండదని, మిత్రపక్షంగా కొనసాగుతూనే వత్తిడి తెచ్చి ఇచ్చిన మేరకు తీసుకోవడం మినహా చేసేదిఏమీ లేదని కూడావారు అభిప్రాయ పడుతున్నారు. అయితే తెలుగుదేశం పార్టీ అధినేతే ఇంకా మిత్ర పక్షం నుంచి బయటకు వచ్చే విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఆయన కూడా ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఇంకా ఎంపీలు,మంత్రులు ఏమి చేస్తారు? అనే భావన వ్యక్తం అవుతోంది. మా అధినేతే అన్నీ చూసుకుంటున్నారు. మేము రాజీనామా చేయడానికికూడా సిద్ధంగా ఉన్నాం. మా అభిప్రాయాన్ని కూడా తేల్చిచెప్పాం.కానీ ఆయనే ఉండండి, చూద్దాం..చేద్దాం..అంటున్నారు. తొందరపడవద్దు.. బిజెపిని ఎవరూ మాట అనవద్దు.. అంటూ వారిస్తున్నారు. ఆయన మనసులో ఏముందో అర్ధం కావడం లేదు. మాకు మాత్రం రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై చాలా వేదన ఉంది. అని సీనియర్ పార్లమెంటు సభ్యులు ఒకరు ఆవేదనవ్యం చేశారు. ఇదే అభిప్రాయం చాలా మందిలో ఉంది. ఒకవైపు బిజెపి నాయకత్వం తెలుగుదేశం పైనా, చంద్రబాబుపైన ఎదురు దాడి చేస్తున్నాసరే కౌంటర్ ఇవ్వవద్దంటున్నారు. ఒకవైపు సోము వీర్రాజు,మరో వైపు పురందేశ్వరి, విష్ణుకుమార్ రాజులు చేసే విమర్శలు కూడా తిప్పికొట్టవద్దంటున్నారు. దీనివల్ల ప్రజల్లో మాదే తప్పు అనే భావన కలుగుతోంది. దీని సరిదిద్దుకోవడానికి మాకు ఇబ్బందే అవుతుంది. అని మరో ఎంపీ పేర్కొన్నారు.ఇపుడున్న పరిస్థితుల్లో పార్లమెంటులో తెలుగుదేశం ఎంపీలు ఒకవైపు ఆందోళన చేసినా కేంద్రంనుంచి ఎలాంటి సానుభూతి కూడా లేదు. ప్రధానిమోడీ గానీ, ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ గానీ పార్లమెంటులో మాట్లాడిన విధానం చూస్తే రాబోయే

- మిగతా 2 లో

తేలని లెక్కలు

ఇప్పటికి రూ.300కోట్లకు పైగా ఆస్తులు గుర్తింపు



విశాలాంధ్రబ్యూరో - హైదరాబాద్ :
ఒక అధికారి పట్టుబడితే అతని ఆస్తులను ఒకట్రెండు రోజుల్లో తేల్చే ఏసీబీ అధికారులు... పురుషోత్తంరెడ్డి విషయంలో ఎటూ తేల్చలేకపోతున్నారు. ఎనిమిది రోజులుగా ఆయన ఆస్తుల వివరాలను సేకరిస్తూనే ఉన్నారు. హైదరాబాద్ హెచ్‌ఎండీఏ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి ఆస్తుల చిట్టాలో కొత్త కోణాలు బయటపడుతున్నాయి. ఇప్పటికే సుమారు రూ.50కోట్లు విలువ చేసే ఆస్తులను ఏసీబీ గుర్తించింది. శనివారం మధ్యాహ్నానికి అధికారులు సేకరించిన ఆస్తుల విలువ సుమారు రూ.300 కోట్లకు పైగా ఉన్నట్లు తెలిసింది. ఇదివరకే ఇద్దరు బినామీలను గుర్తించిన ఏసీబీ తాజాగా మరో ఇద్దర్ని గుర్తించింది. లేఅవుట్ల పర్మిషన్‌కు వచ్చేవారి నుంచి వారూ లంచం తీసుకుంటున్నారని, ఇలా రెండు లేఅవుట్లకు సంబంధించి రూ.100 కోట్లకు పైగా పెట్టుబడులున్నట్లు తెల్చింది. విదేశాల్లో షాపింగ్‌లు, దేశంలోని టాప్ డిజైనర్లతో పనులు చేయించినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే పురుషోత్తంరెడ్డి కుటుంబంతో సహా పరారయ్యారు. దీంతో ఆయన కోసం పోలీసులు నాలుగు బృందాలుగా విడిపోయి గాలిస్తున్నారు. పురుషోత్తంరెడ్డికి అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది.

లాల్-నీల్ ఐక్యతతో బీజేపీని గద్దె దింపుతాం

సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



విశాలాంధ్ర - భీమవరం:
అఖిల భారత స్థాయిలో వామపక్ష ప్రజాతంత్ర శక్తులతో కలసి ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేస్తామని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. సీపీఎం 25వ రాష్ట్ర మహాసభల సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పాత బస్‌స్టాండ్ సెంటర్ నుంచి మహా ప్రజా ప్రదర్శన అనంతరం లూథరన్ హైస్కూల్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ జరిగింది. సభకు పార్టీ డెల్టా జిల్లా కమిటీ కార్యదర్శి బి.బలరాం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ మార్క్సిస్టు పార్టీ త్వరలోనే పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందన్నారు. సామాజిక దౌర్జన్యం విపరీతంగా పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. లాల్-నీల్ ఐక్యత సాధించి మతోన్మాద బీజేపీని గద్దె దింపుతామని ప్రకటించారు. తుందుర్రు మెగా ఆక్వా ఫుడ్ పార్క్‌ను మూసివేసే వరకు తమ పార్టీ మద్దతుగా ఉంటుందని చెప్పారు. దళితులు, గిరిజనులు, మహిళలు, ముస్లింలను వేధిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్‌పరివార్ శక్తుల మోరల్‌పోలీసింగ్ నుంచి ఎర్రజెండ రక్షణ కల్పిస్తుందన్నారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర బడ్జెట్ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించలేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర స్థిరనిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదాపై బీజేపీని విమర్శిస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు తెలుగుదేశం పార్టీ మోసం కనపడటంలేదా అని ప్రశ్నించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ తుందుర్రు ఆక్వా పార్క్ ప్రారంభానికి చంద్రబాబు హెలికాప్టర్‌లో బయలుదేరబోతే సీపీఎం ఎర్రజెండా ఇచ్చిన రెడ్ సిగ్నల్‌తో తోకముడిచారని వ్యాఖ్యానించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, డి.రమాదేవి మాట్లాడారు. వేదికపై సీపీఎం

- మిగతా 2 లో

విశాఖలోనే రైల్వేజోన్!

- నాలుగు డివిజన్లతో ఏర్పాటు యోచన
- తూర్పు కోస్తాలోనే కేకే లైన్
- త్వరలో రైల్వేశాఖమంత్రి ప్రకటన?



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:
బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం కావడంతో కొత్త రైల్వేజోన్ ఏర్పాటుకు సంబంధించిన ప్రకటన కొద్ది రోజుల్లోనే వెలవడే అవకాశాలు కన్పిస్తున్నాయి. ప్రజాభీష్టానికి అనుగుణంగా రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఉభయసభల్లోనూ నినదించడంతో కేంద్రంలో వేడిపుట్టింది. ముఖ్యంగా విశాఖ కేంద్రంగా కొత్త రైల్వేజోన్‌పై కసరత్తు ప్రారంభమైంది. ఈవిషయమై రెండ్రోజుల క్రితమే కేంద్రమంత్రులు అరుణ్‌జైట్లీ, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రదాన్, సుజనచౌదరి చర్చించి ఒక అవగాహనకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం వాల్తేరు డివిజన్ పరిధిలో 80 శాతాన్ని తూర్పు కోస్తా రైల్వేలోనే కొనసాగించే విధంగా తీసుకున్న నిర్ణయానికి ఒడిశా ప్రభుత్వం కూడా అంగీకరించినట్లు తెలిసింది. మిగిలిన 20 శాతాన్ని కొత్తజోన్‌లో చేర్చి విశాఖను కేంద్రంగా ప్రకటించనున్నారు. తూర్పు కోస్తా రైల్వే జోన్‌లో వాల్తేరు, సంబల్‌పూర్, ఖుర్దా రోడ్ డివిజన్లు ఉన్నాయి. వీటిలో వాల్తేరు డివిజన్‌లో ఇనుప ఖనిజం, ఇతర సరుకుల రవాణాపై వచ్చే ఆదాయంపైనే తూర్పుకోస్తా జోన్ మనుగడ ఆధారపడి ఉంది. ఈ జోన్ నుండి వాల్తేరును విడదీసి దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లలో కలిపి మొత్తం నాలుగు డివిజన్లతో కొత్త జోన్‌ను

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ఇంటర్ ప్రాక్టికల్స్‌పై కార్పొరేట్ పంజా!

- జంబ్లింగ్‌లో కూడా విద్యార్థులనుంచి వసూళ్లు
- కళాశాలల మధ్య పరస్పర సహకారం
- ఇన్విజిలేటర్లకు సైతం కాసుల ఎర
- ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలపై ఆరోపణల వెల్లువ



విశాలాంధ్ర-విశాఖసిటీ :
రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 1 నుంచి జరుగుతున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలల్లో పలు అవకతవకలు జరుగుతున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతునాయి. పరీక్షల్లో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం ఉండకూడదనే ఆలోచనతో ఇంటర్మీడియట్ బోర్డు ఎన్ని పగడ్బంది చర్యలు చేపట్టినా పరిస్థితి యధావిధిగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రయోగ పరీక్షల్లో అవకతవకలు నివారించటానికి జంబ్లింగ్ విధానం ప్రారంభించినా

- మిగతా 2 లో

ఆర్మీ క్యాంపుపై ఉగ్రదాడి

ఇద్దరు అధికారుల మృతి : నలుగురికి గాయాలు

అణువణువు జల్లెడ.. నగరంలో హైఅలర్ట్



జమ్మూ :
జమ్మూలోని సుంజవ్ ఆర్మీ క్యాంప్‌పై శనివారం ఉదయం ఉగ్రవాదులు పంజా విసిరారు. ఈ దాడిలో ఇద్దరు జూనియర్ కమిషన్డ్ అధికారులు (జేసీఓలు) మృతి చెందగా, కల్నల్ ర్యాంక్ అధికారి, ఆర్మీ సుబేదార్ కుమార్తెతో సహా నలుగురు గాయపడ్డారు. ఉగ్రదాడిలో సుబేదార్ మదన్‌లాల్ చౌదరి, సుబేదార్ మహమ్మద్ అష్రాఫ్ మీర్ ప్రాణాలు కోల్పోయినట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అబ్దుల్

- మిగతా 2 లో

సిరియాలో ఇజ్రాయిల్ దాడులు



దమాస్కస్ : ఇజ్రాయిల్ సిరియాలో భారీస్థాయిలో వైమానిక దాడులు జరిపింది. సిరియా తమ ఎఫ్-16 యుద్ధ విమానాలను పూడ్చివేసినందుకు ప్రతీకారంగా తాము ఈ దాడులు నిర్వహించినట్టు ఇజ్రాయిల్ పేర్కొంది. దమాస్కస్‌కు సమీపంలో 4 ఇరాన్ స్థావరాలతో సహా మొత్తం 12 స్థావరాలపై తాము దాడులు నిర్వహించినట్టు ఇజ్రాయిల్ సైనిక ప్రతినిధి జొనథాన్ కాంక్రికస్ తెలిపారు. ఇరాన్ స్థావరాలపై దాడులు జరిపి తిరిగివస్తున్న ఎఫ్-16 విమానాన్ని కూల్చివేసినట్టు ఇజ్రాయిల్ పేర్కొంది. విమానంలోవున్న ఇద్దరు పైలెట్లలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారని ఒకరు ఏదో విధంగా తప్పించుకుని కిందకు దిగారని ఆ ప్రతినిధి తెలిపారు. జెడ్ విమానం ఆయా స్థావరాలపైన దాడులు జరిపిందా? లేక పైలెట్లు విమానాన్ని వదిలేసి కిందకు దూకారా? అనేది స్పష్టతకాలేదు. పాల్‌మిరా నగరానికి సమీపంలో ఇరాన్ డ్రోన్ విమానాల నియంత్రణ స్థావరాన్ని ధ్వంసం చేసేందుకు ఇజ్రాయిల్ జెట్ విమానాన్ని పంపింది. ఆ ప్రాంతానికి వెళ్లిన జెట్ విమానాన్ని కూల్చివేసినట్టుగా తెలుస్తోంది. దాదాపు 8 ఏళ్ల క్రితం సిరియాలో అంతర్యుద్ధం ప్రారంభమైన తరువాత ఇదే అత్యంత తీవ్రమైన హింసాయుత సంఘటనగా పేర్కొన్నారు. సిరియా, ఇరాన్‌లు అగ్నితో చెలగాటమాడుతున్నాయని ఇజ్రాయిల్ వ్యాఖ్యానించింది. ఇజ్రాయిల్ తాజాగా జరిపిన దాడుల్లో ఎవరైనా మృతిచెందారా? లేదా? అన్న విషయం తెలియరాలేదు. తమ దేశంలోని సైనిక స్థావరంపై దాడికి పూనుకున్న ఇజ్రాయిల్ జెట్ విమానాలపై కాల్పులు జరిపినట్టుగా సిరియా ప్రభుత్వ మీడియా తెలియజేసింది.

హంగరీ, సెర్బియా వ్యూహాత్మక భాగస్వామ్యం



బుడాపెస్ట్ : హంగరీ, సెర్బియా మధ్య దీర్ఘకాలికంగా కొనసాగుతున్న బలమైన సంబంధాలు త్వరలో వ్యూహాత్మక భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టనున్నాయని హంగరీ ప్రధాని విక్టర్ ఓర్బన్ తెలిపారు. ప్రస్తుతం రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని వివిధ రంగాలలో అనేక ఒప్పందాలపై సంతకాలు చేస్తున్నామని, స్నేహం త్వరలో వ్యూహాత్మక భాగస్వామ్యంగా అవతరిస్తుందని ఓర్బన్ ఇక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. దేశంలో పర్యటిస్తున్న సెర్బియా ప్రధానమంత్రి అనబ్రనబిక్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రెండు దేశాలు కలిసి తమ సరిహద్దులను కాపాడుకోవలసిన అవసరంవుందని ప్రజల భద్రతకోసం, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకునేందుకు వ్యూహాత్మక భాగస్వామ్యం అవసరమని ఓర్బన్ అన్నారు. హంగరీ దక్షిణ సరిహద్దు మీదుగా దేశంలోకి వచ్చే వలసల ప్రవాహాన్ని నిలిపివేసేందుకు సెర్బియా సహకరించిందని చెప్తూ ఓర్బన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పోలెండ్, హంగరీ, చెకస్లోవేకియా, స్లోవేకియాల తరపున ఓర్బన్ మాట్లాడుతూ తమ గ్రూపుకు హంగరి అధ్యక్ష బాధ్యత వహించనున్నదని చెప్పారు. తమ గ్రూపును విస్తరించేందుకు 2025ను గడువుగా పెట్టుకున్నామని అయితే బాల్కన్ దేశాలమధ్య వివాదాలు ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఆటంకం కావచ్చునని ఓర్బన్ చెప్పారు.

వియత్నాం విజయం 50వ వార్షికోత్సవాలు



హవానా : అమెరికాతో 1968 ప్రాంతంలో జరిగిన యుద్ధంలో వియత్నాం సాధించిన విజయానికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఇక్కడ వేడుకలు జరుపుకున్నారు. క్యూబాలో వియత్నాం రాయబారి గుయన్‌ట్రంగ్‌థాన్ ఈ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు సాధించిన విజయం దేశవిముక్తికి గొప్ప మలుపుగా ఆయన అభివర్ణించారు. వియత్నాం సైనిక పురోగతికి ఆనాటి సంఘటన నూతన ముందడుగు అని గుయన్ అన్నారు. కమ్యూనిస్టు పార్టీ, దేశాధ్యక్షుడు హోచిమిన్ మార్గదర్శకత్వంలో ఆనాటి విజయం సాధ్యమయ్యిందని గుయన్ వెల్లడించారు. దేశం అనేక ముఖ్యమైన విజయాలను సాధించిన సందర్భంగా 50వ వార్షికోత్సవాలు జరగటం ఆనందంగా ఉందని అన్నారు. వియత్నాం ప్రజలు ఆనాడు సాగించిన ప్రతిఘటన పోరాటానికి ప్రపంచ ప్రజలు ఎటువంటి షరతులు లేకుండా తమ తోడ్పాటు అందించారని, ప్రత్యేకించి క్యూబా ప్రజల తోడ్పాటును మరువలేమని గుయన్ తెలిపారు. క్యూబా విప్లవనేత ఫిడెల్‌కాస్ట్రో యుద్ధం సందర్భంగా చెప్పిన మాటలను ఏనాటికీ మరువలేమని అన్నారు.

క్యూబా ప్రజలు తమ రక్తాన్ని ధారపోసేందుకు ఇష్టపడుతున్నారని చెప్పిన తరువాతనే ప్రపంచవ్యాప్తంగా సంఘీభావ ఉద్యమం అత్యంత వేగంగా వ్యాపించిందని అన్నారు. 1963లో దక్షిణ వియత్నాం సంఘీభావ కమిటీ ఏర్పడింది. దక్షిణ వియత్నాం జాతీయ విముక్తి ఫ్రంట్‌కు సంఘీభావాన్ని తెలియజేసిన దేశాలలో క్యూబా మొదటిదని, విముక్తిజోన్‌లో రాయబార కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయడం ద్వారా మరింత తోడ్పాటు నందించిందని గుయన్ అన్నారు. 1973లో దక్షిణ వియత్నాం ప్రాంతంలోని విముక్తి జోన్‌లో పర్యటించిన మొదటినేత కాస్ట్రో అని కూడా ఆయన చెప్పారు. రెండు దేశాల మధ్య ప్రత్యేకమైన స్నేహసంబంధాలు, విశ్వసనీయమైన సంఘీభావం అసాధారణమైన పారదర్శకమైన సౌభ్రాతృత్వం నెలకొనివున్నాయని ఇవే రెండు దేశాల మధ్య సంబంధాలు పటిష్టమయ్యేందుకు దోహదం చేశాయని ఆయన చెప్పారు.

సూడాన్ జైళ్లలో ఖైదీలపై చిత్రహింసలు



ఖర్టోమ్ : ఇటీవల సూడాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిపి ప్రభుత్వాన్ని స్తంభింపజేసిన విషయం తెలిసిందే. ఈ ప్రదర్శనల్లో పాల్గొని అరెస్టయి జైళ్లకు వెళ్లిన అనేక మంది రాజకీయ ఖైదీలను ప్రభుత్వం చిత్రహింసలకు గురి చేస్తున్నదని సూడాన్ కమ్యూనిస్టు పార్టీ నేత రషీద్ సిదా అహమ్మద్ తెలిపారు. ఆయన మార్నింగ్‌స్టార్ ఎడిటర్ బెన్‌చాకోతో మాట్లాడుతూ దేశాన్ని కుదిపివేసిన భారీ నిరసన ప్రదర్శనలకు దారితీసిన కారణాలను వివరించారు. ప్రదర్శనల్లో పాల్గొన్నవారిని అరెస్టుచేసి జైళ్లలోపెట్టి తీవ్రంగా హింసిస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ముక్తార్‌అల్ ఖతియబ్‌ను కూడా అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఆయన విడుదలకు 60 కమ్యూనిస్టు పార్టీలకుపైగా డిమాండ్ చేస్తూ ప్రకటన జారీ చేశాయి. జైళ్లలో ఉన్నవారికి కనీసం వైద్య సౌకర్యం కల్పించవలసిందిగా రషీద్ విజ్ఞప్తి చేశారు. అలాగే న్యాయ సహాయం కూడా అందించాలని ఆయన కోరారు. కొద్దిమంది ఖైదీలను విడుదల చేశారు. అనేకమంది ఇంకా ప్రమాదకర పరిస్థితుల్లోనే ఉన్నారు. కమ్యూనిస్టు నేతలు కమల్‌కరర్ ముహిదీన్‌అల్‌జలాగ్, సిద్దీకబలొ తదితరులను జలింగీ జైలుకు బదిలీ చేశారు. ఆ జైలులో తీవ్ర చిత్రహింసలకు గురి చేస్తారన్న అంశం చాలాకాలంగా రూఢిపడింది. వారి భద్రతపై ఆందోళనగా ఉంది. అనేకమందికి వైద్య సహాయం అవసరం. గతంలో అరెస్టుచేసి అక్కడవుంచిన మరికొంతమందికి కూడా వైద్యం అవసరమయ్యింది. అనేకమంది ఖైదీలు రిస్క్‌కు గురి అవుతున్నారు. వారిని పెట్టే బాధలకు అంతులేకుండా ఉంది. చిత్రహింసలు పెట్టి చివరకు హత్యలు కూడా చేస్తున్నారని రషీద్ తెలిపారు. 300 మందికిపైగా ప్రదర్శకులను అరెస్టు చేశారని వీరిలో అన్ని పార్టీలకు చెందినవారు ఉన్నారని ఆయన చెప్పారు. అధికార నేషనల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని అరెస్టు చేయలేదని చెప్పారు. సబ్సిడీలను ఎత్తివేయడం ఆహార ఇతర నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు వ్యతిరేకంగానే ప్రజలు నిరసన తెలియజేశారు.

ఈఫిల్‌టవర్ మూసివేత...

పారిస్ : ఐరన్‌లేడీగా పిలిచే ఈఫిల్‌టవర్‌ను భారీగా మంచు కురవటంమూలంగా రెండు రోజులపాటు సందర్శకులను అనుమతించకుండా మూసివేశారు. శుక్ర, శనివారాలలో మూసివేస్తున్నట్టు ఈఫిల్‌టవర్ వర్గాలు తెలిపాయి. సందర్శకుల భద్రతకోసమే ఈ పనిచేశామని నిర్వాహక కంపెని తెలియజేసింది. భారీగా మంచు కురవడం అతి తక్కువ ఉష్ణోగ్రతలు మూలంగా బ్లాక్‌ఐస్ ఏర్పడుతున్నదని దీనివల్ల టవర్ మెట్లు ఎక్కేందుకు వీలుకాదని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. మంచును తొలగించిన తరువాత తిరిగి సందర్శకులను అనుమతిస్తామని కంపెనీ పేర్కొంది. మంగళవారం కూడా టవర్‌ను సందర్శించేందుకు యాత్రికులను అనుమతించలేదని టవర్ పరిసరాలలోను, సమీపంలోను గడ్డకట్టుకుపోయిన మంచును తొలగించడం అంత తేలికకాదని కంపెనీ పేర్కొంది. ఆదివారం తిరిగి సందర్శకులను అనుమతించే అవకాశం ఉందని కంపెనీ పేర్కొంది.

అమెరికా బడ్జెట్ బిల్లుకు ఆమోదం

వాషింగ్టన్ : ఒక్కరోజు విరామంతో అమెరికా బడ్జెట్ బిల్లును కాంగ్రెస్ ఆమోదించింది. స్వల్పకాలిక వ్యయం బిల్లును ఆమోదించడంలో మొదట విఫలమైన కాంగ్రెస్ శుక్రవారం ఉదయమే తన ఆమోదాన్ని తెలియజేసింది. కొన్ని గంటలు మాత్రమే ప్రభుత్వ కార్యకలాపాలు నిలిచిపోయాయి. గురువారం అర్ధరాత్రి బిల్లును కాంగ్రెస్ ఆమోదించకపోవడంతో కొన్ని గంటలు ప్రభుత్వం పనిచేయలేదు. ఈ బిల్లుకు ముందు సెనేట్ ఆమోదం తెలియజేసింది. ఆ తరువాత ప్రతినిధుల సభలో బిల్లుకు 240 మంది అనుకూలంగా 186 మంది వ్యతిరేకంగా ఓటు చేశారు. డెమోక్రటిక్ పార్టీ ఎంపీలు వ్యతిరేకత తెలియజేశారు. కొంతమంది రిపబ్లికన్ సభ్యులు సైతం వలసకు సంబంధించిన వ్యయాన్ని కూడా బిల్లులో నిర్ధారించాలని కోరుతూ తమ వ్యతిరేకతను ప్రకటించారు. దీంతో బిల్లు ఆమోదం ఆగిపోయింది. సెనేట్‌లో 71 మంది అనుకూలంగా, 28 మంది ప్రతికూలంగా ఓటు చేశారు. ప్రతినిధుల సభ ఆమోదించినందున బిల్లును అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం కోసం పంపారు.

ఈ బిల్లు ఆమోదిస్తే రుణభారం పెరుగుతుందని ద్రవ్యలోటు ఏర్పడుతుందని చెప్తూ గురువారం రాత్రి సెనెటర్ రాండ్‌పాల్ తన అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. దీంతో అర్ధరాత్రి వరకు బిల్లు ఆమోదం పొందకుండా ఆగిపోయింది. రక్షణ, రక్షణేతర రంగాలలో వ్యయాన్ని దాదాపు 300 బిలియన్ డాలర్లకు పెంచేందుకు వీలుకలుగుతుంది.

ఫ్రాన్స్ విమానయాన కార్మికసమ్మె

పారిస్ : ఫ్రాన్స్‌లో విమానయాన కార్మికుల సమ్మె ఈనెల 22 నుండి ప్రారంభంకానుంది. వివిధ కార్మిక యూనియన్లు ఈమేరకు పిలుపునిచ్చాయి. 6 శాతం వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నట్టు యూనియన్లు తెలిపాయి. అయితే యాజమాన్యం ఒక్కశాతం మాత్రమే వేతనాలు పెంచుతామని ప్రకటించడంతో యూనియన్లు దాన్ని తిరస్కరించాయి. ఈ ఒక్కశాతం పెంపుదల బిచ్చమెత్తడంలాంటిదని యూనియన్లు అభివర్ణించాయి. జీవన వ్యయం భారీగా పెరిగినందున వేతనాలను పెంచవలసిందేనని 2011 నుంచి ఇంతవరకు వేతనాల పెంపుదల జరగలేదని యూనియన్లు తెలిపాయి. మూడు పైలెట్ల యూనియన్లు, రెండు సిబ్బంది యూనియన్లు, 4 కార్మిక యూనియన్లు సమ్మెకు పిలుపునిచ్చాయి. ఫ్రాన్స్‌లో ఇవి అత్యంత తీవ్రమైన సంఘటనగా చూస్తున్నారు. 2016 వేసవిలో కూడా ఎయిర్ ఫ్రాన్స్ ఉద్యోగుల సమ్మె చేశారు.

ఆర్మీ క్యాంపుపై ఉగ్రదాడి

(మొదటిపేజీ తరువాయి)

రెహమాన్ వీరి తెలిపారు. జమ్మూకాశ్మీర్ అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ కల్నల్ ర్యాంగ్ ఆర్మీ అధికారి, హవల్దార్ అబ్దుల్ హమీద్, సుబేదార్ చౌదరి కుమార్తె లాన్స్ నాయక్ బహదూర్ సింగ్ గాయపడినట్టు వెల్లడించారు. సభలో బీజేపీ సభ్యుల పాకిస్థాన్ వ్యతిరేక నినాదాల నడుమ మంత్రి ఉగ్రదాడికి సంబంధించిన వివరాలను తెలిపారు. ఈ దాడి వెనుక జైషే మహమ్మద్ తీవ్రవాదుల హస్తం ఉన్నట్టు అధికారులు చెప్పారు. అయితే ఎంతమంది ఉగ్రవాదులు దాడిలో పాల్గొన్నది తెలియలేదు. పీసీఆర్ జమ్మూకు అందిన కాల్స్ మేరకు నలుగురు లేదా ఐదుగురు పాల్గొన్నట్టు తెలుస్తోంది. ఆర్మీ క్యాంపు వెనుగ భాగంలో ఉన్న ఫ్యామిలీ క్వార్టర్స్ వైపు నుంచి ఉగ్రవాదులు చొరబడినట్టు డీజీపీ ఎస్పీ వెయిద్ తెలిపారు. ఐజీపీ ఎస్‌డీ సింగ్ జామ్వాల్ మాట్లాడుతూ 'శనివారం ఉదయం 4.55 గంటల సమయంలో అనుమానస్పద కదలికలను సెంట్రీ (గార్డ్) గమనించారు. ఇంతలోనే ఆయన బంకర్‌ను ఉగ్రవాదులు పేల్చివేశారు. మంటలను అదుపుచేశాం. అయితే దాడిలో పాల్గొన్న ఉగ్రవాదుల సంఖ్య తెలియలేదు. వారంతా ఫ్యామిలీ క్వార్టర్స్‌లో నక్కిఉన్నారు.' అని చెప్పారు. దాడి జరిగిన వెంటనే ఆర్మీ ప్రత్యేక దళాలు, ఎస్ఓజీలు అక్కడకు చేరుకొని, ఆ ప్రాంతాన్ని ముట్టడించగా.. భీకర పోరు జరిగిందన్నారు. ఆ ప్రాంతంలోని అన్ని స్కూళ్లను మూసివేశారు. నగరంలో హైఅలర్ట్ ప్రకటించారు. భద్రతా బలగాలు, పోలీసులు ఆర్మీ క్యాంపు చుట్టుపక్కల ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. ఈనెల 9వ తేదీ అఫ్జల్‌గురు వర్ధంతి సందర్భంగా ఆర్మీ స్థావరాలను జైషే తీవ్రవాదులు టార్గెట్ చేసినట్టు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం.

విశాఖలోనే రైల్వేజోన్!

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేయాలని రైల్వే రెండేళ్ల క్రితమే భావించింది. కొత్తజోన్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై బోర్డు అధ్యయనం చేసింది. అయితే ఇందుకు ఒడిశా ప్రభుత్వం తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ ప్రతిపాదన అటకెక్కింది. తాజాగా చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కొత్తజోన్‌పై ప్రకటన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్ పరిధి దువ్వాడ వరకూ ఉంది. దువ్వాడ-విశాఖపట్నం-పలాస సెక్షన్‌లో మెయిన్ లైన్‌కు చెందిన 213 రూట్ కిలోమీటర్ల మార్గాన్ని మాత్రమే కొత్తజోన్‌లో చేర్చనున్నారు. కేకే లైన్‌గా వ్యవహరించే కొత్తవలస-కిరండోల్ సెక్షన్, కోరాపుట్-రాయగడ సెక్షన్, విజయనగరం-సింగపురంరోడ్-తేరుబలి సెక్షన్, కొత్తవలస-సింహాచలం సెక్షన్, బొబ్బిలి-సాలూరు సెక్షన్, నౌపాడ-గుణుపూర్ సెక్షన్లను తూర్పు కోస్తాలోనే కొనసాగనున్నాయి. పాలనాపరమైన అంశాల ప్రకారం వీటిలో కొన్ని కొత్తజోన్‌లో చేర్చే అవకాశం ఉంది.

విశాఖ కేంద్రంగా ప్రకటించే కొత్త జోన్‌లో విశాఖ డివిజన్‌తోపాటు విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లను చేర్చనున్నారు. ఈ విషయాలపై అటు దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ఇటు తూర్పు కోస్తా రైల్వే అధికారులతో రైల్వేబోర్డు చర్చలు జరుపుతోంది. దీనిపై వారం రోజులో స్పష్టత రాగలదని, అనంతరం ప్రధాని మోడీతో చర్చించి రైల్వేమంత్రి పీయూష్ గోయల్ ప్రకటన చేయవచ్చని సమాచారం. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 13 (మౌలిక సదుపాయాలు) సెక్షన్ - 8 ప్రకారం షెడ్యూల్ ప్రకారం నవ్యాంధ్రలో కొత్త రైల్వేజోన్‌ను ఏర్పాటు చేస్తామని పార్లమెంటులో ప్రకటించారు. రాష్ట్ర విభజన ప్రకటన విడుదలైన రోజు (అపాయింటెడ్ డే) నుండి 6 నెలలలోపు నవ్యాంధ్రలో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. దీని ప్రకారం 2014 డిసెంబరు 2 నాటికి కొత్త రైల్వే జోన్‌ను ప్రకటించాల్సి ఉంది. అయితే కేంద్రం అనేక కుంటి సాకులు చెబుతూ 44 నెలలు గడిపేసింది. బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయంపై వామపక్షాలు పిలుపు మేరకు ఇటీవల జరిగిన రాష్ట్ర బంద్ సంపూర్ణంగా విజయవంతం కావడంతో కేంద్రం దిగివచ్చిందనడానికి ఈ పరిణామాలే ఉదాహరణగా నిలుస్తాయి.

ఇరకాటంలో బాబు!

(మొదటిపేజీ తరువాయి)

రోజుల్లో ఏపీకి చేసే కేటాయింపులు ఏమాత్రం ఉండవనే తేల్చిచెప్పాలరు. అయినా సరే మిత్రపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీ మాత్రం బయటకు వచ్చే సాహసం చేయలేకపోతోంది.

బీజేపీ కోర్టులోకి విభజన హామీల బాల్!

చంద్రబాబు నాయుడు అత్యంత చాకచక్యంగా వ్యవహరించాలని నిర్ణయించారు. ఆయన మనసులో మాటను కొద్దిరోజుల్లోనే చేతల ద్వారా చూపించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకూ సావధానంగా వ్యవహరించిన చంద్రబాబు కేంద్రబడ్జెట్ తర్వాత ఆచితూచి వ్యవహరించడానికి ప్రత్యేక కారణం లేకపోలేదు. అనితెలుగుదేశం పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. బిజెపి నాయకులు చేసే ఆరోపణలు, విమర్శలపైనకూడా తీవ్రంగా స్పందించకపోవడానికి కూడా వ్యూహం ఉందని తెలుస్తోంది. ఒక దెబ్బకు రెండు ప్రయోజనాలు వచ్చేలా చంద్రబాబు మాస్టర్‌ప్లాన్ వేసినటు, వ్యూహం రూపొందించినట్లు అధికారపార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఇది ఎపుడు,ఎలా అమలు చేస్తారన్నది ఎవరికీ అర్థంకావడం లేదు.పార్లమెంటులో ఎలా వ్యవహరించాలి, ఏమేరకు వత్తిడి తేవాలి అనే అంశంపైనకూడా చంద్రబాబు చెప్పిన విధంగానే ఎంపీలు వ్యవహరించారు. ఎక్కడా శృతిమించకుండా, మిత్రపక్షాన్ని నొప్పించకుండా, కేవలం రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని మాత్రమే నినదించేలా చూసుకున్నారు. ప్రధాని మోడీని గానీ, ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని గానీ పల్లెత్తుమాట అనకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలుగుదేశం పార్టీ అధినేతకూ తెలుసు. కానీ అసలు మౌనంగా ఉంటే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని, ఆమాత్రం అయినా నిరనసన ప్రదర్శించారు. అయితే ఎక్కువ మంది ఎంపీలు మాత్రం బీజేపీతో తెగదెంపులు చేసుకుంటేనే మంచిదనే అభిప్రాయాన్ని చంద్రబాబు దగ్గర విన్పించారు. లేకపోతే ప్రజలకు సమాధానం చెప్పలేమని కూడా వివరించారు. ఇపుడు కేంద్రంతో వైరం పెట్టుకుంటే తమకంటే వైసీపీకి ఎక్కువ మేలు జరుగుతుందనే భయంతో చంద్రబాబు ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ కోణంలో కూడా ఆయన అంచనా వేస్తున్నారు.

గత కొంతకాలం నుంచీ బిజెపి అధినాయకత్వం వైసీపీతో ఎక్కువ సన్నిహితంగా ఉంటోంది. రాష్ట్రపతి ఎన్నిక సమయం నుంచీ బిజెపితో ఎక్కువ సాన్నిహిత్యం ఏర్పడింది. ఇపుడు పీఎంఓలో తెలుగుదేశం పార్టీకంటే కూడా వైసిపికి ఎక్కువ పలుకుబడి ఉంది. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి కూడా చంద్రబాబు ప్రధాని మోడీ అప్పాయింట్‌మెంటు కోసం 16నెలలు ఆగాల్సి వచ్చింది. కానీ వైసిపి ఎంపీ విజయసాయిరెడ్డి ఎపుడంటే అపుడు ప్రధానిని కలిసే ఏర్పాట్లు చేసుకున్నారు. దీన్ని కూడా చంద్రబాబు పరిగణనలోకి తీసుకున్నారు. అందుకే బీజేపీతో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అయినప్పటికీ ఆఖరునిమిషయంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి బిజెపి నే కారణం అని నింద వేసి వైదొలిగే ఏర్పాట్లు కూడా చంద్రబాబు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం చేయాల్సిన కనీస సహకారం ఇవ్వలేదు, విభజన చట్టంలోని అంశాలను కూడా పట్టించుకోలేదు.

తన కష్టార్జితంతో రాష్ట్రాన్ని ఈమాత్రం అయినా అభివృద్ధి చేస్తున్నాను. అని బీజేపీని దోషిగా చూపించే యత్నం తెలుగుదేశం అధినాయకత్వం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనివల్ల ఒచ్చే ప్రయోజనం ఎంతమేరకు ఉంటుంది అనే అంచనా కూడా చంద్రబాబు వేస్తున్నారు. ఏమైనా తొందరల్లోనే బిజెపి, తెలుగుదేశం మైత్రీ బంధంపై కీలక నిర్ణయం వెలువడే అవకాశం మాత్రం ఉంది.

కార్పొరేట్ పంజా!

(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటర్మీడియట్ సైన్స్ గ్రూప్ విద్యార్థులకు గత ఏడాది నుంచి జంబ్లింగ్ విధానంలో ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 1 నుంచి 22 వరకు సుమారు 985 పరీక్షా కేంద్రాల్లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2.5 లక్షల మంది పైచిలుకు విద్యార్థులు ఈ ప్రాక్టికల్ పరీక్షలు రాస్తున్నారు. పరీక్షలు విడతల వారీగా నిర్వహించడానికి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జంబ్లింగ్ విధానమైనా మార్కులు మా చేతుల్లోనే ఉంటాయని, వేరే పరీక్షా కేంద్రమైనా అక్కడ కూడా మనవారే ఉంటారని చెప్తూ వారు చేసిన సహాయానికి తగిన ఫలం ఇవ్వాలంటూ ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.500 నుంచి 1000 వరకు వసూలు చేస్తున్నట్టు విద్యార్థుల తల్లితండ్రులు వాపోతున్నారు.

పరస్పర సహకారం

ఒక కళాశాల విద్యార్థి మరో కళాశాలకు ప్రయోగ పరీక్షలకు హాజరు కావడంతో ఆ కళాశాలల యాజమాన్యాలు పరస్పర సహకారం అందించుకోవడానికి వచ్చాయనే ఆరోపణలు మిన్నంటాయి. అధ్యాపకులకు కూడా జంబ్లింగ్ విధానం ఉంది కాబట్టి ఏం అవకతవకలు జరగవని అధికారులు భావిస్తుంటే ఆ జంబ్లింగ్‌ను కూడా వీరు అనుకూలంగా మార్చుకుని విద్యార్థుల దగ్గర వసూళ్లకు పాల్పడుతున్నారని తెలుస్తోంది. పలానా రోజు ఆ కళశాలలో ఏ అధ్యాపకుడు ఎగ్జామినర్లుగా హాజరవుతారనే సమాచారం కొంత ముందుగానే తెలియడంతో ఆ సమయాన్ని బేరసారాలకు అనుకూలంగా మార్చుకుంటున్నారని. దీంతో పాటు అధ్యాపకులకు జంబ్లింగ్ ఉన్నప్పటికీ ఆయా విద్యార్థులు మాత్రం అన్ని ప్రయోగ పరీక్షలు ఒకే కేంద్రంలో రాసినట్లయితే ఆ కేంద్రంతో ఒప్పందానికి వచ్చి అక్కడి ఎగ్జామినర్‌కు సైతం డబ్బులు ఎర చూపుతున్నారనే ఆరోపణలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. కొంత మంది ఎగ్జామినర్లకు ఒక్కొక్కరికి రూ.5 వేల వరకు ఇస్తున్నారనే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల్లో ప్రయోగ శాలలు లేవని, కొన్ని చోట్ల ఉన్నా లేనట్లేనని ఈ నేపథ్యంలో అక్కడ విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఎలా రాయగలుగుతారని దీన్ని ఆసరా చేసుకునే అవకతవలకు తెరతీసారని ఆరోపణలు వస్తున్నాయి.

ఎన్ని సీసీ కెమెరాలు, పగడ్బందీ చర్యలు, జంబ్లింగ్ విధానాలు ప్రవేశ పెట్టినా కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు తమకు అనుకూలంగా మార్చుకుంటూ విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నాయని ఇకనైనా అధికారులు ఈ అంశాలపై దృష్టి సారించాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

బీజేపీని గద్దె దింపుతాం

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు, డా॥ హేమలత, ఆర్.అరుణ్‌కుమార్, పాటూరు రామయ్య, రాష్ట్ర నాయకులు వి.ఉమామహేశ్వరరావు, సీహెచ్.బాబూరావు, వి. కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే ఆర్. సత్యనారాయణరాజు (ఆర్.ఎస్), మంతెన సీతారాం తదితరులు ఆశీనులయ్యారు.

పూర్వ వైభవం తెద్దాం

(మొదటిపేజీ తరువాయి)

బస్సుయాత్రలు చేసింది వామపక్షాలేనని గుర్తు చేశారు. బడ్జెట్‌కు నిరసనగా 8న బంద్ పిలుపునిచ్చి విజయవంతం చేసింది వామపక్షాలేనని మనం ప్రకటించాకే అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని కలిసికట్టుగా ముందుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు.

భారత్- ఆసియన్ సంబంధాలు

'యాక్ట్ ఈస్ట్'తో బలోపేతం

విశాలాంధ్ర- మధురవాడ : ఆసియా ఉపఖండంలో కూటమిగా ఉన్న ఆసియన్ దేశాలతో భారతదేశం అమలు చేస్తున్న 'యాక్ట్ ఈస్ట్' వ్యూహాత్మక విధానం వాణిజ్యపరమైన అంశాలతో పాటు భద్రతా అంశాలకు కీలకమైనదిగా మారుతోందని భారత్‌లో మయన్మార్ రాయబారి మోక్యా అంగ్ పేర్కొన్నారు. భారత్-ఆసియన్ 25 ఏళ్ళ భాగస్వామ్యంపై విశాఖలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ వాణిజ్య విద్యా విభాగం శనివారం నిర్వహించిన అంతర్జాతీయ వాణిజ్య విద్యావిభాగం అంతర్జాతీయ సదస్సుకు ఆయన హాజరై ప్రసంగించారు. భారత్, మయన్మార్, థాయ్‌లాండ్‌ల మధ్య జాతీయ రహదారుల నిర్మాణం, 69 వంతెనల నిర్మాణానికి భారతదేశం 245 మిలియన్ డాలర్ల నిధులను కేటాయించడం అభినందనీయమన్నారు. ఆసియన్ దేశాలతో మైత్రీ వారధిగా భారత్-వియత్నాం- మయన్మార్-లావోస్-కంబోడియాలను కలిపే జాతీయ రహదారి నిర్మాణానికి భారత్ ముందుకు రావడం చారిత్రాత్మకం అన్నారు. గీతం ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.రామకృష్ణారావు మాట్లాడుతూ గాంధీ ఆలోచనలను, ఆయన చూపిన మార్గాన్ని అనుసరిస్తూ భారత్-ఆసియాన్ దేశాలు శాంతి- సుస్థిర అభివృద్ధి కోసం మరింతగా ఏకం కావాలన్నారు.

సీఎల్ఎమ్‌వీ దేశాలపై భారత్ [illegible]

ఆసియన్ ప్రాంతంలో సీఎల్ఎమ్‌వీ దేశాలుగా పిలిచే కంబోడియా, లావో పీడీఆర్, మయన్మార్, వియత్నాం దేశాలపై భారతదేశం ప్రస్తుతం కీలకమైన దృష్టి సారించిందని భారత ప్రభుత్వ ఎగుమతులు, దిగుమతులు బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ ప్రహ్లాదన్ అయ్యర్ వెల్లడించారు. ఆరోగ్య రంగం, వ్యవసాయ ప్రాసెసింగ్ పరిశ్రమలు, పర్యాటకం, ఔషధాల తయారీ, విద్యారంగాల్లో కంబోడియాలో లావో పీడీఆర్ పెట్టుబడులను ఆహ్వానిస్తోందని తెలిపారు. ఈ దేశాలలో తయారీ కేంద్రాల అభివృద్ధికి భారత ప్రభుత్వం రూ.500 కోట్ల రూపాయిలతో ప్రాజెక్టు డెవలప్‌మెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాదరావు విశ్వవిద్యాలయం ప్రగతిని వివరిస్తూ ప్రపంచంలోని అత్యుత్తమ దేశాలతో తాము మేధో సంబంధాలకు ఆసక్తితో ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో జీఎస్ఐబీ జాయింట్ డైరక్టర్ ప్రొఫెసర్ కె.కె.నారాయణన్, సదస్సు కన్వీనర్ డాక్టర్ రాధా రఘురామ పాత్రుని, భారత ప్రభుత్వ విదేశీ వాణిజ్య విభాగం డైరక్టర్ జనరల్ అలోక్ ద్వివేది, ఇండియన్ కోస్ట్ గార్డ్ మాజీ డైరక్టర్ జనరల్ డాక్టర్ ప్రభాకరన్ పలేరి, [illegible] కేంద్రం గౌరవ డైరక్టర్ ప్రొఫెసర్ [illegible] జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ అధ్యయన కేంద్రం డీన్ ప్రొఫెసర్ అజయ్‌పట్నాయిక్ పాల్గొని ప్రసంగించారు.

గరగపర్రు దళితుల సమస్య పరిష్కరించండి

ముఖ్యమంత్రికి సీపీఐ రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : పశ్చిమ గోదావరి జిల్లా గరగపర్రు దళితుల సమస్య పరిష్కారానికి అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకి లేఖ రాశారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు విషయమై దళితులను సాంఘిక బహిష్కరణకు గురిచేసిన ఘటన మీకు విదితమే. ఈ వివక్షత ఘటన సందర్భంగా రాష్ట్ర మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, పితాని సత్యనారాయణ, ఎస్సీ కమీషన్ ఛైర్మన్ కారెం శివాజీలు గరగపర్రులో పర్యటించి, పలు వాగ్దానాలు చేశారు. ఇరుపక్షాల వారికి రాజీ చేశామని ప్రపంచానికి తెలియజేశారు. ఈ రోజు నేను, మా రాష్ట్ర పార్టీ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ నెక్కంటి సుబ్బారావు, పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ స్థానిక నాయకులతో కలసి గరగపర్రు గ్రామాన్ని సందర్శించాం.

ఇప్పటికీ ఆ గ్రామంలో దళితులను పనులకు పిలవడం లేదు. కౌలుకు భూములు ఇవ్వడంలేదు. రబీ కాలంలో దళితులకు కౌలుకు భూమి ఇస్తామని మాట ఇచ్చినప్పటికీ ఆచరణలో అమలు కాలేదు. దళితులను గ్రామంలో కూలిపనులకు పిలవకపోవడం వల్ల భీమవరం టౌన్‌పైన, ఇతర పల్లెలపైన ఆధారపడి జీవిస్తున్నారు. ఇది చాలా దుర్మార్గమైన పరిస్థితి. గరగపర్రు గ్రామంలో చినకాపుల యాకోబు అనుమానాస్పద పరిస్థితుల్లో యాక్సిడెంట్‌కు గురై మరణించాడు. ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుందని వాగ్దానం చేశారు. ఇంతవరకు ఆ వాగ్దానం కూడా నెరవేర్చలేదు. గరగపర్రులో ఇప్పటికీ ఇంత వివక్షత కొనసాగడం సమంజసంకాదు. మరణించిన దళితుడు యాకోబు కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలి. తక్షణమే అధికారులను ఆ గ్రామానికి పంపి అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుతోపాటు దళితుల దయనీయ పరిస్థితిని సరిదిద్దటానికి తగు చర్యలు తీసుకోవాలని రామకృష్ణ కోరారు.

హైకోర్టుకు మరిన్ని భవనాలు పరిశీలన



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్ర రాజధాని అమరావతిలో హైకోర్టు ఏర్పాటుకోసం శనివారం ఉభయ రాష్ట్రాలకు చెందిన న్యాయ బృందాలు మరిన్ని భవనాలను పరిశీలించాయి. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాల హైకోర్టు జ్యూడికేషర్ బృందం శుక్రవారం గన్నవరం వద్ద వెటర్నరీ యూనివర్శిటీని పరిశీలించగా, శనివారం కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని మరికొన్ని భవనాలను పరిశీలించాయి. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ భవనాల సముదాయాలను, యూనివర్సిటీ పక్కనే వున్న రామకృష్ణ టవర్స్, ఎదురుగా ఉన్న రెయిన్ ట్రీ విల్లాస్ ప్రైవేటు భవనాలను పరిశీలించారు. అనంతరం తుళ్లూరు ప్రాంతం నెక్కల్లు ప్రాంతాన్ని, విజయవాడ రూరల్ మండలం ఇబ్రహీంపట్నం నిమ్రా ఇంజనీరింగ్ కాలేజీ భవనాలను పరిశీలించారు. హైకోర్టు భవనాల పరిశీలన బృందంలో జస్టిస్ వి. రామసుబ్రహ్మణ్యం, సి ప్రవీణ్ కుమార్, ఎ.వి శేషసాయి, టి.సునీల్ చౌదరి, పి.సత్యనారాయణమూర్తి, కృష్ణా జిల్లా జడ్జి ఎ.వి రవీంద్రబాబు, గుంటూరు కలెక్టర్ కోన శశిధర్, విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సోము కృష్ణమూర్తి,జనరల్ సెక్రటరీ కందుల శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ పి. శ్రీమన్నారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.ఎల్ మాధవ స్వరూప్ తదితరులు ఈ బృందంలో వున్నారు.

ఏపీ టెట్ హాల్‌టిక్కెట్ల జారీలో గందరగోళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:ఏపీ టెట్ హాల్‌టిక్కెట్ల జారీలో జాప్యం నెలకొంది.విద్యాశాఖ కమిషనర్ వెబ్‌సైట్లో శనివారం సాయంత్రం రాత్రి వరకూ హాల్‌టిక్కెట్లను అధికారులు అప్‌లోడ్ చేయలేదు.చివరకు రాత్రి 8 గంటల తర్వాత టెట్ పేపర్-3(లాంగ్వేజీ) హాల్‌టిక్కెట్లను వెబ్‌సైట్లో అందుబాటులో వుంచామని ఉన్నతాధికారులు వెల్లడించారు. టెట్ పేపర్-1,2 హాల్‌టిక్కెట్లను ఈనెల 11వ తేదీ ఆదివారం నుంచి డౌన్‌లోడింగ్ చేసుకోవాలని సూచించారు.ఈ నెల 21 నుంచి మార్చి 3వరకూ ఏపీ టెట్ పరీక్షలను ఆన్‌లైన్లో నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసిన విషయం విదితమే. 10వ తేదీ శనివారం నుంచి టెట్ హాల్‌టిక్కెట్లను వెబ్‌సైట్లో పొందుపరుస్తామని అధికారులు వెల్లడించారు. హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడింగ్‌కు విద్యాశాఖ కమిషనర్ వెబ్‌సైట్లో అభ్యర్థులు ప్రయత్నించారు. ఎక్కడా అందుబాటులో లేనందున వారంతా భంగపాటుకు గురయ్యారు. టెట్ పేపర్-1, 2,3 పరీక్షలను ఆన్‌లైన్లో నిర్వహించేందుకుగాను ఓ ప్రైవేటు సంస్థకు ప్రభుత్వ బాధ్యతల్ని అప్పగించింది.ఈ సంస్థ ఆధీనంలో కేవలం 175 సెంటర్ల నిర్వహణకే సామర్థ్యముంది. ఏపీ టెట్(పేపర్-1,2,3) మూడు పేపర్లకుగాను 4,46,833 మంది దరఖాస్తు చేశారు.చివరి దశలో అభ్యర్థులకు 175 కంటే పరీక్షా కేంద్రాల అవసరత వుంటుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. టెట్ హాల్‌టిక్కెట్ల జారీ సమయంలో హడావుడిగా అధికారులు సమీక్షలకు నిమగ్నమైనట్లు తెలిసింది. అటు తెలంగాణా డీఎస్సీ, ఏపీ టెట్ పరీక్షల షెడ్యూలును ఒకేసారి విడుదల చేయడంతో రాష్ట్ర అభ్యర్థులు అసౌకర్యానికి గురవుతున్నారు.20శాతం కోటాలో తెలంగాణా డీఎస్సీకి ఏపీకి చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేశారు. తెలంగాణా డీఎస్సీ, ఏపీ టెట్ షెడ్యూలు ఒకే సమయంలో ఉండటంతో అయోమయానికి గురవుతున్నారు.

హస్తినలో హరి.. అమరావతిలో బాబు...

కేంద్రం ప్రకటనలపై అందరిలో అనుమానాలు



విశాలాంధ్ర అమరావతి : ఏపీ విషయంలో ఢిల్లీలో జరుగుతున్న వేగవంతమైన పరిణామాలపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. ఢిల్లీలో ఉన్న ఏపీ బీజేపీ అధ్యక్షుడు హరిబాబు రాష్ట్రానికి కేంద్రం చేసిన మేలు గురించి 27 పేజీల సుదీర్ఘ నోట్‌ను విడుదల చేస్తూ మాట్లాడారు. అమరావతిలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, బీజేపీ నేతలు ఏపీ విషయంలో తప్పుడు లెక్కలు చెబితే ధీటుగా స్పందించాలని తన పార్టీ నేతలకు ఆదేశాలు ఇచ్చారు. దీన్ని బట్టి బీజేపీ పెద్దలకు, టీడీపీ నేతలకు మధ్య ఏర్పడిన విభేదాలు సమసిపోలేదన్న సందేహాలు రాజకీయవర్గాల్లో, ఇటు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందంటూ ఐదు రోజులపాటు తెలుగుదేశం ఎంపీలు పార్లమెంట్ ఉభయసభల్లో నిరసనలకు దిగారు. ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు నిత్యం తమ పార్టీ ఎంపీలతో మాట్లాడుతూ పార్లమెంట్‌లో వ్యవహరించాల్సిన తీరు గురించి దిశా నిర్దేశం చేశారు. కేంద్రంపై పోరాటంలో వెనకంజ వేయద్దని కూడా సూచించారు. కేంద్రం వైఖరికి నిరసనగా బీజేపీ మినహా ఇతర రాజకీయ పక్షాలన్నీ గురువారం జరిగిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేశాయి. అయితే మిత్రపక్ష తెలుగుదేశం పార్టీ ఎంపీల ఆందోళనలను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరికలను కేంద్రం ఖాతరు చేయనట్లు వ్యవహరించింది. ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఉభయసభల్లో మాట్లాడుతూ ఏపీ ఎంపీల డిమాండ్లను పట్టించుకోకుండా ఏపీకి చేకూర్చే ప్రయోజనాలపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. శుక్రవారం రాత్రి రాజ్యసభలో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మాట్లాడుతూ కూడా పాతపాటనే వల్లెవేశారు. అది జరిగిన రెండు గంటల తర్వాత ఏపీ విషయంలో కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు, మార్చి 5లోపు అన్ని అంశాలపై స్పష్టత ఇవ్వనున్నట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలను టీడీపీ, బీజేపీ మినహా మిగిలిన రాజకీయవర్గాలు, ప్రజలు విశ్వసించలేదు. రాజ్యసభలో ప్రకటన చేసిన రెండు గంటలలోపే ఈ నిర్ణయం వెలువడటం అందరిలో సందేహాలను రేకెత్తించింది. ప్రధానంగా ప్రధాని మోడీ విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన ఏపీ విషయంలో తొలుత సానుకూలంగా స్పందించలేదు. అలాంటిది ఆయన లేకుండా ఏపీ విషయంలో జైట్లీ కీలక నిర్ణయాలు తీసుకున్నారంటే ఎవరికీ నమ్మకం కలగటం లేదు. ఏపీకి న్యాయం చేయాలనుకున్న కేంద్ర పెద్దలు, కేంద్ర మంత్రి సుజనాచౌదరి ప్రధాన నాయకుల చుట్టూ తిరిగి ప్రదక్షిణాలు చేసినప్పుడే జరగాల్సి ఉందని, అలాంటిది ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సమక్షంలో కేంద్రం ఏపీకి న్యాయం చేసేందుకు అంగీకరించిందని జరిగిన ప్రచారాన్ని ఎవరూ నమ్మటం లేదు. ఇదిలా ఉండగా శనివారం నాడు ఏపీ బీజేపీ అధ్యక్షుడు, ఎంపీ హరిబాబు ఢిల్లీలో విలేఖర్ల సమావేశంలో కేంద్రం ఏపీకి చేసిన మేలు గురించి మాట్లాడుతూ 27 పేజీల సుదీర్ఘ వివరాలను మీడియాకు విడుదల చేశారు. ఆయన మాట్లాడిన మాటలు, అమరావతి నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు తన పార్టీ నేతలతో చెప్పిన విషయాలు గమనిస్తే బీజేపీ, టీడీపీల మధ్య అంతగా అవగాహన కుదిరినట్లు కన్పించటం లేదు. దీనికి తోడు సాయంత్రం విశాఖ రైల్వే జోన్ మంజూరుకు కేంద్ర రైల్వే మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని వార్త వెలువడింది. ఇదిలా ఉండగా బీజేపీ అధ్యక్షుడు హరిబాబు ఇలా ఉన్నాయి. ఏపీకి కేంద్రం మంజూరు చేసిన జాతీయ సంస్థలు, ప్రాజెక్టులు, నిధులపై వివరాలను అందించటంతో పాటు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి కేంద్రం కట్టుబడి ఉందని, ఇప్పటికి 4వేల కోట్లు ఇచ్చిందని, లక్ష కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టిందని, ఉజ్వల్, 24 గంటల విద్యుత్ సరఫరా వంటి కేంద్ర పథకాలను, దుగరాజుపట్నం బదులు వేరే ప్రదేశంలో కొత్తపోర్టు నిర్మాణం చేపడుతుందని, ప్రత్యేక హోదా ప్రకటిస్తే రాష్ట్రానికి ఎంత లాభం చేకూరుతుందో అంతమేర రూపాయి తగ్గకుండా ప్యాకేజి అమలు చేస్తుందని చెప్పుకొచ్చారు.



కొన్ని రాజకీయపార్టీలు బంద్ పాటించాయని, ఏపీ న్యాయం చేయని పార్టీలు కూడా ఆ బంద్‌లో పాల్గొన్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలను గమనించి, కేంద్రంలో వచ్చిన కదలికలతో కొంతకాలం వేచి చూడాలని నిర్ణయం తీసుకున్నట్లు, అయితే బీజేపీ నేతలు ఏపీ విషయంలో తప్పుడు లెక్కలు చెబితే ధీటుగా స్పందించాలని తన పార్టీ నేతలకు సూచించారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావును మరోమారు ఢిల్లీ వెళ్లాలని ఆదేశించారు. ఏపీ విషయంలో పార్లమెంట్‌లో తిరస్కరించి ఆ తర్వాత మీడియాకు వదులుతున్న వార్తలను ఎవరూ నమ్మనిస్థితి ఏపీలో నెలకొంది. ఏది ఏమైనా కేంద్ర ప్రభుత్వం నుంచి ఏపీకి చేయాలనుకుంటున్న మేలుపై మార్చి 5లోపు స్పష్టత రానుంది. అప్పటికీ రాకుంటే టీడీపీ, బీజేపీకి మధ్య రాంరాం ఖాయమని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. జరగనున్న పరిణామాలపై వేచి చూడాల్సి ఉంది.

సీపీఎస్ రద్దు చేసేదాకా పోరాటం ఆగదు

పెన్షన్ సాధన సమితి మహాధర్నాలో వక్తల ఉద్ఘాటన



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ (సీపీఎస్) విధానాన్ని పూర్తిగా రద్దు చేసే వరకూ పోరాటం ఆగదని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. సీపీఎస్ రద్దు కోరుతూ శనివారం గాంధీనగర్ లోని ధర్నాచౌక్‌లో పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సంద ర్భంగా ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు మాట్లాడుతూ సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. వాస్తవానికి ఈ అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలో అయినప్పటికీ, అన్నింటిలో దేశంలోనే ముందుండే సీఎం చంద్రబాబు సీపీఎస్ విధానంలో కూడా చొరవ చూపి అందరికీ ఆదర్శం కావాలని కోరారు. ఈ విధానానికి వ్యతి రేకంగా రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయాలని ఆయన డిమాండు చేశారు. లేనిపక్షంలో ఇతర రాష్ట్రాల ఉద్యోగులతో కలసి కేంద్రంపై వత్తిడి తెస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు ఉద్యోగుల న్యాయమైన డిమాండని, ప్రభుత్వాలు తక్షణమే దీనిపై స్పందించి, పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండుచేశారు. సీపీఎస్ విధానం రద్దుకు ఐక్య ఉద్యమాలే శరణ్యమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు స్పష్టం చేశారు. ఉద్యోగులకు రక్షణ కల్పించి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఆయన డిమాండు చేశారు. నూతన పెన్షన్ విధానం వలన దేశంలో 56లక్షల మంది ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతారని, రాష్ట్రంలో 1.66 లక్షల మంది ఉద్యోగుల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారవుతోందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బ్రిటీష్ కాలం నుండి 1871 పెన్షన్ యాక్ట్ ఉద్యోగులకు అమలులో ఉన్నదని, 1952 డిఫైన్డ్ బెనిఫిట పెన్షన్ నుంచి ట్రిపుల్ బెనిఫిట్ పెన్షన్ స్కీంలను సాధించుకోవడానికి అనేక పోరాటాలు సాగిం చామన్నారు. అప్పటి నుండి ఉద్యోగి మరణించిన తరువాత కూడా అతని కుటుంబానికి పెన్షన్ కల్పించే విధానం వచ్చిందన్నారు. అయితే 2004 నుండి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగుల జీతాల నుండి 10శాతం, ప్రభుత్వ వాటా 10 శాతంతో కొత్త విధానం తీసుకురావడం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించే విధంగా ప్రభుత్వాలపై వత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా సమావేశంలో వైసీపీ నాయకులు కొలుసు పార్థసారథి, మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం నారాయణరావు, ఎన్జీవో సంఘం నాయకులు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు చీరాలలో మున్సిపల్ రాష్ట్ర మహాసభలు

జయప్రదం చేయాలని నేతల పిలుపు



విశాలాంధ్ర బ్యూరో- విజయవాడ : ఎఐటీయూసీ అనుబంధ సంఘమైన ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఈ నెల 12వ తేదీ ప్రకాశంజిల్లా చీరాలలో జరగనున్నట్లు యూనియన్ నేతలు తెలిపారు. మహాసభలను పుర స్కరించుకొని ఆరోజు ఉదయం జరిగే ప్రదర్శనకు రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని గొల్లపూడిలోని ఎఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆసుల రంగ నాయకులు, యూనియన్ గౌరవాధ్యక్షులు కిర్లక్రిష్ణారావు, ఎఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు,ఉప ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి చలసాని వెంకట రామారావు, ఆర్.రవీంద్ర నాథ్, ఎస్.వెంకట సుబ్బయ్యలు పిలుపునిచ్చారు.

రాష్ట్ర వ్యాప్తంగా గల 120 మున్సిపాల్టీలు, కార్పోరేషన్లు నగర పంచాయితీల నుండి అన్ని విభాగాలకు చెందిన పారిశుద్ధ్యం, వాటర్ వర్క్స్, ఇంజినిరింగ్, పార్కు మజ్దూర్, సెక్యూరిటీ, స్కూల్ స్వీపర్లు, తొట్టి రిక్షా కార్మికులు తదితరులు వెయ్యి మందికి పైగా మహాసభకు ప్రతినిధులుగా హాజరుకానున్నట్లు వారు తెలిపారు. 2017 డిసెంబర్ 18న పురపాలక సంచాలకులు కె.కన్న బాబు, ఐక్యపోరాట కమిటీకిచ్చిన ఒప్పంద పత్రంలోని అంశాలను వెనువెంటనే అమలు చేయాలని, జీవో150ను అన్ని విభాగాలకు చెందిన మున్సిపల్ కార్మికులకు ఎర్నియర్స్‌తో సహా అమలు చేయాలని, విశాఖపట్నం తదితర చోట గల సూపర్‌వైజర్లు,మేస్త్రీలకు ప్రత్యేక పెట్రోల్ అలవెన్సులు మంజూరు చేయాలని, 5 రోజుల సమ్మె కాలాన్ని వారికున్న సెలవుల్లో సర్దుబాటు చేసి వేతనాన్ని ఇవ్వాలని, తొట్టె రిక్షా, స్కూల్ స్వీపర్స్‌లను ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించి 11వేలు వేతనం మంజూరు చేయాలని, నైపుణ్యత బాధ్యతలను ఏళ్ళ తరబడి నిర్వహిస్తున్న సాధారణ ఇంజినీరింగ్ కార్మికులకు నైపుణ్యత వేతనాలు మంజూరు చేయాలని తదితర ప్రధాన అంశాలు చీరాల మహాసభలో చర్చనీయం శాలుగా ఉంటాయని రంగనాయకులు వివరించారు. ఈ సభకు చీరాల శాసన సభ్యులు ఆమంచి కృష్ణమోహన్ విశిష్ట అతిథిగా పుర పరిపాలనా సంచాలకులు కె.కన్నబాబు ముఖ్య అతిథిగా, ఎఐటీ యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ప్రధాన ఉపన్యాసకులుగా పాల్గొంటారని తెలిపారు.12వ తేది ఉదయం 10గంటలకు చీరాల అంబెద్కర్ భవన్ నుండి ప్రదర్శన నిర్వహిం చబడుతుందని, 11గంటల నుండి సాయంత్రం వరకు ప్రతినిధుల సభ జరుగుతుందని తెలిపారు.

గరగపర్రు బాధితులకు మొండి చేయి

- హామీలన్నీ ఒట్టి మాటలే..
- ఏమీ ఇవ్వలేదన్న దళితులు
- ప్రభుత్వ తీరుపై రామకృష్ణ ఆగ్రహం
- ప్రభుత్వం గాడిదలు కాస్తుందా, ఎంఎల్ఏ నిద్రపోతున్నాడా-గరగపర్రు బాధితులతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



విశాలాంధ్ర- భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా గరగపర్రు బాధితులకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం మొండిచేయి చూపించింది. పరిహారం అందలేదు, కౌలు భూములు ఇవ్వలేదు, పొలం పనులకు పిలవడంలేదు, ఇళ్లు ఇవ్వలేదు ప్రమాదంలో మృతి చెందిన యకోబు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో ఇవ్వలేదు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ శనివారం ఆ గ్రామాన్ని సందర్శించి బాధితు లను పలకరించినప్పుడు ఈ అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోలేదు. దళితులకు బతికే అవకాశం ఇవ్వరా అని కె.రామకృష్ణ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. సిపిఎం రాష్ట్ర 25వ మహాసభల్లో పాల్గొనడానికి భీమవరం విచ్చేసిన ఆయన సిపిఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మన్ నెక్కంటి సుబ్బారావు, స్థానిక ఎస్‌సి నేత ఎరిచర్ల రాజేష్‌లతో కలిసి గరగపర్రు దళితపేటలను సందర్శించి సాంఘిక బహిష్కరణకు గురైన బాధితులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా బాధితులు తాము పడుతున్న ఇబ్బందులను పరిహారం అందకపోవడాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చి న్యాయం చేయాలని కోరారు. తక్షణమే ముఖ్యమంత్రి కలుగ చేసుకుని బాధితులకు అందాల్సిన వాటిని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. గరగపర్రు అంశంపై ముఖ్య మంత్రిని కలిసి పరిస్థితులను వివరిస్తానని బాధితులకు రామకృష్ణ భరోసా ఇచ్చారు. స్థానిక పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని ఆయన సిపిఐ నేతలకు సూచించారు. తొలుత గరగపర్రు విచ్చేసిన ఆయన గుడిసె నిర్మించుకుంటున్న కోరెదల అమ్మతమ్మను కలిసి, ఏమ్మా ప్రభుత్వం ఎన్‌టీఆర్ ఇల్లు ఇస్తుంది కదా నీకు రాలేదా, పొలం పనులకు పిలుస్తు న్నారా, కౌలుకు భూమి ఇచ్చారా అని అడగగా, అమ్మ తమ్మ మాట్లాడుతూ ఇల్లు ఇవ్వలేదనీ, కూలీకి పిలవ నందున పొరుగూరు వెళ్లి పనులు చేసుకుంటున్నామని, కౌలుకు పొలం ఇవ్వలేదని చెప్పారు. అనంతరం ఆయన సమీపంలోనే ఆటలాడుకుంటున్న బాలికలు కె.వరలక్ష్మీ, కె.శిరీషా, జి.సరోజ, ఎం.శైలు, దొండపాటి జాస్మిన్, డి.లావణ్యలను కదిపి ఏమ్మా స్కూల్‌కు వెళ్తున్నారా, స్కూల్‌లో వివక్షతేమైనా ఎదుర్కొం టున్నారా అని అడిగి అంబేద్కర్ స్ఫూర్తితో చదువుకోవాలని సూచించారు. లారీ ప్రమాదంలో మృతి చెందిన చినకాపుల యాకోబు భార్య మరియమ్మ నివాసానికెళ్లి, ఏమ్మా ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా, వితంతు పింఛను ఇస్తుందా.. అని అడిగారు. అయ్యా అప్పట్లో మీరు పార్టీ తరఫున సాయమందించారు. అప్పుడు 10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రభుత్వం ప్రకటించింది కానీ ఇప్పటికీ 10 పైసలు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేసింది. అనంతరం ఆయన మరో వీధిలోని కంతేటి ఆదాము, సులేమాన్‌లను పలకరించి పనులకు వెళ్తున్నారా అని అడగగా, పొరుగూరు ప్యాక్టరీ పనులకు వెళ్తున్నామని, స్థానికంగా పనులకు పిలవడంలేదని తెలిపారు. ఈ సమయంలో ఆయన వద్దకు ఈతకోట సూర్యారావు అనే వృద్ధ వికలాంగుడు వచ్చి ఎన్నోసార్లు అర్జీలిచ్చినా పింఛను మంజూరు కాలేదని ఇందుకు సహాయం చేయాలని కోరారు. రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ గరగపర్రు బాధితుల తరఫున ప్రభుత్వంతో మాట్లాడతానన్నారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, భీమవరం ఏరియా సిపిఐ కార్యదర్శి [illegible] దండారావు, [illegible] కార్యదర్శి ఎం.లక్ష్మీ [illegible] పట్టణ [illegible] చంద్రరావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ షేర్ల విక్రయాల ప్రతిపాదన విరమించుకోవాలి

విశాలాంధ్ర-పెదగంట్యాడ (విశాఖపట్నం) : 32మంది ప్రాణత్యాగాలతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించుకున్న ప్రభుత్వరంగ సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 10 శాతం షేర్ల విక్రయాల ప్రతిపాదన తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. శనివారం పాడేరులో జరుగుతున్న జిల్లా మహాసభల సందర్భంగా ఆయన్ను కలిసిన ఉక్కు ఏఐటీయూసీ నేతలతో ఉక్కు పరిశ్రమ గురించి విషయాలు అడిగితెలుసుకున్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటులోకి అమ్ముతూ ఉంటే, రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం నాలుగు సంవత్సరాలుగా హామీలతోనే కాలం వెళ్ళబుచ్చుతున్నారని ఎద్దేవా చేశారు. స్టీల్ కార్మికులకు సీపీఐ పార్టీ అండగా ఉంటుందని, షేర్ల ప్రక్రియ నిలుపుదల ప్రకటన వెలువరించేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. జిల్లా 23వ మహాసభలో విశాఖ ఉక్కు డీసీఐలను ప్రైవేటీకరించరాదని ప్రత్యేక తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మజ్జి ఎంసీసీ పీజే చంద్రశేఖరరావు, ఏఐటీయూసీ నాయకులు జి. బోసుబాబు, బి. వెంకటరావు, [illegible] ఎం.ఎ. మాధవరావు, పరమేశ్వర్, [illegible] దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



చరిత్రను వక్రీకరిస్తున్న సంఘ్ పరివార్ శక్తులు

నాస్తికమేళాలో ఈడ్పుగంటి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: భిన్న వర్గాలు, సంస్కృతులతో సమ్మిళితమైన దేశచరిత్రను సంఘ్‌పరివార్ శక్తులు వక్రీకరిస్తున్నాయని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాలక బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్, మనువాదశక్తులు ఆధ్యాత్మిక సంస్కృతి పేరిట మనువాదాన్ని, బ్రాహ్మణ భావజాలాన్ని చొప్పించేందుకు యత్నిస్తున్నాయన్నారు. గుంటూరుజిల్లా మంగళగిరి సమీపంలోని నిడమర్రు చార్వాక ఆశ్రమంలో శనివారం 26వ జాతీయ నాస్తికమేళాను ఆయన ప్రారంభించారు. రెండ్రోజులపాటు జరిగే ఈ మేళాకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో నాస్తికులు, హేతువాదులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈడ్పుగంటి మాట్లాడుతూ సమాజంలో శాస్త్రీయ దృక్పథం పెరిగితేనే భౌతికవాద భావజాలం పెంపొందగలదన్నారు. లోకాయతులు, చార్వాకులకు ప్రాచీన చరిత్ర ఉందన్నారు. దేవీప్రసాద్ చటోపాధ్యాయ, ఎంఎన్ రాయ్, కేబీ కృష్ణ వంటి మహనీయులు చారిత్రక పరిశోధనలు జరిపి అనేక విషయాలను గ్రంథస్థం చేసారని గుర్తుచేశారు. మనదేశంలో 1885లో కాంగ్రెస్‌పార్టీ, 1925లో కమ్యూనిస్టుపార్టీ, ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించాయన్నారు. మహాత్మాగాంధీ, భగత్‌సింగ్ వారివారి ఆలోచనలతో సమాజాన్ని చైతన్యపరచినట్లు వివరించారు. జాతీయత, సామాజిక న్యాయం అంశాలను ఆయన విశదీకరించారు. 'భారతీయ సమాజం-కుల ప్రభావం' అంశంపై మార్క్స్-అంబేద్కర్ అధ్యయన వేదిక అధ్యక్షుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ విశ్వమానవాళికి మార్క్స్ సిద్ధాంతాలు దిక్సూచిగానూ, అంబేద్కర్ సిద్ధాంతాలు ఆచరణాత్మకంగా నిలుస్తాయన్నారు. విప్లవ రచయితల సంఘం కార్యదర్శి కాశీం 'దేశభక్తి, జాతీయవాదం' అంశంపై మాట్లాడుతూ దేశభక్తి పేరిట హిందూమతోన్మాదులు ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని తెలిపారు. అలాగే 'మహిళా విముక్తికి హేతువాదం' అంశంపై స్త్రీ విముక్తి సంఘటన కార్యదర్శి విజయ, 'బాలబాలికలు-హేతువాదం' అంశంపై చైతన్య మహిళా సంఘం కార్యదర్శి సిపోరా, 'మూఢనమ్మకాల వ్యాప్తిలో మత ప్రవక్తలు' అంశంపై పెన్మెత్స సుబ్బరాజు వివరించారు. తొలుత నాస్తిక సమాజం పతాకాన్ని బి గృహలక్ష్మి ఆవిష్కరించారు. తొలిరోజు సమావేశం ముగిసిన తర్వాత మంగళగిరి సెంటరు వద్ద ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ప్రజానాట్యమండలి కళాకారులు అభ్యుదయ గీతాలను ఆలపించారు. కార్యక్రమానికి నాస్తిక సమాజం అధ్యక్షుడు కె అయ్యన్న, కార్యదర్శులు బి సుధాకర్, మోతుకూరి అరుణ్‌కుమార్, ఎన్‌కే జిలానీబేగం, జె నత్యనారాయణ, జిడి సారయ్య సారథ్యం వహించారు.



హోదాను బాబు అమ్మేశారు

ప్రజా సంకల్పయాత్రలో జగన్ ధ్వజం

విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో: పరిశ్రమలు, హోటళ్లు, ఆసుపత్రులు ప్రత్యేక హోదా ఉంటేనే వస్తాయని, కానీ ప్రత్యేక హోదాను చంద్రబాబు ఢిల్లీ పెద్దలకు అమ్మేశారని జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా జగన్‌మోహన్‌రెడ్డి దగదర్తిలో శనివారం బహిరంగసభలో మాట్లాడారు. ప్రత్యేక హోదాతోనే ఉద్యోగాలు వస్తాయని, ఎన్నికలప్పుడు ప్రత్యేక హోదా 15 ఏళ్లు కావాలన్నారని . ఎన్నికల తర్వాత హోదాతో లాభం కంటే నష్టం ఎక్కువని సుజనా చౌదరి చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తు చేశారు. కేసుల కోసం చంద్రబాబు భయపడి.. కేంద్రం ముందు సాగిలపడ్డారని ఎద్దేవా చేశారు. ఏ దేశం వెళ్తే ఆ దేశం, మన రాష్ట్రాన్ని దత్తత తీసుకుందని గొప్పలు చెబుతారని ఆయన నోరు తెరిస్తే అబద్ధాలే అన్నారు. చంద్రబాబు విదేశీ పర్యటనలకు రూ. 300-400 కోట్లు ఖర్చు పెట్టారని, విదేశీ పర్యటనలు చేస్తున్నది దోచుకున్న నల్లడబ్బు దాచుకోవ టానికేనన్నారు. చంద్రబాబు విదేశీ పర్యటనలపై అనుకూల పత్రికల్లో అద్భుతం అని అని రాసి ప్రజలను మభ్యపెడతారన్నారు. విశాఖలో సమ్మిట్స్ పెట్టి రూ. 5 లక్షల కోట్లు వచ్చేశాయని ఒకసారి, రూ.10 లక్షలు వచ్చేశాయని మరోసారి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. కేంద్ర సంస్థ డీపీఐఈ వద్ద ఐఈఎంలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల డేటా ఉంటుందని, 31 డిసెంబర్ 2015 నాటికి రాష్ట్రానికి రూ.4,500 కోట్ల పెట్టుబడులు మాత్రమే వచ్చాయని, 31 డిసెంబర్ 2016 నాటికి రూ.10వేల కోట్లు, 31 డిసెంబర్ 2017 కేవలం రూ.4,400 కోట్లు మాత్రమే పెట్టుబడులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో లక్షా 2వేల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కనీసం 42 వేల ఉద్యోగాలు బాబు భర్తీ చేయలేదని ధ్వజమెత్తారు. జగన్ వెంట ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

డేటా ఎంట్రీ, ట్యాబ్ ఆపరేటర్ల రెమ్యూనరేషన్ రూ.2.30 కోట్లు విడుదల

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని ఓటర్లకు ఫోటో ఐడీ కార్డుల తయారీలో భాగంగా డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ట్యాబ్ ఆపరేటర్లకు రూ.2.30 కోట్ల రెమ్యూనరేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్‌పీ సిసోడియా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ట్యాబ్ ఆపరేటర్లకు రెమ్యూనరేషన్ చెల్లించేందుకు నిధులు మంజూరు చేయాలని పలు జిల్లాల కలెక్టర్లు ఎన్నికల అధికారికి ప్రతిపాదనలు పంపించారు. అందులో భాగంగానే రూ.2.30 కోట్లు విడుదలయ్యాయి. శ్రీకాకుళం జిల్లాకు రూ.10 లక్షలు, విజయనగరానికి రూ.1.62 లక్షలు, విశాఖకు రూ.10 లక్షలు, తూర్పు గోదావరికి రూ.10 లక్షలు, పశ్చిమ గోదావరికి రూ.25 లక్షలు, కృష్ణాజిల్లాకు రూ.10 లక్షలు, గుంటూరుకు రూ.40 లక్షలు, ప్రకాశంకు రూ.12 లక్షలు, నెల్లూరుకు రూ.29.30 లక్షలఋ, చిత్తూరు జిల్లాకు రూ.10 లక్షలు, కడపకు రూ.22.84 లక్షలు, అనంతపురానికి రూ.40 లక్షలు, కర్నూలు జిల్లాకు రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి.

సంపాదకీయం

ప్రేమగీతం

ప్రేమ.. ఎన్ని నిర్వచనాలున్నా..అనిర్వచనీయమే. ప్రకృతిలోని తియ్యందనమంతా తనలోనే ఒదిగినట్లున్న ఒద్దికైన పదం. రెండే రెండక్షరాల్లో వేనవేల నక్షత్రకాంతుల్ని వెదజల్లే మహత్తర శక్తి. ఆకాశంలా అనంతం.. సముద్రంలా అగాధం.. ఓ పుష్పం నుంచి వెలువడే పరిమళం.. జాబిలినుంచి జాలువారే వెన్నెల అది. ఆ అనంతపు అంచుల్లో విహరించాలని, ఆ అగాధపు కొసల్ని అందుకోవాలని, ఆ పుష్ప పరిమళాన్ని ఆస్వాదించాలని, ఆ చల్లని వెన్నెలలో సేదతీరాలని ఎవరైనా తపిస్తారు.. తహతహ లాడుతారు.. అదే ప్రేమలోని మత్తు.. గమ్మత్తు.. మహత్తు. మనిషి నడవడికకు దారిచూపే దివ్వదీపం.. మనిషిని నడిపించే జీవన మంత్రాక్షరం ప్రేమ. ప్రేమనుపొందడంలో ఎంత ఆనందం ఉందో.. ప్రేమించడంలోనూ అంతే అమితానందముంది. 'జ్వాలయే దీపమునకు సర్వస్వమైనట్లు/ ప్రణయమే జీవనమున సర్వస్వమయ్యె'నంటూ ప్రేమతత్వంలోని ఔన్నత్యాన్ని గొంతెత్తి చాటాడు గాలిబ్.

ప్రేమంటే దేహాలకు సంబంధించిందీ, స్త్రీ పురుషుల ఆకర్షణకు సంబంధించిందే కాదు. అమ్మ చల్లని చూపు, నాన్న ఆత్మీయస్పర్శ, తోబుట్టువుల వాత్సల్య లాలన, నేస్తాల స్నేహానుబంధం, బిడ్డల అనురాగం.. సర్వం ప్రేమమయమే. మనిషికి మనిషికీ, మనసుకు మనసుకూ, మట్టి కణానికి మనకూ మధ్య అనుబంధమే ప్రేమ. ప్రేమించని వ్యక్తి భగవంతుడ్ని చేరలేడు అంటాడు ఓ తత్వవేత్త. అది ఆయన విశ్వాసం. ప్రేమించలేని వ్యక్తి మనిషితత్వాన్ని, మనిషితనాన్ని పొందలేడని కచ్చితంగా చెప్పవచ్చు. ప్రేమే దైవమన్నారు క్రీస్తు. ప్రేమ ముదిరితే భక్తిగా మారుతోంది. అందుకే భగవంతుడు ప్రేమ స్వరూపుడని భక్తుల విశ్వాసం. నేతలపై ప్రేమ ముదిరితే వ్యక్తిగత ఆరాధనకు దారితీస్తుంది. ఇది కూడా ఒక రకమైన భక్తే. ఆత్మీయత, ఆప్యాయత, అనురాగం, ప్రేమ.. పదాల్లో తేడా తప్ప ఇవన్నీ అనుబంధాలకు ఆలంబనే. వీటన్నింటి కన్నా యువతీయువకుల మధ్య ప్రేమకు ఓ ప్రత్యేకత ఉంటుంది. 'వలపెరుంగక బ్రతికి కులికి మురిసే కన్నా వలచి విఫలమ్మైంది విలపింప మేలురా' అన్నారు బసవరాజు. ప్రేమించు ప్రేమకై, ప్రేమకు అదే గమ్యం అనే వరకూ మన ప్రేమదాసులు వెళ్లారు. పార్వతి-దేవదాసు, లైలా-మజ్నూ, శిరిన్-ఫరహద్, అనార్కలీ-సలీం, రోమియో-జూలియట్, ఊర్వశి-పురూరవ, రాధా-కృష్ణులు.. మన చరిత్ర పొడవునా ఎన్నెన్ని ప్రేమ జంటలు! వారి ప్రేమ కతలు, కవితలు, విరహ వేదనలు, ప్రణయ ప్రళయ గీతికలు ఎన్ని సార్లు విన్నా, చదివినా.. నిత్యనూతనాలే. అవును.. ప్రేమ బహు దొడ్డది.. మహా చెడ్డది.. చాలా గడుసుది. అది..పిడికెడు పిచ్చిగుండెలో వెన్నెల జలపాతాల్ని కురిపిస్తుంది.. పెను తుపానుల్ని రేపుతుంది.. మధురోహలతోనూ ముంచెత్తుతుంది.. మధుకీలల్ని రగిలిస్తుంది. అయినా ప్రేమమత్తులో పడని వారుంటారా! అందుకే దాశరథి 'చెలి శిరోజపుటుచ్చుల్లో పడనట్టి హృదయము ఉన్నదా? ఉచ్చులో పడి మరల బయటికి వచ్చు హృదయము సున్నరా!' అని తేల్చారు. పిడికిలి మించని హృదయంలో కొండంత ప్రేమ ఏ క్షణాన, ఎందుకు, ఎలా తిష్ఠ వేసుకు కూర్చుంటుందన్నది.. ఎవరూ ఊహించని, ఎవరూ పూరించని ప్రహేళిక. అందుకే 'గుండెల్లో గూడు కట్టుకున్న ప్రేమను చీటికీమాటికీ బయటకు చెప్పుకొంటామా' అంటారు ముళ్లపూడి. నిజమైన ప్రేమ ఎలా ఉండాలో కూడా గురజాడ చాలా సూటిగా, స్పష్టంగా చెప్పారు. 'మరులు ప్రేమని మది దలంచుకు, మరులు మరలును వయసుతోడనే మాయమర్మము లేని నేస్తము మగువలకు మగవారికొక్కటే, ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును, ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును' అన్నారు. ప్రేమ ఎప్పుడు పుడుతుంది, ఎందుకు పుడుతుంది అనేది కచ్చితంగా చెప్పలేం. అయితే దీన్ని 'కెమిస్ట్రీ ఆఫ్ ఎమోషన్స్' అన్నారు. ప్రేమ కోసం ప్రాణాలైనా ఇచ్చే ప్రేమికులు చరిత్రలో మనకు చాలా మంది కనిపిస్తారు. లెర్మొంతోవ్ 'పావ నివేదన' అనే కావ్యం రాశాడు. దానిలో ఒక యువసన్యాసి మఠం నియమనిబంధనలకు విరుద్ధంగా ఓ యువతిని ప్రేమిస్తాడు. అందుకు అతనికి మరణశిక్ష విధిస్తారు. దీంతో ఓ వృద్ధ సన్యాసి ఆ యువసన్యాసికి పశ్చాత్తాపం వ్యక్తం చేసి ప్రాణాలు దక్కించుకోవాలని హితవు చెబుతాడు. అందుకు ఆ యువకుడు 'తాను అనుభవించిన ప్రేమ పారవశ్యానికి ఏ మూల్యం అయినా చెల్లిస్తా' అంటాడు. ప్రేమ ముందు ఉరి కంబం సైతం చాలా చిన్నగానే కనిపిస్తుందని నిరూపిస్తాడు. ప్రేమ ఔన్నత్యాన్ని చాటే ఇటువంటి కథలు ప్రపంచ సాహిత్యంలో అనేకం వచ్చాయి. జయదేవుడు రూపకల్పన చేసిన గీతగోవిందం-రాధాకృష్ణుల ప్రణయాన్ని రమణీయంగా, స్మరణీయంగా మార్చేసింది. భారతీయుల దృష్టిలో అవధుల్లేని ఆరాధనకూ, అవ్యాజమైన అనురాగానికీ, అలౌకిక ప్రణయానికీ, మధుర భక్తికీ, మాధుర్యమైన రక్తికీ రాధాకృష్ణులు ప్రతీకలు. రాధామాధవీయంపై ఎవరెన్ని కథలల్లినా ప్రేమకు వారే ప్రతిరూపాలన్నంతగా భారతీయులు విశ్వసిస్తారు. సీతారాములు, శివపార్వతులకెంత ప్రాధాన్యత ఇస్తారో అంతకు మించి రాధామాధవులకు శిఖరస్థానం కల్పిస్తారు.

ఈరోజుల్లో వాలెంటైన్స్ డే పేరిట పార్కుల్లో, క్లబ్బుల్లో, హోటళ్లలో, సినిమాహాళ్లలో కవ్వించే, కైపెక్కించే ప్రేమ సరాగాలు శ్రుతి మించుతున్నాయి. వాలెంటైన్ పవిత్ర ఆశయానికే ఈ కామేశులు తూట్లు పొడుస్తున్నారు. రోమన్ చక్రవర్తి రెండో క్లాడియస్.. సైనికులు వివాహం చేసుకోరాదని ఆదేశాలు జారీ చేయడాన్ని తప్పుపట్టిన తత్వవేత్త వాలెంటైన్స్. వివాహ వ్యవస్థలోనే నిజమైన ప్రేమ, జీవితం ఉందని, దాన్ని నిరాకరించడం సరికాదని ఆయన వాదించాడు. దాన్ని సహించలేని క్లాడియస్ అతనికి శిరచ్ఛేదనం చేయించాడు. ఆయనకు గుర్తుగా ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ ప్రేమికుల దినోత్సవం వెనుక ఓ తెగింపు, ఓ పోరాటం, ఓ త్యాగం, ఓ ఉదాత్త ఆశయం దాగి ఉంది. కానీ నేటితరం ఈ వాస్తవాలను విస్మరిస్తూ ప్రేమను ఆకర్షణగా, వంచనగా మార్చేస్తోంది. ఫలితంగా ప్రేమ వెర్రితలలు వేస్తోంది. దీంతో వారు చదువును, తల్లిదండ్రుల ప్రేమను, చివరకు జీవితాన్నే కోల్పోతున్నారు. ప్రేమ జీవితాన్ని తుంచదు.. పెంచుతుంది.. పంచుతుంది.. ఈ వాస్తవాన్ని నేటి యువతీయువకులు గుర్తించలేక పోతున్నారు. ఎంత నేర్చిన, ఎంత జూచిన, ఎంత వారలైన కాంత దాసులేనన్నాడు త్యాగరాజు. కానీ రెండు హృదయాలు నిష్కల్మషంగా కలిసిన జంటలకూ నేటి ప్రేమికులకూ మధ్య పొంతనే కనిపించడంలేదు. సుర గంగను శివయ్య తలమీద ధరించాడు. సిరితల్లి శ్రీమహాలక్ష్మిని విష్ణువు తన వక్షస్థలంలో దాచుకున్నాడు. సంగీత సాహిత్య సమలంకృతమూర్తి సరస్వతిని బ్రహ్మ రసనాగ్రంపై నిలుపుకున్నాడు. అదీ నిజమైన ప్రేమ. అదీ నిజమైన దాంపత్యం. ప్రేమ వేరు పెళ్లి వేరు అనే వాదన ఉంది. ప్రేమించినవారందరూ పెళ్లి చేసుకోలేరు..పెళ్లి చేసుకున్న వారందరూ ప్రేమించుకోలేరు.. అనేది నగ్న సత్యం. ప్రేమ.. పెళ్లికి దారితీసి..ఆ పెళ్లి పిల్లాపాపలతో కళకళలాడే జీవిత వృక్షమై నిలిస్తే.. అదే అసలుసిసలైన ప్రేమ అవుతుంది. అదే సమయంలో ప్రేమ విఫలమైనా భరించగల , సహించగల గుండెదిటవును అలవర్చుకోవాలి. విఫల ప్రేమ కసిని, పగను, ప్రతీకారాన్ని కోరుకుంటోందని నేటి తరం హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారు. ప్రేమించలేదంటూ నరికేయడం, యాసిడ్ దాడులకు తెగబడడం వంటి రాక్షసకృత్యాలను మనం చూస్తున్నాం. ఇది ప్రేమ కాదు, మృగోన్మాదం. ప్రేమించిన యువతి/యువకుడు దూరమైతే జీవితాన్ని తుంచేసుకుంటున్న అభాగ్యులు, అర్భకులు మనకు ఎదురవుతున్నారు. 'నీవు లేవనునట్టికాలమే నాకులేదు, నా దారినుండి నిన్ను విడదీయు వేరు మార్గమేలేదు, నీవు లేనిచోటున నాకు చోటులేదు, సుఖము లేదు, లేదు ఉనికి' అంటూ ప్రియురాలి కోసం రక్తసంబంధికుల్ని, స్నేహితుల్ని దు:ఖసంద్రంలో ముంచేస్తుంటారు. ప్రేమ అనేది జీవితానికి దారిదీపం కావాలే తప్ప చీకటి సుడిగుండం కాకూడదు. ఎదలో పెనుమంటల్ని రేపి కలల బూడిదరాసుల్ని మిగిల్చే ప్రేమను ఎవరూ కోరుకోవద్దు.. ఎవరూ ప్రోత్సహించవద్దు. ప్రేమ వైఫల్యంలో నుంచీ ప్రేమను అంకురింపచేసుకోవాలి. ప్రేమకు మించిన పదార్థం ఏదీ లేదు. జగత్తు పదార్థమయం అన్నారు. ఆ పదార్థాన్నంతా ప్రేమ స్వరూపంగా మార్చుకొంటే ప్రేమలో వైఫల్యమే ఉండదు. హృదయగత అనుభూతుల భౌతిక పునాదిని మరవకూడదు. శరీరం, హృదయం.. రెండూ పరస్పరం ప్రేమ పూరకాలే. కామం, ప్రేమ రెండింటి మధ్య సంబంధం ఉంది.. అదే సమయంలో సన్నని అడ్డుగీత ఉంది. దాన్ని గుర్తించడమే నిజమైన ప్రేమికుడి లక్షణం.

ప్రేమించడం గొప్ప అనుభవం. అదిచ్చే ఆనందం సాటిలేనిది. ఆత్రేయ అన్నట్లు 'తొలిపొద్దు వెలుగల్లే కనిపించి, తొలి జన్మరుణమేదో అనిపించి..' ప్రేమ వికసిస్తుంది. ప్రేమించడం అనేది ఒక యోగం.. యాగం. జీవితపథాన పరస్పర అనురాగంతో ప్రేమయాత్ర సాగిపోతే ఏ జంటకైనా కావాల్సిందే ముంటుంది. అందుకే ప్రేమించడాన్ని ఒక యోగంగా మనం సాధన చేద్దాం.. ప్రేమనే పూర్ణాహుతిగా యాగం చేద్దాం. హృదయ కమలంలోని ఎనిమిది రేకులతో సుతారంగా చుట్టి ప్రేమను ఈ లోకానికి అందిద్దాం.

విశ్లేషణ

భవిష్యత్తు సౌరశక్తిదే
భాగం 2

జలవిద్యుత్తు ప్రాజెక్టు

మర్ల విజయ కుమార్

భూమిని జల గ్రహం అని పిలుస్తారు. భూ ఉపరితలంలో 78 శాతం నీటితో నిండి ఉన్నది. భూమిపై ఉన్న అపార జలనిధిలో 98 శాతం ఉప్పునీటిగా సముద్రాలలోనే ఉన్నది. మిగిలిన 2 శాతం మంచినీటిలో, దాదాపు 1 శాతం మాత్రమే మానవ వినియోగానికి అందుబాటులో ఉన్నది. మన దేశంలో 3816 టి.ఎమ్.సి ల వర్షపాతం ఉండగా, మన నదులలో మొత్తంగా 1645 టి.ఎమ్.సి ల నీరు వచ్చి చేరుతూంది. అయితే అందులో 600 టి.ఎమ్.సిలకి మించి నేటి వరకూ వాడకంలోకి తేలేకపోయాము. నదులు, జలాశయాలలోని నీరు మానవ వినియోగానికే కాక, సమస్త జీవకోటి అవసరాలని తీర్చవలసి ఉన్నది. ఒక నదిలోని నీటిని వినియోగించుకునేందుకు ఇంజనీర్లు పథకాలు రూపొందిస్తున్నప్పుడు, ప్రకృతి అవసరాల తరవాత మిగిలిన నీటిని మాత్రమే మానవ అవసరాలకు కేటాయిస్తారు. అయితే, ఈనాటికి కూడా మనం మనకు అందుబాటులో ఉన్న నీటిలో 6 శాతానికి మించి నిలవచేయలేకపోతున్నాము. ఆ కారణంచేతనే, రుతుపవనాలపై ఆధారపడే మన దేశంలో ఎండాకాలంలో చాలా ప్రాంతాలలో నీటిఎద్దడి ఏర్పడుతున్నది. మన దేశంలోని వాడకంలోకి తేబడిన నీటిలో 90 శాతం వ్యవసాయ అవసరాలకు వాడబడుతున్నది. మిగతాది మానవ అవసరాలకు, పరిశ్రమలకు వాడుతున్నారు. రిజర్వాయర్లలో నీటిని నిలవ ఉంచి, ఎత్తునుండి కిందకు పడేనీటిలోని శక్తిని విద్యుత్తుగా మార్చటంద్వారా మనకు విద్యుత్ శక్తి లభిస్తున్నది. మనదేశంలో నేడు ఉత్పత్తి అయే మొత్తం విద్యుత్ శక్తి 3,09,000 మెగావాట్లు కాగా, అందులో జలవిద్యుత్ భాగం 14.5 శాతం, అంటే 44,600 మెగావాట్లుగా ఉన్నది. అయితే, దేశంలోని జలవనరులను పూర్తిగా వినియోగించుకోగలిగితే, మనం అంతకు మూడు రెట్లకంటే ఎక్కువే విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చును. కాని అందుకు అనేక సాంకేతికపరమైన ఇబ్బందులు, పర్యావరణ పరిమితులను అధిగమించవలసి ఉన్నది.

జలవిద్యుత్ ఆనకట్టలు నిర్మించాలంటే దశాబ్దాల కాలం పట్టవచ్చును. ఖర్చు కూడా ఎక్కువే. అయితే, పరిమితంగా ఉన్న బొగ్గు, విదేశాలనుండి దిగుమతి చేసుకునే పెట్రోలియమ్ వనరులవలే జలవిద్యుత్తు వలన పర్యావరణానికి హానికారకమైన కర్బన, నత్రజని, సల్ఫర్ వాయువులు విడుదలకావు. పైగా జలవిద్యుత్తు మిగతా అన్ని వనరులతో పోలిస్తే అతి చవకైనది. డ్యాముల నిర్మాణానికి ముఖ్యకారణం, నదీ ప్రవాహాన్ని నియంత్రించి, డ్యాముకు దిగువన ఉన్న వ్యవసాయ భూములకు నీరందించటం. అందుచేత పుణ్యం, పురుషార్థం లాగా, చవకైన విద్యుత్తు, పొలాలకు నీరు రెండూ మనకు లభిస్తాయి. అయితే, ఈ మధ్యకాలంలో జలవిద్యుత్ ప్రాజెక్టులనిర్మాణానికి ప్రజల నుండి తీవ్రమైన స్థాయిలో వ్యతిరేకత వస్తున్నది. ప్రాజెక్టుకు దిగువన ఉన్న పల్లపు ప్రాంతాలలో సారవంతమైన భూములకు పుష్కలంగా నీరు లభిస్తున్నది కాని, ఎగువన ఉన్న మెట్ట ప్రాంతాలలోని పేద రైతులు, ఆదివాసీలు తమ భూములు, గ్రామాలు ముంపునకు గురికాగా, నిర్వాసితులవుతున్నారు. ప్రపంచంలోని అన్నిదేశాలలో మొత్తంగా 8 కోట్లమంది నివాసాలు ముంపునకు గురై నిర్వాసితులుకాగా, అందులో ఒక్క భారత దేశంలోనే 4 కోట్లమంది నిర్వాసితులయ్యారు. డ్యాముల వలన కలిగే లాభాలకంటే నష్టాలే ఎక్కువగా ఉన్నాయని పర్యావరణ వేత్తలు విమర్శలు గుప్పిస్తున్నారు. డ్యాముల నిర్మాణం దీర్ఘకాలంపాటు పర్వత ప్రాంతాలలో జరగటం కారణంగా, అటవీ సంపదకు తీవ్ర నష్టం జరుగుతోంది. పైగా వేలాది ఎకరాల అటవీభూములు రిజర్వాయర్లకోసం ముంపు నకు గురవుతున్నాయి. ఆదివాసీ ప్రజలేకాక, అనేక వృక్ష, జంతు, పక్షిజాతులకు ఈ ముంపువలన నష్టం వాటిల్లుతోంది.

"ఇన్ని నష్టాలతో మనం డాముల నిర్మాణంచేయక తప్పదా? డ్యాములే లేకపోతే, వరదలను నియంత్రించేదెట్లా? పొలాలకు నీరు ఎట్లా లభిస్తుంది? జల విద్యుత్తు వలన చవకైన విద్యుత్ లభిస్తోంది కదా! ఈ పెద్ద ప్రాజెక్టులకు ప్రత్యామ్నాయమేమిటి," అనే విషయమై ప్రపంచవ్యాప్తంగా ఇంజనీర్లు, పర్యావరణవేత్తలు, శాస్త్రజ్ఞులు పరిశోధనలు చేస్తున్నారు. ఒక నదీ పరీవాహక ప్రాంతం, అంటే పర్వతాలలో పుట్టిన తరువాత, సమతల ప్రదేశానికి పెద్ద ప్రవాహంగా వందల, వేల కిలోమీటర్లు ప్రవహించి, అంతిమంగా చిన్నపాయలుగా విడిపోయి, డెల్టా ప్రాంతాలు ఏర్పడి, చివరికి సముద్రంలో కలుస్తున్నది. ఈ మొత్తం ప్రవాహక్రమంలో అనేక వృక్ష, జంతు, పక్షి జాతులకు ఆ నది జీవనాధార మవుతున్నది. మన నిర్మాణాల కారణంగా, ఆ ప్రకృతి సమతుల్యాన్నిగాని దెబ్బతీస్తే, ప్రకృతి తిరిగి కోలుకోవటం దాదాపు అసాధ్యమే. ఈ కారణంగానే అనేక వెలకట్టలేని జీవజాతులను ఇప్పటికే మనం పోగొట్టుకున్నాము. అయితే మానవాళి ఉనికికి అత్యంత కీలకమైన ఈ పెద్ద డ్యాముల నిర్మాణానికి తోడుగా ఈ మధ్య కాలంలో చిన్న జల విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రైవేటు రంగంలో ప్రోత్సహిస్తున్నది. 25 మెగావాట్లకు మించకుండా, చిన్న నదులపై, ఉపనదులపై నిర్మించే ఈ చిన్న విద్యుత్ కేంద్రాలకు చిన్న రిజర్వాయర్లు సరిపోతాయి. వీటిని ప్రవాహ విద్యుత్ కేంద్రాలుగా కూడా వ్యవహరిస్తారు. అంటే, పెద్ద రిజర్వాయర్ల అవసరంలేకుండా, నీటిప్రవాహం నుండే విద్యుత్తును ఉత్పత్తిచేస్తారు. నదీప్రవాహంలోని మొత్తం నీరు డ్యామునుండి ప్రవహిస్తూనే ఉంటుంది. అయితే, ఈ చిన్నతరహా విద్యుత్ కేంద్రాల నిర్మాణం వలన కొన్ని కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి. ఉదాహరణకు జలవిద్యుత్తును ప్రైవేటు సంస్థలకు అప్పగించి, పర్యావరణ పరిమితులకు మినహాయింపు ఇచ్చినకారణంగా, లాభార్జనే ప్రధాన దృష్టిగా, పర్యావరణ వినాశనానికి ఒడిగడుతూ, 300 పైగా ఇటువంటి ప్రాజెక్టులు ఒక్క హిమాలయ ప్రాంత రాష్ట్రాలలోనే ప్రారంభించబడ్డాయి. హిమాలయ ప్రాంతాలలో మహా భూకంపం సమీప భవిష్యత్తులో సంభవించే అవకాశాలు మెండుగా ఉన్నాయని అనేక అంతర్జాతీయ సంస్థలు, మన దేశంలోని భూగర్భ పరిశోధకులు నిత్యం హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు.



ఇక మూడవ రకమైన జలవిద్యుత్ ప్రాజెక్టులపై ప్రైవేటు కంపెనీలు అంతగా శ్రద్ధ చూపవు. ఈ ప్రాజెక్టుల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 1 మెగావాట్ నుండి కొన్ని కిలోవాట్లవరకూ ఉంటుంది. ఈ ప్రాజెక్టులు పరిసర ప్రాంత ప్రజల విద్యుత్తు, నీటి అవసరాలను తీరుస్తూ, గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు కలగజేయగలవు. అతిచిన్న స్థాయిలో కాలువలపైన, చిన్న ఉపనదులపైన వీటిని ఏర్పాటు చేయవచ్చును. ప్రవహించే కాలువలలోని నీటినుండికూడా విద్యుత్తు ఉత్పత్తి సాధ్యమే! హైటెన్షన్ విద్యుత్తు తీగలువేసి మారుమూలప్రాంతాలకు, అందునా పర్వత ప్రాంతాలకు విద్యుత్తును సరఫరా చేయటం అత్యంత శ్రమ, ఖర్చుతో కూడుకున్నది. ఈ విధమైన మైక్రో ప్రాజెక్టులు, ప్రజల సాగు, మంచినీటి అవసరాలు తీర్చటమేకాక, మారుమూలగ్రామీణ ప్రాంతాలకు విద్యుత్తు సరఫరాను కలిగించి, ఆప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడగలవు. ఈ ప్రాజెక్టులు ప్రైవేటు కంపెనీలకు లాభకరం కాదు కనుక, గ్రామాలలోని యువతకు తరిఫీదు ఇచ్చి, సహకార రంగంలో నడపటమే ఉత్తమం.

ఒక నదీ పరీవాహక ప్రాంతంలోని మొత్తం జలవనరులను సమర్థవంతంగా వినియోగించుకోనిదే, పెరుగుతున్న మానవ అవసరాలను తీర్చలేము. ఈ క్రమంలో ప్రకృతిపై అతితక్కువ ప్రభావం ఉండేటట్లు చేయనిదే, భవిష్యత్తు తరాలకు ఉనికి ఉండదు. ఇప్పటివరకూ ఫలానా నదిపై డ్యాము నిర్మాణం చేపట్టాలని నీటిపారుదల సహాయంతో పంటలు పండించే పల్లపు భూములలోని రైతుల డిమాండ్ల మేరకు రాజకీయ నాయకులు ప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తారు. ఆ డ్యాము నిర్మాణానికి అనువైన స్థలం నిర్ధారించటంకోసం ఇంజనీర్లు కొన్ని సంవత్సరాలపాటు సర్వేలు జరిపి, నాలుగైదు అనువైన స్థలాలలో ఏదో ఒక ప్రాంతంలో నిర్మించవచ్చునని నిర్ధారిస్తారు. ఇక రాజకీయ జోక్యం ప్రారంభమవుతుంది. డ్యాము ఎత్తు ఎంతుంటే, తమ ప్రాంతానికి కావలసిన నీరు అందుతుందో, అంత ఎత్తు ఉండాలని ఒకరంటే, మా ప్రాంతం ముంపునకు గురవుతుంది కనుక దాము ఎత్తు పెంచరాదని మరికొందరు పట్టుపడతారు. ఈ విధంగా డ్యాము నిర్మాణం ఆలస్యం అయి, దశాబ్దాలు గడిచిపోతాయి. ఇంతాజేసి, వర్షం పడి, నదులలోకి చేరే నీటిలో మనం 6 శాతాన్ని మాత్రమే వినియోగించుకోగలుగుతున్నాము. నేటి టెక్నాలజీ బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధించింది. ఆ టెక్నాలజీ సహాయంతో మొత్తం దేశంలోని నీటి వనరులను, దేశంయొక్క 3డి మోడల్ ను తయారుచేసి, అందులో ఒక నదీపరీవాహక ప్రాంతం, దాని పరిసరాలలో ఎన్ని కాలువలు, ఉపనదులు, సరస్సులు ఉన్నాయి, ఆ ప్రాంతం మొత్తంలో భూగర్భ జలవనరుల స్థితి ఏమిటి, కొండల కోనలలో ఎక్కడ ఎక్కడ ఎన్ని జలవనరులు ఉన్నాయి అని ఖచ్చితంగా ఈరోజు నిర్ధారించటం వీలు పడుతుంది. ఇప్పటివరకూ ఈ లెక్కలన్నీ ఉజ్జాయింపు లెక్కలే. శాటిలైట్ సహాయంతో తయారయిన ఈ 3డి మ్యాపు సహాయంతో, ఎక్కడ ఎన్ని పెద్ద, చిన్న, అతిచిన్న స్థాయిలో జల విద్యుత్, రిజర్వాయర్లు నిర్మించవచ్చునో కొద్ది రోజులలోనే నిర్ధారించ వీలుకలుగుతుంది. ఒకమీటరు కంటే ఎక్కువ సైజు కలిగిన ప్రతి వస్తువునూ ఈ మోడల్‌లో మనం పరిగణనలోకి తీసుకుంటాము కనుక, నిజానికి సర్వే అవసరమే ఉండదు. మహా అయితే, ఏరియల్ సర్వే ద్వారా మన మోడల్‌ను సరిచూసుకోవచ్చును. ఇక అప్పుడు డ్యాముల డిజైన్లు కూడా కంప్యూటర్ సహాయంతో కొద్ది రోజులలోనే పూర్తి చేయవచ్చును. మిగతా సమయాన్ని ఆ డ్యాము వలన ప్రభావితులయ్యే ప్రజల అనుమతి, నష్టపరిహారం, తదితర నిర్ణయాలు తీసుకోటానికి వినియోగించి, అందరికీ ఆమోదయోగ్యమైన పద్ధతిలో డ్యాము నిర్మాణాన్ని చేపట్టవచ్చును. గత 500 ఏళ్ళలో ఆ నదీపరీవాహక ప్రాంతంలో వచ్చిన వరదలు, నీటి ఎద్దడి మొదలైన వివరాలన్నిటినీ పరిగణనలోకి తీసుకుని, సాధారణం కంటే 5, 10, 15 రెట్ల అధిక వర్షపాతం సంభవిస్తే, వరదలను ఎట్లా నివారించాలీ, అనే అన్నిరకాలైన పరిశీలనలు ఈ కంప్యూటర్ సిస్టమ్ సహాయంతో నిర్ధారించే సామర్థ్యం ఈనాడు టెక్నాలజీకి ఉన్నది. మనం నేడు పల్లపు ప్రాంతాలకే సాగునీటిని సరఫరా చేయగలుగుతున్నాము. మెట్టప్రాంతాలకు విద్యుత్తు హెచ్చుస్థాయిలో అవసరమయ్యే ఎత్తిపోతల పథకాలు అవసరమవుతున్నాయి. కాని నూతన టెక్నాలజీ సహాయంతో, పర్యావరణంపై అతితక్కువ ప్రభావం ఉండేటట్లుగా పర్వత ప్రాంతాల్లో, మెట్ట ప్రాంతాలలో అనేక చిన్నచిన్న రిజర్వాయర్లు నిర్మించి, మెట్టప్రాంతాలకు కూడా చాలినంత నీటిని సహజపద్ధతిలో సరఫరా చేయగలుగుతాము. ఈనాడు ప్రపంచంలోని అనేక దేశాలు ఈ పద్ధతిని అమలు చేస్తున్నాయి. మనం కూడా ఈ టెక్నాలజీని వినియోగిం చుకుంటే, పెరుగుతున్న దేశ అవసరాలు తీర్చగలుగుతాము.

(3వ భాగం వచ్చేఆదివారం)

- వ్యాస రచయిత : అఖిల భారత అభ్యుదయ వేదిక జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు. సెల్ : 09848933545

సందర్భం

"భయం" ఫాసిజానికి దగ్గర బంధువు

అక్కినేని చంద్రరావు

అసలు వ్యవస్థ రుగ్మతలను ప్రశ్నించకపోతే ఎలా? నేడు అసలు సమస్య ఏమిటంటే 'ప్రశ్నించేతత్వాన్ని పెంచటం ఎలా అన్నదే, ఈవైపుగా సామాజికవేత్తలు, మేధావులు, ప్రజాస్వామికవాదులు ఆలోచించాల్సిన అవసరం మరింతగా పెరిగింది. నిఖిల్ చక్రవర్తి (మెయిన్‌స్ట్రీమ్ సంపాదకుడు) స్మారకోపన్యాసంలో ప్రముఖ చరిత్ర పరిశోధకురాలు రొమీలాథాపర్ వెళ్ళబుచ్చిన ఆవేదన. ఫిబ్రవరి 8న ఆంధ్ర రాష్ట్రంలో జరిగిన బంద్ చరిత్రలో తప్పనిసరిగా మంచిస్థానం పొంది తీరుతుంది. ప్రజలలో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆగ్రహం, రాష్ట్ర వీధుల్లో ప్రవహించింది. ప్రశాంతంగా జరిగిన బందు, పార్లమెంటును, రాజకీయ వ్యవస్థను తీవ్రమయిన వత్తిడికి గురిచేసింది. ఇష్టాయిష్టాల మధ్య రాజకీయ పార్టీలను, ప్రజలు వీధుల్లోకి లాక్కువచ్చారు. నాలుగు సంవత్సరాల కేంద్రం నడకను, రాష్ట్రం నడకను ప్రజలు సమైక్యంగా ప్రశ్నించారు.ప్రజల ప్రశ్నలకు వారు కోరుకున్న రీతిలో సమాధానాలు, ఫలితాలు రాలేదు. నాలుగు సంవత్సరాలనాడు జరిగిన మోసం వంచన మళ్ళీ రాజకీయ రూపంలో ఫిబ్రవరి 8న జరిగిన వ్యవహారాన్ని ఇదే ప్రజలు గ్రహించారు.

ఏపీ విభజననాటినుండి రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని మొదటిసారిగా పిలుపిచ్చింది, భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్రానికి యిదొకటే ప్రత్యామ్నాయంగా చెబుతూ సీపీఐ ప్రతిరోజూ ఈ సమస్యపై పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తూనేఉంది. దీన్ని వృథా ప్రయత్నంగా చాలామంది రాజకీయ పార్టీలు, కొందరు మేధావులు నీరుగార్చటానికి ప్రయత్నించినా, సీపీఐ ఏనాడూ తన ప్రయత్నాన్ని విడనాడలేదు. ఈ నిరంతర ప్రయత్నంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణ, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకుడు శ్రీ చలసాని శ్రీనివాస్ ఇరువురి పట్టుదల, ప్రయత్నాలు ఫిబ్రవరి 8 బంద్‌కు రాష్ట్రాన్ని సమైక్యంగా నడిపించాయి. అధికారాన్ని ప్రశ్నించే స్థాయికి ప్రజలను సమీకరించే క్రమంలో ఇదొక గొప్ప అనుభవంగా స్వీకరించాల్సిందే. సీపీఐ ప్రత్యేక హోదాకు జెండా ఊపినా దీనిలో పాల్గొనటానికి అన్ని రాజకీయ పక్షాలు (బీజేపి మినహా) ముందుకు రావటం ఆహ్వానించదగ్గ పరిణామం. అయితే దీన్ని కొనసాగించటం ఎలా అనేది ఇప్పుడు రాష్ట్ర ప్రజల ముందున్న పెద్ద సవాలు. 'ఫిబ్రవరి' బంద్ ఫలితం సానుకూలంగా మార్చుకోవాల్సిన అవసరం ముందుకొచ్చింది. ప్రజలు మాత్రం ఈ విషయంలో ఖచ్చితంగానే వ్యవహరిస్తారు.

అయితే ఈ క్రమంలో ఎవరి నిజాయితీ ఎంత? అనేది అసలు ఎదురయ్యే ప్రశ్న. ఫిబ్రవరి 8 బంద్ దీనికి కొంత సమాధానం యిచ్చింది. ఆ రోజు ఎవరు? ఎలా? ఎటు నడిచారన్నదాన్ని పరిశీలిస్తే భవిష్యత్తుకు పూర్తి సమాధానం దొరుకుతుంది.2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి, బీజేపీతోను, జనసేన జతకలిసి 'ప్రత్యేక హోదా' కావాలని ఊరూరా ప్రచారం చేశారు. అధికారంలోకి రాలేని వైఎస్‌ఆర్ సిపి, కాంగ్రెస్‌లు యిదేబాణీని వినిపించాయి. అధికారం అందిందే తడవుగా టీడీపీతో సహా, వైసీపీ, కాంగ్రెస్‌లు కూడా దీన్ని మర్చిపోయాయి. జనసేన నాయకుడు అప్పుడప్పుడు తెరమీద కనిపిస్తూ 'హోదా' విషయం వదిలేశాడు.హఠాత్తుగా ఫిబ్రవరి 8కి మళ్ళీ వీరందరికి హోదాలు, వాగ్దానాలు, ప్యాకేజీలు అన్నీ గుర్తుకొచ్చాయి. 2014 ప్రథమ అంకంలో వినిపించిన బాణీని 2018 ఫిబ్రవరి 8న వీరందరూ పిల్లివాటంగానే తమ నైజాన్ని ప్రదర్శించారు. వీరంతా ప్రజలకు తాము అన్యాయం చేశామనే భావంతో ఇప్పటికైనా ఉన్నారా అంటే ప్రజలు మాత్రం ఈ విషయంలో సందేహంగానే ఉన్నారు. అందుకే ఫిబ్రవరి 8 వామపక్షాలు, ప్రత్యేకహోదా సాధన సమితి, ఇతర సంఘాలు నిర్వహించిన బందు 'ప్రజలబంద్'గా ముందుకొచ్చింది. ప్రజలు ధైర్యం చూపించారు. కాని టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, జనసేనలాంటి వారు భయంతోనే ఈ బంద్‌కు 'మాటవరసకే' పాత్ర పోషించారు. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, జనసేన వీరందరూ వాస్తవం చెప్పాలంటే బీజేపీ భయంతో బతుకుతున్నారు. ఈ నాలుగు సంవత్సరాల బీజేపీ పాలన వారిని భయపెట్టింది. వీరు భయపడటానికి, వీరందరి దగ్గర కావలసిన కారణాలు పుష్కలంగా ఉన్నాయి. ఫిబ్రవరి 8వ తేదీ దీనికి నిఖార్సయిన రుజువు.బీజేపీతో జతకట్టి 2014లో అధికారం చేపట్టిన టీడీపీ తాను తన పతనంలోకి ప్రయాణించింది. టీడీపీకి ఏనాడూ ఒక సిద్ధాంతంతో [illegible] చరిత్ర లేదు. అది అన్ని సందర్భాలలోనూ అవకాశవాద [illegible]. వివిధ పార్టీల అసంతృప్తుల సంక్రమణం టీడీపీ. దాని సిద్ధాంతం అధికారం, అందలం. అధికారం యొక్క అవకాశానికి అది ఎప్పుడూ కాచుకునే ఉన్నట్లుగా దాని చరిత్రే చెబుతోంది. 2014లో తన అవసరాన్ని బీజేపీ ద్వారా తీర్చుకుంది. 'రాజశేఖర్‌రెడ్డి' ప్రభావాన్ని తట్టుకోవాలంటే టీడీపీ ఈ జతను అవకాశంగా తీసుకుంది. కాని ఈజత దాని ఊపిరినే తీసే దశకు చేర్చింది. బీజేపీ బంధంతో టీడీపీ ఇప్పుడు సంకెళ్ళు పడే స్థితికి నెట్టబడింది. ఇరువురి స్వార్థం, ప్రజలను కూడా భయాలకు గురిచేసింది. బీజేపీది మత సిద్ధాంతం, దీని ద్వారా అది నియంతృత్వానికి బాటవేసింది. అది క్రమేపి దేశంలోని అన్ని అధికారాలను కేంద్రీకృతం చేసి తన గుప్పెట్లో పెట్టుకుంది. అన్ని రాష్ట్రాలమీద అది 'హెడ్‌మాస్టర్' పాత్రను పోషిస్తూ పెత్తనం చలాయిస్తున్నది.

వామపక్షాలు మినహా మిగిలిన ప్రాంతీయ పార్టీలు, జాతీయ పార్టీల వారెవ్వరూ దీన్ని గట్టిగా ప్రశ్నించకపోవటం ద్వారా వారంతా అవకాశవాదం వెంటే నడిచారు. ఇందులో ఎక్కువ పార్టీలు భయంతోనే బీజేపీకి లొంగిపోయాయి.

ఈ విషయంలో టీడీపీ ప్రథమస్థానాన్ని పొందిందనే చెప్పాలి. వైసీపీ కూడా ఆంధ్రలో అటూయిటూగా యిదే స్థాయిలో నడుస్తున్నది. డబ్బుమయంగా అధికారంలోకి వచ్చిన టీడీపీ కొద్దికాలం తన గణాల సంపాదనకు పగ్గాలను పైస్థాయిలో వదిలింది. కాని క్రిందిస్థాయిలో అది పగ్గాలను సడలించలేదు. ఇంటి నిరసన తట్టుకోలేని దాని నాయకత్వం క్రమేపి సంపాదన పగ్గాలను పూర్తిగా వదిలేసింది. ఈ నాలుగు సంవత్సరాలలో జన్మభూమి కమిటీ సభ్యుడినుండి పైస్థాయి వరకు, అది సమాంతర పరిపాలనారంగాన్ని సృష్టించింది. ఈ విధంగా తన పార్టీ క్యాడరుకు, వారి సంపాదనకు ఒక వికేంద్రీకరణ విధానాన్ని, అది ప్రభుత్వ యంత్రాంగంతో అనుసంధానం చేసింది. బీజేపీ దీనికి భిన్నంగా తన సంపాదన కొరకు అది అన్ని రంగాల్లోనూ దీన్ని కేంద్రీకరించుకుంటూ వచ్చింది. టీడీపీ నైతిక పతనానికి ఇది మొదటి అడుగు. 'ఓటుకు నోటు' కేసులో [illegible] ఆలోచనను [illegible]పోయింది. కేంద్రాన్ని ఏదీ అడగలేని పరిస్థితికి నెట్టబడింది. రాయబారాలు ఎన్ని నడిపినా బీజేపీ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపర్చుకుంది. టీడీపీని ఖాతరు చేయలేదు.

ఒక విధంగా టీడీపీకి బీజేపీ భయం పట్టుకుంది. బీజేపీ అలా భయపెట్టుకుంటూ వచ్చింది. అందువల్ల హోదా పోయింది, ప్యాకేజీ పోయింది, చివరకు ఓటుకునోటు కేసు, టీడీపీ వికేంద్రీకరణ సంపాదనలలో సతమతమవుతూ తన ఉనికి ఏమిటి అన్న ఆందోళనకు గురయ్యింది. అంతిమంగా టీడీపీ భయానికి గురయింది. దేబిరించటం తప్ప ధైర్యం చేయలేని పరిస్థితి. ఫిబ్రవరి 8న బంద్‌లో టీడీపీ తన ఇరకాటంలో కూడా నాటకీయంగా తన పాత్రను 'మమ' అనిపించింది. తన తండ్రి పాలనలో కేంద్రీకరణ సంపాదనకు అలవాటుపడ్డ జగన్, రాష్ట్ర రాజకీయాలలో అంతిమంగా బీజేపీని అంటకాగటం ప్రారంభించాడు. ఒక అడుగు లోపల - ఒక అడుగు బయటగా ఉన్న వైఎస్‌ఆర్ నాయకుడి పరిస్థితి, బీజేపీకి వరంగా మారింది. తమిళనాడు వ్యవహారంతో వైసిపి కూడ బీజేపీకి భయపడుతున్నది.

జనసేన పరిస్థితి ఈ రెండు పార్టీలకు ఏమాత్రం భిన్నంగా ఉండదు. ఫిబ్రవరి 8తోనే దాని పరిస్థితి అర్థమయిపోయింది. ప్రజలందరూ మాకు న్యాయం కావాలని కోరుకుంటూ అంతిమంగా బంద్‌కు వెళితే తాను ఇంకేదో మేధావులు, లోతైన ఆలోచనలు చేయాలని మాట్లాడటం, నాన్చుడి ధోరణి తప్ప మరొకటి కాదు.ప్రజలు ముందుకు నడుస్తూంటే తాను వెనకే వస్తాననటంలోనే నాటకీయ ధోరణి గమనించొచ్చు. బీజేపీ పత్తాను నుండి బయటపడలేని బలహీనత ఇది. మరో విధమయిన భయం కూడా ఉండి ఉండవచ్చు.

పార్లమెంటులో ఏది మాట్లాడినా అది చట్టబద్ధం అనే భ్రమలో ప్రజానీకాన్ని ఉంచటం విభజన సందర్భంగా జరిగిన అన్యాయం. ఎ.పి. విభజన సందర్భంగా పార్లమెంటులో జరిగిన యాతంతుకు అన్ని రాజకీయ పక్షాలు బాధ్యత వహించాల్సిందే. దీనిలో పాపం ఎక్కువగా కాంగ్రెస్, బీజేపీలదే. ప్రత్యేక హోదాను [illegible] కాంగ్రెస్ [illegible]. బీజేపీ దాన్ని ప్రస్తుతం నీటిమూటగా మార్చింది. కాంగ్రెస్ చేసిన పాపాలన్నీ బీజేపీకి కలిసిరావటంతో హోదా విషయంలో కాంగ్రెస్ పాపాన్ని జపించటం బీజేపీకి అలవాటయింది. కాని దేశ ఆర్థిక విధానాల్లో కాంగ్రెస్ పాపాలనే బీజేపీ తలకెత్తుకుంది. అందుకే కాంగ్రెస్ విమర్శ బీజేపీని అంతగా తాకలేకపోతోంది. ఫిబ్రవరి 8 బంద్ విషయంలో కూడా కాంగ్రెస్ ఉనికి మసగ్గానే కనిపించింది. రాష్ట్ర ప్రజలకు బీజేపీ మీద నమ్మకం పోయింది. టీడీపీ, వైసీపీ, జనసేనలాంటి వారు మాత్రం వత్తిడితో కూడిన నమ్మకంతో ఉన్నారు. బీజేపీ భయం వారిని ఇంకా యిలాగే నడిపిస్తుంది. వీరందరూ కలసి తమను మోసం చేస్తున్నారని రాష్ట్ర ప్రజలు బాగా అర్థం చేసుకున్నారు. వీళ్ళేది చెప్పినా ప్రజలు సమ్మేస్థితిలో లేరు. తలలూపే రాజకీయాలంటే ప్రజలు విరక్తిచెందారు. ప్రజలు మాత్రం ధైర్యంగానే ఉన్నారు. తన నియంతృత్వ విధానాల ద్వారా దేశాన్ని భయపెడుతున్న బీజేపీకి ఆంధ్రరాష్ట్ర ప్రజలు గట్టిగా యిచ్చిన ఫిబ్రవరి 8 సమాధానం యావత్తు దేశానికే ధైర్యాన్నిచ్చింది. దీన్ని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నియంతృత్వానికి సవాలుగా నిలిచేది ధైర్యం మాత్రమే. అది ప్రజల్లో పెల్లుబికినపుడు దాన్ని నడిపించాల్సిన బాధ్యత రాజకీయ వ్యవస్థదే. అదికూడా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే నిబద్ధతగల రాజకీయ వ్యవస్థ అయివుండాలి. ఈ నిబద్ధతకు వామపక్షాలయిన సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీలాంటి పార్టీలు ఫిబ్రవరి 8న అద్దంపట్టాయి. ప్రతి చిన్న సమస్యకు జైళ్ళలో కుక్కుతున్నప్పటికీ నాలుగేళ్ళుగా ధైర్యంగా, రాష్ట్ర ప్రజలకోసం నిలబడ్డారు. అందుకే వామపక్షాలు ధైర్యంగా యిచ్చిన బంద్ పిలుపునకు ప్రజలు స్పందించారు.ఇప్పుడు ప్రజలపక్షాన నిలబడి తమ నడకను మార్చుకుంటారా? లేదా అనేది టీడీపీ, వైసీపీ, జనసేన లాంటి వాళ్ళు ఆలోచించుకోవాలి. ఇప్పటికే మీ అధైర్యం మిమ్ములను బీజేపీ నియంతృత్వానికి దగ్గరగాచేర్చింది. నియంతృత్వంతో తెగతెంపులు చేసుకోకపోతే మీరు ఫాసిజానికి దగ్గరకు చేరుతున్నట్లే. వామపక్షాలు చెప్పేది ఆలోచించండి లేదా బీజేపీ భయం మిమ్ములను తరుముతూనే ఉంటుంది.

విశాలాంధ్ర
బతుకు
The Life
ఆదివారం
11 ఫిబ్రవరి 2018





తులసి.. ఓ మొక్క, మొక్కగానే పూజలందుకుంటుంది. సాహితీవనంలో ఈ తులసి మాత్రం మహావృక్షమయ్యింది. ఆదర్శ రచయిత్రిగా ఎదిగింది. అభ్యుదయ భావజాలాన్ని పుణికిపుచ్చుకొని, తండ్రి చాసో చూపిన బాటలో నడుస్తూ, అక్షర ప్రపంచంలో తనదైన సుగంధాలు వెదజల్లుతోంది. సమాజంలోని లోపాలను ఎత్తిచూపుతూ పదునైన రచనలు చేస్తునే, పరాయిభాషలోని ఆణిముత్యాలను తెలుగులోకి అనువదిస్తూ ఆంధ్ర సాహిత్యలోకాన్ని సుసంపన్నం చేస్తున్నారామె. ఆమే చాగంటి తులసి. ఆమె మాటల్లోనే సాహిత్య, జీవిత ప్రస్థానం...

సాహితీవనంలో తులసివృక్షం



చాసో సాహిత్యవేదిక విశాఖపట్నం అరసం సన్మానం



బాల్యం..

ఊరు విజయనగరం. పేరు తులసి. పుట్టిందీ పెరిగిందీ చిన్నిపల్లివీధిలోని చాసో హవేలీలో. నాన్నపేరు చాగంటి సోమయాజులు(చాసో), అమ్మ అన్నపూర్ణమ్మ.బామ్మ తులసమ్మ. ఆవిడ పేరే నాపేరు. అమ్మానాన్నలకు నేను రెండో పిల్లని. పేరు బామ్మదైనా నన్ను చిన్నా అని పిలిచేవారు. మా అక్క అమ్మాజీ. నేను చిన్నాజీని! గురజాడ గేయాలు, కన్యాశుల్కపు సంభాషణలు, ఆచార్య రోణంకి అప్పలస్వామి గారి ఫ్రెంచి, ఇంగ్లీషు కవితాగానం, రోణంకివారితో శ్రుతి కలుపుతూ శ్రీరంగం నారాయణ బాబు ఇంగ్లీషు పద్యాలు వినిపించడం, మధ్యమధ్య విశాఖపట్నం నుండి వచ్చే శ్రీశ్రీ... ఈ ముగ్గురూ ఒకరితో ఒకరు గొంతులు కలిపి పాడ్డం... వీటన్నిటితో మా చావడి గది హోరెత్తుతూ ఉండేది. వారి వాదోపవాదాలు, చర్చలతో గోడలు ప్రతిధ్వనిస్తూ ఉండేవి. వాళ్లు పాడే పాటలు వింటూ వాళ్ల కాళ్ళకి అడ్డం పడుతూ, వచ్చీరాని మాటలు నేర్చుకుంటూ నేను పెరిగాను. చాసో 'చిన్నాజీ' కథ, నారాయణబాబు, "చిన్నా!" అన్న గేయం నామీద రాసినవే!

పసితనపు మనస్సుకి పట్టేది ఆటే. నా మొదటి జ్ఞాపకం ఆటే. 'డమడమాల బండి' తాడు పట్టుకుని మా గచ్చు వాకిట్లో గుండ్రంగా తిరగడం, 'డమడమ' చప్పుడుకోసం వెనక్కి తిరిగి చూడ్డం ' ఆ డమడమ' ఆగిపోవడం, నేను నడవగానే నా వెనకాతలే 'డమడమ' అంటూ బండి రావడం, చూద్దామంటే కుదరకపోవడం – అప్పుడు నాకు మూడేళ్లు. ఇప్పుడు ఆ జ్ఞాపకం వచ్చినప్పుడల్లా బతుకు బండిని లాగుతూ వెనక చప్పుళ్లకి ఆగేవాళ్లు, చప్పుళ్లకి చలించకుండా వెళ్లేవాళ్లు నా ఎదట కనపడుతూ ఉంటారు.

పసితనపు మనస్సుకి ఆట తర్వాత పట్టేది పాటే! 'చిన్నాజీ' కథలో చాసో చిన్నాజీకి పాటల "ఇచ్" ఉన్నాదని రాశాడు. అవును, ఐదారేళ్ల వయస్సులో నాకు పాటల 'ఇచ్' ఉండేది. నారాయణ బాబు "చిన్నా నీ కళ్ళు క్రైస్ట్ చైల్డ్ కళ్లు" అంటూ నన్ను చూసి పాడ్డం, నేను కళ్లు తిప్పడం ఆనాటి నా జ్ఞాపకాల్లో మా మంచి జ్ఞాపకం. ఆ వయస్సులో వచ్చీరాని సినిమాపాటలు పాడేదాన్ని. వాళ్లు నన్ను ఉడికిస్తే ఉడుక్కునేదాన్ని. "నా పాటలే మంచి పాటలు. మీ పాటలు మంచివి కావు. "మా అమ్మే చంపింది. మా అమ్మే చంపింది'' అని నారాయణ బాబు పాటలో ముక్కని నాకు వచ్చిన దాన్ని వెక్కిరించేదాన్ని. వాళ్ళు మరీమరీ వెక్కిరిస్తే ఉడికిస్తే "నన్ను అలా అనకండమ్మా! అలా అంటే నాకు ఏడుపొస్తుంది'' అనేదాన్ని!

పసితనంలో మనస్సుకి పట్టేది ఆటాపాటా ఈ రెండే కాదు. మూడోది కథ. కథ చెప్పించుకోవడం, వినడం, చెప్పిన కథల్నే పెద్దవాళ్లు చెప్పడం, విన్న కథల్నే మళ్లీమళ్లీ చెప్పించుకుని వినడం. బామ్మ అలాంటి కథలు చెప్పేది. నాన్న రోజూ కాళ్లు పట్టించుకుంటూ కథలు అప్పటికప్పుడు కల్పించి చెప్పేవాడు. కథలు అల్లుతూ చెప్తున్న సంగతి ఆ చిన్న వయస్సులో నా మనస్సుకి తెలిసీ తెలియనట్టు తెలుస్తూనే ఉండేది. నేనూ చెప్పగలను. నువ్వు ఉన్న కథలు చెప్పటంలేదు అంటూ ఉంటే, అయితే నువ్వూ చెప్పు. నీకు నువ్వే చెప్పుకో అని నాన్న నవ్వేవాడు. నాకు నేనే చెప్పుకోవచ్చు అనే మాట మనస్సులో గట్టిగా నాటింది. కథ చెప్పుకోవచ్చు. కాయితంమీదా రాయొచ్చు. నేను కథలు రాయడానికి ఇదీ బీజం.



తెలుభాషావికాసం సన్మానం

నాన్నా, నాన్న చావడిగదీ, ఆధునిక ఆలోచనలతో మార్క్సిస్టు చర్చలతో హోరెత్తుతూ ఉంటే బామ్మా, అమ్మల నట్టిల్లూ, భోజనాలగది, వంటిల్లు సంప్రదాయబద్ధమైన వంటలతో, పండగలతో, వారపు అబ్బాయిల భోజనాలతో, ఆదిత్యహృదయం, భాగవతపద్యాలు, కాళహస్తీశ్వర శతక పద్యాలు, భగవద్గీత శ్లోకాలు, శివపూజలతో, హడావుడిగా సందడిగా ఉండేది. బామ్మవాళ్లు సంప్రదాయాల్ని పాటించినా నాన్నని అభిమానించినట్టే, నాన్న స్నేహితుల్నీ అభిమానించేవారు. నానారకాల వాళ్ళు – ఉన్న వాళ్లు – లేనివాళ్లు – పేదవాళ్లు – చిన్న వాళ్లు – కులంగిలం, జాతీగీతీ తనా–పరాలాంటివాటితో సంబంధంలేని అభిమానం, ఆదరణ అది!

మా విజయనగరం గొప్ప సాంస్కృతిక కేంద్రం. ఒక పక్క సంగీత కచేరీలు, హరికథలు, బుర్రకథలు, నాటకోత్సవాలు, ఇంకొక పక్క రాజకీయ సభలు, సమావేశాలు, విద్యావైజ్ఞానిక చర్చలు, అన్ని రంగాల్లోనూ నిష్ణాతులైనవారి రాకపోకలు, ఎప్పుడూ ఏదో ఒక సందడితో ఉత్సాహంగా ఉరుకుతున్నట్టు ఉండేది.

మా పిల్లల ఆటపాటల్లో ఆధునిక గేయాలు మాకు తెలీకుండానే వచ్చి కలిసిపోయాయి. నారాయణబాబు పాడినట్టు పాడడానికి ప్రయత్నిస్తూ గేట్లో గడ్డిమీద నడుస్తూ 'గడ్డిపరకనూ! గడ్డిపరకనూ! నా మీంచి నడవండి గడ్డి పరకనూ' అనో, మెట్లమీద నుంచి వరసగా దిగుతూ మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది, పదండి ముందుకు పదండి తోసుకు'' అంటూ శ్రీశ్రీనో ఆటలో భాగంగా పాడ్డం అతిమామూలు సంగతి అయింది. గురజాడ దేశభక్తి గేయం, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ పాటలు సభాప్రారంభాల్లో నలుగురు అమ్మాయిలతో కలిసిపాడ్డం, రాయప్రోలు ఏ దేశమేగినా, నండూరి ఎంకివంటీపిల్ల, బసవరాజు అప్పారావు మామిడిచెట్టుని అల్లుకున్నదీ, విశ్వనాథ గోదావరీపావనోధార – మా పిల్లల నోట్లో – వాళ్లందరూ మా వాళ్లే అన్నట్టుగా అనిపించేది. చింతాదీక్షితులు, 'సూరీసీతీవెంకి' కథలు, మునిమాణిక్యం కాంతం కథలు, 'రుక్మతల్లి', మణిదీపాలు కథల సంకలనంలో విశ్వనాథవారి 'నీ ఋణం తీర్చుకుంటా', శ్రీపాదవారి కథలు, గోర్కీ అమ్మ ఇలా ఇంట్లో ఉన్న కథల పుస్తకాలు, ఇంటికొచ్చే భారతి మొదలైన పత్రికలూ చదవడం మొదలయింది.

నాన్న మాచేత బాలికాసంఘం పెట్టించాడు. సభని ఎలా నిర్వహించాలో, కార్యవర్గాన్ని ఎలా ఏర్పాటు చేసుకోవాలో, కార్యదర్శి మినిట్స్ ఎలా రాయాలో, ఆనాటి సమావేశపు ఎజెండా ఏమిటో, రాబోయే సమావేశాలలో చర్చించవలసిన విషయమూ అంశం ఏమిటో అన్నిటినీ నేర్చుకున్నాం. బాలికా సంఘంలో మా అంతట మేం చిన్నచిన్న ఉపన్యాసాలు నిర్వహించుకునే వాళ్లం. సభాపిరికితనం అన్నది మాకెవరికీ లేకుండా ఈ సమావేశాల్లో మాకు మేం శిక్షణ ఇచ్చుకున్నట్టు అయింది. మా బాలికా సంఘం గురించి రేడియో అన్నయ్య న్యాపతి రాఘవరావుగారి 'బాల' మాసపత్రికలో పడింది. ఊళ్లో జరిగే ప్రతిసభకి, సమావేశానికి, కచేరీలకి, హరికథలకి, బుర్రకథలకి, నాటకాలకీ అన్నిటికీ ముందు వరసలో ఉండేవాళ్లం. కన్యాశుల్కం నాటకం ఆడుతూ ఉంటే వంగదేశమున కరువుపుట్టెను బాబా! అని పాడుతూ, కన్నంపెట్టిన డబ్బాను గలగల్లాడిస్తూ మా అక్క అమ్మాజీ, వల్లభరావుగారి చెల్లెలు జె.విశాలాక్షి (కె.గోవిందరావుగారి భార్య) బాలికా సంఘ సభ్యులం అందరం అందరి దగ్గరికీ వెళ్లి చందాలు వసూలు చెయ్యడం నా చిన్నతనపు జ్ఞాపకాల్లో అపురూపమైన జ్ఞాపకం. ఆనాటి నాటకంలో అయలసోమయాజుల నరసింహశర్మగారు లుబ్ధావధానులుగా నటించారు. రోజూ సాయంత్రం పార్కుకి వెళ్లేవాళ్లం. ఆ రోజుల్లో మా ఊళ్లో లేడీస్ పార్క్ పువ్వులమొక్కలతో ఆకుపచ్చటి మెత్తటి గడ్డి తివాసీతో ఎంతో చక్కగా ఉండేది. అక్కడ రేడియోలో వార్తలు వేసేవారు.

మా ఇంటి వాతావరణం, నాన్న, నాన్న స్నేహితుల చర్చలు, మా ఊరి సాంస్కృతిక వాతావరణం నన్ను నన్నుగా రచయితగా మలిచాయి. నా మొదటి కథ అచ్చు వేయించినదీ నారాయణబాబే. నా చేత మొట్టమొదటి ఉపన్యాసం ఇప్పించినదీ నారాయణబాబే. నాలుగో క్లాసు చదువుతున్నప్పుడు 'భరతపక్షి' అని కథ రాశాను. ఆ కథని నాన్నా, నారాయణబాబూ, అ.న.శర్మగారు (పండిత అయల సోమయాజుల నరసింహశర్మగారు)విని బాగుందన్నారు. నారాయణబాబు నాకు ఫొటో తీయించి కథనీ ఫొటోని పట్టుకుని మద్రాసు వెళ్ళిపోయాడు. నాన్నకి చెప్పకు అన్నాడు. 1946 జులై బాల మాసపత్రికలో నా ఫొటోతో వచ్చాక నాన్నకి తెలిసింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కాంగ్రెసు నాయకులు పసుమర్తి వీరభద్రస్వామిగారు ఊళ్లోని రచయితలని, పండితులని సత్కరించారు. నన్నూ పిలిచారు. బాలలో నా కథ పడింది కద! ఆ వేళ ఉన్నట్టుండి నారాయణ బాబు "చిన్నా! నువ్వు మాట్లాడు'' అని వేదిక మీదకి పిలిచాడు. అదే నా మొదటి ఉపన్యాసం. సద్యస్ఫూర్తితో మాట్లాడ్డం రావాలి అన్నది నాకు అప్పుడే తెలిసింది. అందరితో పాటు నన్నూ సత్కరించి ఖద్దరు నూలుదండా, బత్తాయి పళ్లు ఇచ్చారు.

నా హైస్కూలు చదువు పూర్తి అయ్యేసరికి విజయనగరం నుండి మా భూములున్న ఊరు లచ్చుమ్మపేటకి మారాం. లచ్చుమ్మపేటకి వెళ్లటానికి ముందే నా కథ ఆంధ్రప్రభ వారపత్రికలో అచ్చయింది. లచ్చుమ్మపేటకి కొత్తపల్లి లలితగారు (రాయప్రోలు సుబ్బారావుగారి అమ్మాయి, కొత్తపల్లి వీరభద్రరావుగారి భార్య) Promising ఉంది అంటూ మెచ్చుకుంటూ కార్డు రాశారు. పల్లెటూరికి వెళ్ళిపోవడంతో కాలేజీకి వెళ్లే చదువు ఆగిపోయింది. కాని అసలు చదువు ఆగిపోలేదు. చెకోవ్, టాల్‌స్టాయి, గోర్కి, జేన్‌ఆస్టిన్, ఎమిలీబ్రాంటీ ఆస్కార్‌వైల్డ్ – ఇలా వీళ్లని చదువుతూ గోల్డన్ ట్రెజరీలో ఇంగ్లీషు పద్యాలు గట్టిగా పైకి చదివి మా పల్లెటూరి అరుగుల్ని అరగదీయడం జరిగింది. అక్కడే మనుచరిత్ర మూడు ఆశ్వాసాలు కంఠతాపెట్టినట్టు చదువుకున్నాను! కళ్ళేపల్లి గ్రామం (లచ్చుమ్మపేట పక్కనున్న ఊరు)లో హిందీ మాస్టారు పేరి సుబ్రహ్మణ్యం గారు స్కూల్లో మాస్టారు. ఆయన పుస్తకాలు ఇవ్వడంతో దక్షిణభారత హిందీ ప్రచారసభ వారి పరీక్షలు రాశాను! దాంతో విజయనగరం తిరిగివచ్చాక ప్రచారసభవారి పరీక్షలు 'ప్రవీణ' వరకూ ఆపకుండా చదవడం జరిగింది. కాలేజీ వరండాల్లో తిరగకుండా ఇంటరూ, బియ్యే పాసయ్యి ఉస్మానియా వరండాల్లో తిరిగి ప్రొ.రామనిరంజన్ పాండేగారి హిందీ విభాగంలో చేరి పోస్టుగ్రాడ్యుయేట్‌నయ్యాను. ఒడిశా గవర్నమెంట్ అంగూల్ కాలేజీలో, మన ఆంధ్రాగవర్నమెంట్ కర్నూల్ కాలేజీలో ఒకేసారి లెక్చరర్‌షిప్‌కి ఆర్డర్లు వచ్చాయి. హిందీ చదువుకున్నాను హిందీ ప్రాంతానికి వెళ్లాలని కోరిక. ఒడిశా మరో రాష్ట్రం. అక్కడికే వెళ్లాలి. హిందీ భాషాప్రాంతం కాకపోయినా మరోభాషాప్రాంతం అని నిర్ణయించుకుని ఒడిశా ప్రభుత్వ విద్యాసేవలో చేరి లెక్చరర్‌గా, రీడరుగా మూడు దశాబ్దాలు పనిచేశాను. ఆంధ్రాయూనివర్సిటీ నుండి పిహెచ్‌డి చేశాను. కటక్‌లో జ్ఞానపీఠ్ అవార్డుగ్రహీత, ప్రగతిశీల కవి పద్మశ్రీ సచ్చిదానందరావుత్‌రాయ్ కుటుంబంతో మైత్రి పెరిగింది. రావుత్‌రాయ్ తెలుగువారి అల్లుడు. ఆయన ఇంట్లో రచయితలు కలుసుకుంటూ ఉండేవారు. ఒరియా రచయితలు, కవుల పరిచయం అయింది. నళినీదేవి రావుత్‌రాయ్, (నీలమణిరావుత్‌రాయ్ గారి భార్య) 'మరుతీర్థా' అనే పత్రిక నడిపేది. ఆవిడ కాజీనజ్రుల్ ఇస్లామ్ కవిత్వాన్ని ఒడియాలోకి అనువదించింది. మా క్వార్టరుకి ఎదురుగా నీలమణి రావుత్‌రాయ్‌గారి భవనం. రోజూ నళినీ దీదీ నా దగ్గరికి వచ్చేవారు. స్నేహశీలి, సరళ స్వభావం. మంత్రిభార్యగా కాదు, రచయిత్రిగా, దీదీగా నాకు ఆత్మీయురాలు అయింది. సచ్చిదానందరావుత్‌రాయ్‌గారు తన కథల్ని తెలుగులోకి అనువాదం చెయ్యమని అడిగారు. నళినీదీదీ చిన్న ఒడియా నిఘంటువు ఇచ్చింది. అనువాదాల వైపు కూడా నా రచన మళ్లింది. రావుత్‌రాయ్ గారి కథలు ఆంధ్రజ్యోతి వారపత్రికలలో వరసగా అచ్చయ్యాయి. శ్రీ ఏటుకూరి బలరామమూర్తిగారు ఓల్గా నుంచి గంగకు తెలుగులో చెయ్యమంటూ ఉత్తరం రాశారు. విశాలాంధ్రవారు నా అనువాదాన్ని ప్రచురించారు. తెలుగు కథలకు నా హిందీ అనువాదాలు హిందీ పత్రికల్లో అచ్చయాయి. తులసి అనువాదకురాలు కూడా అన్న ముద్ర పడింది. అనువాదాలు చెయ్యడం వల్ల సృజనాత్మకత దెబ్బతినదు. ఆయా భాషాసాహిత్యాల అధ్యయనం బలాన్నే ఇస్తుంది. తులనాత్మకంగా చూడ్డానికి వీలు ఇస్తుంది.

పురస్కారాలు

సర్వోత్తమ కథారచయిత - తెలుగు విశ్వవిద్యాలయం హైద్రాబాద్, ఉగాది సన్మాన్ - ఢిల్లీ తెలుగు అకాడమీ, తాపీ ధర్మారావు సాహితీ సత్కారం - విశాఖపట్నం, కొండేపూడి శ్రీనివాసరావు సత్కారం - గుంటూరు, అరసం సత్కారం - విశాఖపట్నం, నాళం కృష్ణారావు స్మారక సత్కారం - హైదరాబాద్, అధికార భాషా సంఘం తెలుగు వికాసం సత్కారం - విజయనగరం, లేఖికా సంఘ సత్కారం - ఒడియా రచయిత్రుల సంఘం - బరంపురం, రోణంకి 98వ జయంతి సత్కారం - టెక్కలి, గిడుగు రామమూర్తి సత్కారం - శారదానికేతన్ - విశాఖపట్నం, సుశీలానారాయణరెడ్డి సాహితీ అవార్డు - హైదరాబాదు, ఆవంత్స సోమసుందర్ సత్కారం - హైదరాబాదులో పొందాను. మౌలిక రచనలు, అనువాదాలు, కూర్పులు, సంపాదకత్వాలు అన్నీ కలిపి 30 పుస్తకాలు వెలువడ్డాయి. నా సాహితీ కృషి ఉత్సాహంగా సాగుతోంది.

హాంకుక్ యూనివర్సిటీ సియోల్‌లో (సౌత్ కొరియా) గెస్ట్ ప్రొఫెసర్‌గా రెండేళ్లు పనిచేశాను. కొరియన్ అమ్మాయిలకు, అబ్బాయిలకు హిందీ నేర్పడం, ఆ దేశంలో ఉండడం మంచి అనుభవం. సియోల్‌లోనూ రచనలు చేసే గ్రూపుతో నెలకోసారి కలిసి పరస్పరం రచనలు చదివి వినిపించడం, వినడం. అమెరికన్లు, కొరియన్లు, జర్మన్లు, ఫ్రెంచివారు ఇలా అన్ని రకాల వారు ఫ్రెంచి రచయిత్రి ఇంట్లో కలుసుకోవడం కూడా జ్ఞాపకం ఉంచుకోవలసిన అనుభవం. చిన్నప్పటినుండి నా నిర్ణయాలు నావే. ఆ స్వతంత్రం స్వేచ్ఛా మా ఇంట్లో ఉన్నాయి. ఏదో ఒకటి అని రాజీపడే స్వభావం తక్కువ. నా పరిధిలో నా దారిలో నా మనస్సుకి నచ్చిన వారు తటస్థపడలేదు. కనుక పెళ్లి చేసుకోలేదు.

నా జీవితంలో అత్యంత విషాద సందర్భాలు – మా అక్క చనిపోవడం, సియోల్‌లో ఉండగా నాన్నకి కాన్సర్ వచ్చిందని తెలియడం, తమ్ముడు చాగంటి శంకర్ చనిపోయాడన్న వార్త వినడం. ఈ విషాదాలు బతుకు చివరవరకూ వెన్నంటే ఉంటాయి.

పట్టరానంత సంతోషం కలిగిన సందర్భాలు – బొబ్బిలిలో శంకర్ దగ్గర ఉన్న నాన్న రాత్రివేళ ఫోనుచేసి "టి.వి.లో ఇప్పుడే నీకు సర్వోత్తమ కథా రచయిత పురస్కారం తెలుగు విశ్వవిద్యాలయం ప్రకటించిందని విన్నాం. నీకు టెలిగ్రాం రేపు వస్తుందనుకుంటాను" అని చెప్పినప్పుడు, "మిమ్మల్ని గెస్ట్‌ప్రొఫెసర్‌గా సియోల్ పంపబోతున్నాం. మీరు వెంటనే ఢిల్లీ రావాలి" అన్న టెలిగ్రాం ఢిల్లీ నుండి వచ్చినప్పుడు. నయాగరా జలపాతపు నీటితుంపర్లు మీద పడ్తూ నాలాగే చూడ్డానికి వచ్చిన వారు కేరింతలు కొడుతూ ఉండగా అద్భుతమైన ధవళమూ స్వచ్ఛమూ అయిన జలప్రవాహాన్ని చూసినప్పుడు!

నా కథలు ఇంగ్లీషు, హిందీ, ఒడియా, ఉర్దూ, మరాఠీ, మలయాళం, కన్నడ భాషలలోకి అనువాదం అయి ఆయా భాషల్లోని కథానికా సంకలనాలలో వచ్చాయి. Glimpses : The Modern Indian Short Story Editor Aruna Sitesh ýË Ash Tray కథ. A Spectrum of My People Tran. Malati Nidadavolu లో హుందా My Sister, A Classy Lady వచ్చాయి. తిరంజేడుథ అనపడుకథాకల్ మలయాళంలో (50 Stories from various Languages)లో వడదెబ్బ కథ వచ్చింది. తెలుగు గల్పొ సంగ్రహొ, కితొటి మనోనీతా తెలుగు గొల్పొ ఒడియా సంకలనాల్లో వచ్చాయి. కొన్ని కథలు పై యూనివర్సిటీల్లో తెలుగు నేర్చుకునే విద్యార్థుల పాఠ్యగ్రంథాల్లో చోటు చేసుకున్నాయి. ఎమ్.కె.యూనివర్సిటీ మధురై విద్యార్థులకు యాష్‌ట్రే కథ చాలా నచ్చిందని ప్రొ.జయప్రకాష్ చెప్పినప్పుడూ, ఢిల్లీ కాలేజీ విద్యార్థులకు వలయం కథ బాగా నచ్చిందని డా.ఏల్చూరి చెప్పినపుడు, రంగనాయకమ్మగారు తనకి నచ్చిన రచయిత్రి కథ ఏది అని అడిగిన ప్రశ్నకు చాగంటి తులసి బొమ్మరూపాయి, ఆకథను ఎప్పుడో దాదాపు 40 ఏళ్ల కిందట చదివాను. ఈనాటికీ గుర్తుంది. నా అభిప్రాయం యిప్పటికీ ఎప్పటిలాగానే ఉంది. అందులో జీవితం ఉంది. విమర్శ ఉంది. ఆదర్శం ఉంది... అన్నప్పుడు, ఆ కథ మాస్టర్ పీసెస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్; వాల్యూమ్–3 (ఎడిటర్ – కె.ఎమ్.జార్జి) ఎన్.బి.టి., ఇండియా 1997లో చోటు చేసుకున్నప్పుడు, నిలిచే కథలుగా అనుకున్నప్పుడు సంతోషం కలిగింది.

వ్యవస్థ వల్ల మన జీవితాలు నిర్ధారించబడుతున్న తీరు, మన స్వభావాలు మారుతున్న విధం విమర్శనాత్మక వాస్తవికతతో నా కథా రచన ద్వారా చెప్పడం నా లక్ష్యం. ఆలోచన కలిగిస్తూ, మనస్సుకి తాకి, ఆర్తుకి, ముందు అడుగుకి [illegible] చెప్పే ధోరణికీ అంతే ప్రాధాన్యత ఉండాలి. ఆ విధంగా నా కథలు ప్రశంసలు పొందాయి. నా రచనలు కొన్నే పుస్తక రూపంలో వచ్చాయి. వచ్చినవి బాగున్నాయి అన్నమాటలని తెచ్చుకున్నాయి.



సియోల్ మహిళలతో

నేను ప్రొఫెషనల్ రచయితను కాను. నాకు రాయాలని అనిపించినప్పుడు, నాలోపల నుంచి దానంతటది తన్నుకు వచ్చినట్టు వచ్చినప్పుడే నేను రాయగలుగుతాను. జరిగిన ఏ సంఘటననో, తత్‌క్షణమే స్పందించి రాయడం, ఫలానా సందర్భం కాబట్టి దానికి రాయాలనుకోవడం, ఫలానాది వేసుకొంటారు కాబట్టి కలంపట్టాలనుకోవడం నా పద్ధతికాదు. రోజూ టేబిలుదగ్గర కూచుని ఇన్ని పేజీలు రాయాలన్న నియమం ఉన్న దాన్నీ కాదు.

నాకు సాహితీ సాంస్కృతిక సంబంధాలు ఎక్కువే. ఎక్కడికి వెళ్లినా అది ఒడిశా అవనీ, దక్షిణ కొరియా సియోలు కానీ నా చుట్టూ చేరేవారు ఆ సంబంధాల వారే! Enlightened కంపెనీ వే! అలా అని సామాన్యమైన పిచ్చాపాటీకి దూరంగానూ ఉండను. అది కథారచనకి అవసరమైన దినుసుకద! సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులచేత నాటకాలు ప్రదర్శింప చేయడమన్నా ఇష్టమే. కటక్‌లో భారతీయ భాషలను తీసుకొని హిందీలో వేయించిన ప్రదర్శనం, బరంపురంలో వేయించిన నాటకం మోహన్‌రాకేశ్ రచించిన ప్రసిద్ధ హిందీనాటకం ఆషాఢ్ కా ఏక్ దిన్ (కాళిదాసు మీద) ప్రశంసలు పొందాయి.



సుశీలానారాయణరెడ్డి సన్మానం

పదవీవిరమణానంతరం విజయనగరంలో స్థిరపడ్డాను. చాసోమార్గంలో ఆయన స్ఫూర్తిని పొంది సృజనాత్మక రచన చేసే అభ్యుదయ రచయితకు పురస్కారాన్ని అందజేయాలని, ఆ స్ఫూర్తి భావి రచయితలకు వారసత్వంగా ఉండాలని 1995లో చాసో స్ఫూర్తిని ఏర్పరిచాం. చాసోస్ఫూర్తి నిర్వరామకృషి 23 సంవత్సరాలుగా జరుగుతోంది.

చాసో శతజయంతి (2014 జనవరి) ప్రారంభోత్సవ సందర్భంగా సాహిత్య అకాడమి వారి రెండురోజుల సెమినారు బాధ్యతను స్వీకరించి విజయనగరంలో నిర్వర్తించడమేగాక 2015 జనవరిలో చాసో స్ఫూర్తి తరఫున శతజయంతి సమాపన ఉత్సవాన్ని సాహితీ యువమిత్రుల సహాయ సహకారాలతో చాసో సాహిత్య సృజనస్ఫూర్తిని వివిధ కోణాల అంశాల ద్వారా ప్రసరింప చేయగలిగాను. రెండు దశాబ్దాల చాసోస్ఫూర్తి ప్రసంగాలను, చాసోకథలు – సాంస్కృతిక పదకోశాన్ని వెలువరించడమేగాక సాహిత్య అకాదెమి సెమినారు వ్యాసాల పుస్తకానికి (మహాకథకుడు – చాసో) సంపాదకత్వ బాధ్యతను నిర్వహించాను. ఈ సంవత్సరం 23వ స్ఫూర్తిసభ సందర్భంగా చాసో, చాసోమిత్రులు రాసుకున్న ఉత్తరాలను, 'నీ ఉత్తరం అందింది'గా, చాసో చెప్పగా రామినాయుడు రికార్డు చేసిన వ్యాసాలు, చాసో రాసిన ఇతర వ్యాసాలను 'ఆలోకన'గా రెండు పుస్తకాలు ప్రచురించగలిగాను. పెంగ్వియిన్ ఇండియా క్లాసిక్ స్టోరీస్ సీరిస్‌లో చాసో కథలు (Doll's Wedding and other Stories) సాహిత్య అకాడమి వారి Selected Stories of chaso, Makers of Indian Literature సీరీస్‌లో – చాసో, పుస్తకాలకు నా సహాయ సహకారాలు అందించాను. గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంపైన 'చాసో సాహితీ వేదిక' పేరుతో ఎ.సి.హాలు అన్ని సదుపాయాలతో నావంతు ఆర్థిక సహాయంతో నిర్మించడానికి తోడ్పడ్డాను.



చాసో, రోణంకి అప్పలస్వామిలతో

నన్ను నన్నుగా నిలుపుకొనే నా వ్యక్తిత్వానికి కారకులైన పెద్దలు వీరే – మా నాన్న చాసో, శ్రీరంగం నారాయణబాబు, ఆచార్య రోణంకి అప్పలస్వామి, పండిత అయల సోమయాజుల నరసింహశర్మ, చిర్రావూరి సుబ్రహ్మణ్యం, ఒడియా కవి సచ్చిదానందరావుతరాయ్, ఉప్పల లక్ష్మణరావు, పురిపండ అప్పలస్వామి, మా అమ్మ అన్నపూర్ణమ్మ, మా బామ్మ తులసమ్మ. అనేక సెమినార్లలో, వర్క్‌షాప్‌ల్లో, సమ్మేళనాల్లో, ఈస్టర్న్ జోన్ రైటర్స్ కాన్ఫరెన్స్ వంటి వాటిల్లో చైర్‌పర్సన్, రిసోర్స్‌పర్సన్, వక్తగాను, సాహిత్యఅకాదెమి యువరచయితల గ్రాంటుతో ఉత్తర భారతదేశపు లక్నో, ఆగ్రా, ఢిల్లీ, అలహాబాద్ హిందీ రచయితలతో ముఖాముఖి సమావేశాలలోను పాల్గొన్నాను. హాంకుక్ యూనివర్సిటీ, సౌత్ కొరియా, సియోల్‌లో రెండు సంవత్సరాలు ఉన్నప్పుడు హాంక్ కాంగ్, సింగపూర్, వెస్ట్ జర్మనీ, ఈస్ట్ జర్మనీ, లండన్, పారిస్, ఈస్టర్న్ అమెరికా న్యూయార్కు, బోస్టన్‌లలో పర్యటించాను.

– మజ్జి వాసుదేవరావు, విజయనగరం



జరిగిన కథ

పాపాయి అడుగుతూంది సుభని : సుభక్కా మనం యెప్పుడూ యీ రైలులోనే వుండిపోతా మేమిటి?"

సుభ జవాబు చెబుతూంది : అబ్బే యీ వేళల్లా అయిపోయాక - రేపల్లా అయిపోయాక యెల్లుండి పొద్దున్నే కాఫీ తాగేక - అప్పుడు నాన్న వస్తారూ- దిగిపోతాం!"... రైలు నడుస్తూంటే కనిపించిన వాళ్ళందరినీ చూసి "నాన్న - నాన్న!" అంటూ పాపాయి నవ్వుతూ చప్పట్లు కొడుతూంది!

తల్చుకుంటే ఆశ్చర్యం వేస్తుంది - జమీందార్లకు వ్యతిరేకంగా శాస్త్రి రైతుల పక్షం ప్రీవీ కౌన్సిలులో వ్యాజ్యం పట్టడం-దమ్మిడీ పుచ్చుకోకపోవడమే కాకుండా ఖర్చులు కూడా తనే భరించడం! ఇంత మార్పు అతనిలో యెల్లా వచ్చిందో - చిత్రం- పర కాయ ప్రవేశమా - ప్రాయోపవేశమా - వేదాంతమా? లేకపోతే నన్ను సంతోష పెట్టడానికా?

(నిన్నటి సంచిక తరువాయి)

యేదేనా కానీ - మనసులో స్వార్థ రాహిత్యం అంటూ ప్రవేశిస్తే మనిషి అన్నవాడు తప్పకుండా మారిపోతాడు. మరేదేనా ఎత్తు వేస్తున్నాడా?... ఛీ! ఛీ!

నేనుమాత్రం మారలేదా? ఎల్లకాలం ఒక్కలాగే వుండిపోయానా? పన్నెండేళ్ళు వచ్చేటప్పటికే- దీనికి పెళ్ళి చేసెయ్యాలి - అంటూ భీమశంకరం మామయ్య శతపోరు పెట్టి అమ్మని వేధించుకొని తినేశాడు. "తోటిపిల్లలందరూ చదువుకుంటూంటే దీనికొక్కర్తికే మాత్రం యేమొచ్చిందిరా తొందర?" అని అమ్మ సమాధానపెడుతూండేది. నాలుగో ఫారం చదువుకుంటున్నప్పుడు యెప్పుడైనా స్కూలు ఫైనలంటూ పాసవగలుగుతానా అని బెంగపెట్టేసుకునేదాన్ని, అనర్సు పరీక్షలో అందరికంటే మొదటిగా ప్యాసయినందుకు ఆంధ్రసమితివారు బంగారు పతకం యిచ్చినప్పుడు సంపూర్ణ పాండిత్యం సంపా దించి గండపెండేరం సింహతలాటం తొడిగించుకున్నట్టే సంతో షించేను!

పరీక్షల్లో ఉత్తీర్ణులవ్వడానికి, పాండిత్యం సంపాదించ డానికి ఎంత తేడా వుందో - పాండిత్యానికి జ్ఞానానికి అంతకంటే సహస్రాంతం తేడా వుంది. నేను ప్రతి సంవత్సరారంభమప్పుడు ఆనర్సు తరగతికి ఇచ్చే ఉపన్యాసంలో చెప్పేదాన్ని : "పాండిత్యం అనే మహా సౌధంలో మీరు మొదటి మెట్టున వున్నారు - నేను మీకంటే మరి ఒక్కమెట్టు పైగా వున్నాను. ఇతిహాసశక్తులూ మనుష్యానుభవం అనే నిత్యనూతన తరంగాలతో నిరంతరం మార్పు చెందుతూ ఉంటుంది జ్ఞానాంబుధి. ఆ మహా సముద్రంలో మీరు చదువు కున్నది ఒక్క నీటి చుక్క. నేను చదువుకున్నది ఒక కాకిరెట్ట. మీకూ నాకూ అంతే తేడా!" అది విని నా కాలేజీ పిల్లలు : "మా ప్రొఫెసరు గారికి యేమి నమ్ర తండీ" అని గొప్పగా చెప్పుకునేవారు... వయస్సు వచ్చి, ప్రపంచంలో తిరిగేటప్పటికి అనుభవం మీద తెలిసింది- వేదాంతశాస్త్రం అధ్యాపకులు చెప్పే మెట్ట వేదాంతము అర్థశాస్త్రజ్ఞులు చెప్పే తప్పుడు అర్థ శాస్త్రము యెందుకో అని - నిజాన్ని మరుగుపరచ డానికిన్నీ నాలాంటి ఉపాధ్యాయులు "నోట్సు పుస్తకాలు" వ్రాసి నాలుగు డబ్బులు సంపాదించుకోవడానికిన్నీ!



పాపాయి చదువుమాట ఆలోచించాలి. ఇప్పటికే శాస్త్రి నన్ను చివాట్లు పెడుతున్నాడు - ఐదోయేడు వచ్చింది. యింకా అక్షరాభ్యాసం చెయ్యలేదని. మొన్న దక్షిణాయనం ప్రవేశం కాగానే - ద్వాదశీ శుక్రవారం శ్రవణ నక్షత్రం - అక్షరాభ్యాసానికి బాగుంది - పసుపుకొమ్ము పట్టించి బియ్యంలో ఓం నమశ్శివాయ సిద్ధం నమః అని వ్రాయించేసి తరువాత సత్యనారాయణ వ్రతం చేసేస్తే తీరిపోతుందన్నాడు.

"లాంఛనం సంస్కారం తీరిపోవడానికేముంది? నేనెలాగు దానికి గజేంద్రమోక్షం, రుక్మిణి కల్యాణం, బాల రామాయణం పద్యాలు నేర్పిస్తున్నానుగా" అన్నాను.

"ఓహో, అష్టదిక్పాలకుల్లో ఒకరిని చేసేస్తావాయేమిటి పాపాయిని?" అన్నాడు."అష్టదిగ్గజాలని కదూ నువ్వన్నది?" అన్నాను. "అవును - అవును" అన్నాడు నవ్వుతూను.

"అవి మగయేనుగులు : అభ్రమవు, కపిల, పింగళి, అనుపమ, తామ్రపర్ణి, శుభదంగి, అంగర, అంజనావతి వాళ్ళ భార్యలు" అన్నాను. "చదువుకున్న భార్యలవుతే అష్టదిగ్గజాలు చచ్చారన్నమాటే!" అన్నాడు నవ్వుతూను.

"కృష్ణదేవరాయల ఆస్థానంలోని దిగ్గజాల భార్యలెవరూ విదుషీమణులైనట్లు చెప్పబడలేదే!" అన్నాను కన్ను గీటుతూ.

"అదికాదుగాని - పాపాయిని యే లీలావతో, యే ఝాన్సీ లక్ష్మీబాయినో, యే సరోజినీనో చేసెయ్యాలి మనం!" అన్నాడు ఉత్సాహంగా.. కుమ్మరిమొల్ల-పల్నాటి వీరాంగన-పేరూ వూరూ లేని దేశసేవిక యేదైనా సరే!... పాపాయి పెద్దదయ్యేసరికి దేశం



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

కాలం మారవా?

వయ్యస్సొచ్చింది - మంచి అందం వస్తూంది. సుభ ఒక సమస్య కింద తేలింది. మూడేళ్ల సదనానికి పంపించారు. కాని చదువు అబ్బలేదు. పుస్తకం పట్టుకోవడం అంటే గిట్టదు. సంగీతంలోనూ నాట్యంలోనూ ప్రవేశం వుంది. కానీ శ్రద్ధ, ఓపిక లేక వాటికి స్వస్తి చెప్పేసింది. హిందీ-ఇంగ్లీషు తప్పు అయ్యేది తడక అయ్యేది తణుకు బెణుకు లేకుండా మాట్లాడేస్తుంది. యేం చేయడమో తోచడం లేదు. అప్పుడే ముదర పంకాయ మాటలు నేర్చుకుంటూంది. మొన్నంది : "అమ్మా! నేను నా యిష్టం వచ్చిన వాడిని పెళ్ళాడొచ్చుకదూ!"? "ఏం-అలా అడుగు తున్నా"వన్నా. "ఏం లేదు. మనవూళ్ళో నువ్వు, నాన్న నేను బర్మాశాండో సినిమా కెళ్ళాంకదూ! అప్పటినుంచి అతన్ని పెళ్ళాడదామని వుంది. కాని మొన్న ఢిల్లీలో హోటేలువాలాని చూసిన దగ్గరనుంచి అతన్నే పెళ్ళాడదం అని ఉందమ్మా!" అంది. "మరి అతనితో మాట్లాడావా?" అనడిగే. "బర్మాశాండోని బొమ్మల్లో తప్ప మరెప్పుడు చూడలేదు. ఆవేళ ఆరులో స్టూడియో ప్రక్కనించే వెళ్ళేను కాని, లోపలికెళ్ళి అతన్ని చూడ్డానికి భయంవేసింది-తీరా అతనేమంటాడో అని. ఢిల్లీలో హోటేలు వాలా కళ్ళు యెంత అందంగా వుండెను! ఆ కళ్ళు నన్ను పిలుస్తున్నట్టే అనిపించింది! రెండు మూడు మాట్లు అతన్ని పలుకరించాను కాని - అతను నన్ను వినిపించుకున్నాడే కాదు" అంది. సుభ. మనస్సులోయేంఆలోచనలు పుడుతున్నాయో?

నాకీ వయస్సులోనే బాలచంద్రునితో పరిచయం అవుతా. తరువాత మొదటి సంవత్సరం పనిచేస్తున్నప్పుడు - సనాతన ధర్మ కాలేజీలో అధ్యాపకుడు మార్తాండమూర్తి - అతని వుత్తరాలున్నూ ; ఒక్కొక్క దండకం - అచ్చు తెలుగున అదిన్నీ; ఈమాటు వుత్తరంలో మొగలిరేకులు పెట్టి పంపించితే - వచ్చేమాటు మంచిగంధపు పొడి మంచిది పంపించేవాడు : నీళ్ళతో కలిపి మెడకి రాసుకొని - వుత్తరాలను మాత్రం నీళ్ళ పొయ్యిలో పడేసేదాన్ని; తరువాత శాస్త్రి- మన్మథా వస్తలు... పెళ్ళి... కాశ్మీరం... సంసారం... పాపాయి... కాంగ్రెసు... అవ్యక్తం... కాశ్మీరం.

కాలేజీలలో పనిచేస్తున్న రోజులలోనేమి, సంసారం కొత్తలో నేమి ప్రపంచంలో గొప్ప - బీద, పస్తు - విందు, సౌఖ్యం - దరిద్రం - యీ వ్యత్యాసాల గురించి తల్చుకునేదాన్నికాను. నా మనస్సులో సంతోషం, హాయి, తృప్తి, శాంతి వుండడం చేత కాబోలు - మిగతా ప్రపంచం గురించి పట్టించుకునేదాన్నికాను. మానవ సంఘం పుట్టుకతోనే యీ తేడాలు మొదటినుంచి వుంటూ వచ్చాయి. కొసవరకు వుండవలసిందే కాబోలు - అనుకునేదాన్ని. ఉద్యమం రోజుల్లో ఆ బడబానలపు ప్రచారంలో "స్వజాతి స్వరాజ్యం స్వతంత్రం" అని వరవడి వల్లించడం తప్ప, యీ సాంఘిక దురన్యాయాల గురించి ఆలోచించేదాన్ని కాను. సత్యాగ్రహంలో లాఠీ దెబ్బలు తిని ఆస్పత్రిలో పడి బాధపడుతున్న రోజుల్లో అథవా వీటిగురించి శాస్త్రితో యెప్పుడైనా ప్రస్తావిస్తే, "యీ విభేదాలు వైరుధ్యాలు నువ్వు నేను కల్పించినవి కావు. జాతిభేదం, వర్ణభేదంలాగే వర్గభేదం కూడా దైవసృష్టిలో అంతర్గమైవుంది. మనం రమ్మనమంటే వచ్చినవికావు. పొమ్మనమంటే పోనూపోవు. ఇవి శాశ్వతం అని తెలుసుకునే కౌటిల్యుడు, ఆడంస్మిత్తు వీటి మార్పు గురించి ఎత్తుకొనలేదు. అంచేత అక్కరలేని జిజ్ఞాసలు తర్కమీమాంసలు మనకేల? మనకున్న చికాకులు చిత్తక్షోభాలు చాలు!" అని నా నోరు నొక్కేసేవాడు.. చికాకులు చిత్తక్షోభలు? ప్రొద్దున్నేలేచి పళ్ళు తోముకోవడం తరువాయిగా గొంతులో కాఫీ పడకపోతే - వారం రోజులై ఆకలితో మలమల మాడుతున్నట్టే బాధ; పది గంటల భోజనానికి పెరుగుబిళ్ల కాస్త పలచగా వుండేసరికల్లా - "ఛీ; నీళ్లుకారుతూ యేం తిండి? ఇంతకంటే పస్తుంటే నయం" అని శాస్త్రికి ఆగ్రహం; రెండు పూటలూ సుష్టుకృతంగా భోంచేసి రాత్రి తాంబూలంలో యాలగ్గింజ లేకపోయేసరికి "పంటిశుద్ధేనా లేకుండా యెందుకీ పంటపట్టని మెతుకులు!"అని సణుగుడు! తేనాంపేట బంగళా నుంచి ట్రిప్లికేను యింట్లోకి మారితే - "యీ నాలుగ్గదులూ యేం సరిపోతాయి - భగవంతుడా? ఈ యిరకాటం కంటే చెట్టుకింద కాపురం నయం!" అని నేను చిరాకుపడడం! నెలకి రెండువేలు ఆర్జిస్తూ- మరో వెయ్యి ఆర్జించలేకపోతున్నానే అని "ఛీ యీ దరిద్రం కంటే మాధవ కవళం దండుకుంటే మేలు అని శాస్త్రి తన్నుతానే తిట్టుకోవడం:... ఎన్నడేనా ఆకలిబాధ అనుభవించి యెరుగుదునా? మానం కాపాడుకోవడానికేనా చాలని చింకిపాత కట్టుకుని సిగ్గువిడచి నలుగురిలో మెసలవలసిన గతి నాకెప్పుడైనా పట్టిందా? హోరుమని చలిగాలి లోపలికి కొడుతూ - భోరుమని ఎండ లోపలికి వచ్చేస్తూ - వర్షపు నీళ్ళు ధారలుగా కప్పునుంచి కారుతూన్న - గుడిసెలో కాపురం చెయ్యడం అంటే నాకేమిటో తెలుసునా? యీబాధలు తెలియనంతసేపు- న్యాయం, ధర్మం, సత్యం, నీతి అని నేనూ నమ్మేను. నేనూ బోధించేను. రాయపురం రైలు వంతెన చేరీలో నాలుగురోజులై అన్నం మెతుకంటే యేమిటో యెరక్క పడుకున్న ఆ ఆరుగురు పిల్లల తల్లికి-ఆది సత్యాలు ఉపదేశిస్తే ఆమెకేం అర్థం అవుతుంది? కిద్దరుపూరులో రెండు సంవత్సరాలై యెర్రని యేగాన్ని కళ్ళారా చూచిన పుణ్యం కట్టుకోక-పనికోసం రోజల్లా వెతికి, యెక్కే గుమ్మంయెక్కి దిగే గుమ్మందిగి, వీధులల్లా తిరిగి వేసారి సాయంకాలానికి ఉత్తచేతులతో యిల్లుచేరి ఆలుబిడ్డలని చూడడానికి ధైర్యంచాలని ఆ యువకుడికి పరమ ప్రమాణాలు బోధిస్తే యేం ప్రయోజనం?

- ఇంకా వుంది.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై పార్లమెంట్‌లో టీడీపీ, వైసీపీ ఆందోళనలు

బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందంటూ తెలుగుదేశం, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఎంపీలు పార్లమెంట్‌లో ఈనెల ఆరో తేదీ నుంచి చేస్తున్న ఆందోళన ఏడోతేదీన కూడా కొనసాగింది. అంతకుముందురోజు ఐదో తేదీన టీడీపీ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన జరిపారు. అనంతరం కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచన మేరకు కేంద్రమంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి, టీడీపీకి చెందిన ఎంపీలు ఆయనతో సమావేశమయ్యారు. ప్రధానితో మరోసారి సమావేశం కావాలని ఈ సందర్భంగా రాజ్‌నాథ్ వారికి సూచించారు. ఏడో తేదీన ప్రధాని



ప్రసంగం సందర్భంగా టీడీపీ ఎంపీలు ఆందోళన విరమించి తమ సీట్లలో కూర్చున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీలు సభనుంచి వాకౌట్ చేసి, పార్లమెంట్ ఆవరణలో తమ ఆందోళన కొనసాగించారు. ఇదే అంశంపై రాజ్యసభలో మౌన నిరసన ప్రదర్శన చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ కె.వి.పి.రామచంద్రరావును, టీడీపీకి చెందిన ఎంపీలు ముగ్గురిని ఈనెల 7వ తేదీన సభనుంచి ఒకరోజు సస్పెండ్ చేశారు. ఎనిమిదో తేదీ, సభ చివరిరోజైన తొమ్మిదో తేదీన కూడా రెండుపార్టీల ఎంపీల నిరసన ఉభయ సభల్లోనూ కొనసాగింది. వీరి ఆందోళనకు సీపీఐ, టీఆర్ఎస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు బాసటగా నిలిచాయి. అనంతరం బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, రైల్వేమంత్రి పియూష్ గోయల్, మంత్రి సుజనా చౌదరి మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఏపీ డిమాండ్లను నెరవేర్చడానికి కేంద్రం సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం

మాల్దీవుల్లో రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని ఆ దేశ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అబ్దుల్లా యమీన్ ప్రభుత్వం అమలుచేయడంలేదు. పైగా భద్రతా కారణాల దృష్ట్యా పార్లమెంట్ సమావేశాలను కూడా నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. తొమ్మిదిమంది కీలక రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని ఈనెల ఒకటో తేదీనే సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. అధికార పార్టీనుంచి ఫిరాయించిన 12 మంది నేతలకు పార్లమెంట్ సభ్యత్వం కల్పించింది. దీంతో ప్రతిపక్ష కూటమి ఆధిక్యంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయకపోవడంతో ఆ దేశంలో రాజకీయ సంక్షోభం నెలకొంది. అనర్హత వేటు పడ్డ ఎంపీలపై తాను ఇచ్చిన ఆదేశాలను అమలుపరచాల్సిందేనని సుప్రీంకోర్టు ఈనెల మూడోతేదీన మరోసారి స్పష్టం చేసింది. అధ్యక్షుడు యమీన్ సుప్రీంకోర్టు ఉత్తర్వులను ధిక్కరించడంతో పాటు దేశంలో అత్యవసర పరిస్థితి విధించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్లా సయీద్, మరో జడ్జి ఆలీ హమీద్‌ను అరెస్టు చేయించారు. మాజీ అధ్యక్షుడు అబ్దుల్ గయూమ్‌ను గృహ నిర్బంధంలో ఉంచారు. తమదేశంలో రాజకీయ సంక్షోభానికి తెరదించేందుకు భారత్ సైన్యాన్ని పంపించి సాయం చేయాలని మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ కోరారు. మాల్దీవుల అంతర్గత సంక్షోభం పరిష్కారానికి దేశాధ్యక్షుడు యమీన్ చైనా, పాకిస్థాన్, సౌదీ అరేబియాలకు దూతలను పంపారు.

బంగ్లా మాజీ ప్రధాని ఖలీదాకు ఐదేళ్ళు జైలు



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా (72)కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఢాకాలోని ప్రత్యేక న్యాయస్థానం ఈనెల 8న తీర్పు ఇచ్చింది. దీంతో డిసెంబరులో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి ఆమె అనర్హురాలవుతారని భావిస్తున్నారు. దివంగతుడైన తన భర్త జియావుర్‌రెహ్మాన్ పేరిట ఉన్న ట్రస్టుకు విదేశాల నుంచి వచ్చిన సుమారు 2.5 లక్షల డాలర్ల విదేశీ విరాళాలను ఆమె కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో జియా తనయుడు, ప్రస్తుతం పరారీలో ఉన్న తారిక్ రెహమాన్ సహా మరో ఐదుగురికి ఇదే కేసులో పదేళ్లు చొప్పున జైలుశిక్షలు పడ్డాయి.

పాక్ కాల్పుల్లో ముగ్గురు భారత జవాన్ల మృతి

జమ్మూకాశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి ఉన్న సైనిక శిబిరాలు, జనావాసాలపై ఈనెల నాలుగో తేదీన పాకిస్థాన్ సైన్యం కాల్పులు జరిపింది. ఈ ఘటనలో ముగ్గురు ఆర్మీ జవాన్లు అమరులయ్యారు. ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. రాజౌరి జిల్లాలోని భింభెర్ గలి సెక్టార్‌లో ఈ ఘటన జరిగినట్లు సైనికాధికారులు తెలిపారు.

రూ.10 లక్షల కోట్ల సంపద ఆవిరి

జాతీయ వార్తలు వీక్లీ రౌండప్

అమెరికన్ స్టాక్ మార్కెట్లలో మొదలైన సంక్షోభానికి బడ్జెట్ ప్రకంపనలు తోడవడంతో ఈనెల 6వ తేదీన మనదేశ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. వరుసగా ఆరో ట్రేడింగ్ సెషన్ లోనూ స్టాక్ సూచీలు పతనమయ్యాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ ఈనెల 6వ తేదీ ఒక్కరోజే 2.75 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. మొత్తంమీద గడచిన ఆరు సెషన్లలో ఏకంగా రూ.10 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద హరించు కుపోయింది. వరుసగా ఏడో రోజు ఈనెల 7వ తేదీన కూడా నష్టాలు కొనసాగాయి. ఈనెల 8వ తేదీన వరుస నష్టాలకు బ్రేక్ పడింది. 9వ తేదీన మళ్లీ స్టాక్ మార్కెట్ నష్టాల బాట పట్టింది.

ఫాల్కన్ హెవీ రాకెట్ ప్రయోగం విజయవంతం

అంతర్జాతీయ వార్తలు

ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన రాకెట్ 'ఫాల్కన్ హెవీ' తొలి ప్రయోగం విజయవంతమైంది. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం కేప్ కెనావెరాల్‌లోని కెన్నెడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఈనెల 6వ తేదీన నింగిలోకి దూసుకెళ్లింది.

గ్రీన్‌కార్డుల్లో ఆలస్యానికి తెర !

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదిస్తోన్న వలస విధానం అమలులోకి వస్తే.. నిపుణులైన ఉద్యోగులకు గ్రీన్‌కార్డుల జారీలో జాప్యానికి తెరపడనుందని వైట్‌హౌస్ పేర్కొంది. ఒక్కో దేశానికి కోటా ప్రకారం గ్రీన్‌కార్డుల కేటాయింపుల్ని రద్దు చేయాలని భారతీయ హెచ్-1బీ వీసాదారులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈ ప్రకటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

శ్రీనగర్‌లో ఆస్పత్రిపై ఉగ్రదాడి

కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాదులు ఈనెల 6వ తేదీన శ్రీ మహారాజా హరిసింగ్ ఆసుపత్రిపై దాడిచేసి కాల్పులు జరిపారు. చికిత్సకోసం అక్కడికి వచ్చిన కరుడుగట్టిన పాక్ ఉగ్రవాది మహ్మద్ నవీన్ ఝూట్‌ను విడిపించుకుపోయారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు పోలీసులు మరణించారు.

జోర్డాన్‌లో ప్రధాని మోడీ పర్యటన



పాలస్తీనా సహా మూడు పశ్చిమాసియా దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోడీ ఈనెల 9వ తేదీన జోర్డాన్ రాజధాని అమ్మాన్ చేరుకున్నారు. అక్కడి రాజు అబ్దుల్లా-2తో సమావేశమయ్యారు. భారత ప్రధాని ఒకరు 30 ఏళ్లలో జోర్డాన్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి.

అగ్ని-1, పృథ్వీ-2 పరీక్షలు విజయవంతం



అణ్వస్త్ర సామర్థ్యమున్న స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-1ను భారత్ ఈనెల 6వ తేదీన విజయవంతంగా పరీక్షించింది. 700 కిలోమీటర్ల దూరంలో లక్ష్యాలను ఛేదించగల ఈ క్షిపణిని ఒడిశా తీరానికి చేరువలోని అబ్దుల్ కలాం దీవి నుంచి ప్రయోగించారు. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధిచేసిన పృథ్వీ-2 క్షిపణిని భారత్ ఈనెల 7వ తేదీన విజయవంతంగా పరీక్షించింది. ఒడిశాలోని చాందీపూర్ సమీకృత పరీక్షా వేదిక (ఐటీఆర్)పై నుంచి దీనిని ప్రయోగించినట్లు రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. 350 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఈ క్షిపణికి ఉంది.

గూగుల్‌కు సీసీఐ రూ.136 కోట్ల జరిమానా

ప్రముఖ ఇంటర్నెట్ సంస్థ గూగుల్ ఆన్‌లైన్ శోధనకు సంబంధించి అన్యాయపూరితంగా వ్యవహరించినందుకు ఆ సంస్థకు రూ.136 కోట్ల జరిమానా విధిస్తూ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఈనెల 8న ఉత్తర్వులు జారీచేసింది. 2012లో దాఖలైన ఫిర్యాదులకు సంబంధించి సీసీఐ ఈ ఆదేశాలిచ్చింది. ఆన్‌లైన్ శోధనలో తనకు ఉన్న అగ్రస్థానాన్ని గూగుల్ దుర్వినియోగం చేసిందని, సంస్థ అవలంబించిన విధానాలతో కొందరికి ప్రయోజనాలు దక్కగా, పోటీ సంస్థలు, మరికొన్ని కంపెనీలకు నష్టం వాటిల్లిందనే ఫిర్యాదులు దాఖలయ్యాయి.

అండర్-19 ప్రపంచకప్ భారత్ జట్టుకే



న్యూజీలాండ్‌లోని మౌంట్ మంగానుయ్‌లో ఈనెల మూడవ తేదీన జరిగిన అండర్-19 పపంచకప్ క్రికెట్ పోటీ ఫైనల్‌లో ఆస్ట్రేలియా జట్టుపై భారత జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు 47.2 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌట్ అయింది. భారత జట్టు 38.5 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 220 పరుగులు సాధించింది. ఈ విజయంతో భారత్ అండర్-19 జట్టు నాలుగు పర్యాయాలు ప్రపంచ కప్‌ను గెలుచుకుని రికార్డు సృష్టించింది.

శీతాకాల ఒలింపిక్స్ ప్రారంభం



దక్షిణ కొరియాలోని ప్యాంగ్‌చాంగ్ నగరంలో ఈనెల 9న శీతాకాల ఒలింపిక్స్ అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బాణసంచా వెలుగుల్లో స్టేడియం మెరిసిపోయింది. బద్ధశత్రువులైన ఉత్తర, దక్షిణ కొరియాలు కలిసి ఒకే పతాకం కింద మార్చ్ పాస్ట్ చేశాయి. భారత క్రీడాకారుడు శివకార్తికేయన్ భారత పతాకాన్ని చేతబూని మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నాడు.

రెండు, మూడు వన్డేల్లోనూ భారత్ విజయం



క్రీడా వార్తలు



ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టుతో సెంచూరియన్‌లో ఈనెల 4వ తేదీన జరిగిన రెండో వన్డే క్రికెట్ మ్యాచ్‌లో భారత జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో విజయంతో భారత జట్టు వన్డేల్లో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. కేప్‌టౌన్‌లో ఈనెల 7వ తేదీన జరిగిన మూడో వన్డేలోనూ భారత్ జట్టు 124 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో సెంచరీ చేయడం ద్వారా విరాట్‌కోహ్లి టెస్టుల్లో (12), వన్డేల్లో (14) అత్యధిక సెంచరీలు చేసిన కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు. వన్డేల్లో 100 సిక్సర్లు కొట్టిన ఎనిమిదో బ్యాట్స్‌మన్‌గా కూడా కోహ్లి నిలిచాడు. ఈ విషయంలో ధోని (216) తొలిస్థానంలో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లోనే 100 సింగిల్స్ ద్వారానే 100 పరుగులు చేసిన తొలి బ్యాట్స్‌మన్‌గా కూడా కోహ్లి మరో రికార్డు సృష్టించాడు.

ఐసీసీ డైరెక్టర్‌గా ఇంద్రానూయి



పెప్సికో సంస్థ చైర్మన్, సీఈవో ఇంద్రానూయి ఐసీసీ బోర్డులో తొలి మహిళా డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఐసీసీ బోర్డు ఈనెల 9న ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన మహిళల్లో ఒకరిగా ఇంద్రానూయి పేరొందిన విషయం తెలిసిందే.

మాజీ మంత్రి ముద్దుకృష్ణమనాయుడు కన్నుమూత



రాష్ట్ర వార్తలు

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ, మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు(71) ఈనెల 6వ తేదీ అర్ధరాత్రి మరణించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. అధ్యాపక వృత్తిలో ఉన్న ఆయన 1983లో తెలుగుదేశం ఆవిర్భవించినపుడు ఆ పార్టీలో చేరారు. మూడు పర్యాయాలు మంత్రిగా పనిచేశారు. ఎనిమిదో తేదీన ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్ర బంద్ విజయవంతం

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యాన ఈనెల 8వ తేదీన నిర్వహించిన బంద్ సంపూర్ణంగా జరిగింది. తెల్లవారుజాము నుండే సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన కార్యకర్తలు ఆర్టీసీ డిపోల వద్దకు చేరుకుని ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ బంద్‌కు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్, జనసేన పార్టీలతోపాటు ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, జర్నలిస్టు సంఘాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలన్నీ సంఘీభావం ప్రకటించాయి. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. బ్యాంకులు పనిచేయలేదు. పెట్రోలు బంకులు తెరవలేదు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు ముందుగానే సెలవు ప్రకటించారు. ఆరోజు జరగాల్సిన అన్ని పరీక్షలు వాయిదా పడ్డాయి. మరోపక్క తెలుగుదేశం పార్టీ ఇదే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టింది.

స్థిరాస్తి ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్‌కు 'రెరా' వెబ్‌సైట్ ప్రారంభం

స్థిరాస్తి వ్యాపారసంస్థలు.. నిర్మాణంలో ఉన్న, కొత్తగా చేపట్టే ఇంటి ప్రాజెక్టులు, లేఅవుట్ల వివరాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. ఇందుకోసం ప్రభుత్వం www.rera.gov.in వెబ్‌సైట్‌ను [illegible] ప్రారంభించింది. స్థిరాస్తి వ్యాపార నియంత్రణ చట్టం (రెరా) అమలులో భాగంగా ఈ చర్యలు చేపట్టింది.

రెండు మ్యాచ్‌ల్లో భారత మహిళల జట్టు ఘన విజయం

ఐసీసీ మహిళల ఛాంపియన్‌షిప్‌లో భాగంగా కింబర్లీలో ఈనెల 5వ తేదీన జరిగిన తొలి వన్డేలో భారత జట్టు దక్షిణాఫ్రికా జట్టుపై 88 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఏడో తేదీన కింబర్లీలో జరిగిన రెండో వన్డేలో కూడా భారత జట్టు 178 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యం సంపాదించి, సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో స్మృతి మంధాన సెంచరీ చేయగా, బౌలర్ జులన్ గోస్వామి మహిళల వన్డే క్రికెట్ చరిత్రలో 200 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డు సృష్టించింది.

మూత్రపిండాల కణజాలం వృద్ధి



శాస్త్రజ్ఞులు తొలిసారి మనిషి మూత్రపిండాల కణజాలాన్ని రూపకల్పనచేశారు. కిడ్నీ వ్యాధుల చికిత్సలో ఇదొక మైలురాయిగా చెప్పవచ్చు. మూత్రాన్ని ఉత్పత్తిచేయగల ఈ కణజాలాన్ని మొదటిసారి ఎలుకల్లో ప్రవేశపెట్టిన ఘనత మాంచెస్టర్ యూనివర్సిటీ అధ్యయనవేత్తలకు దక్కుతుంది. స్టెమ్ సెల్స్‌ని వినియోగించి మిని కిడ్నీని రూపొందించారు. ఈ కిడ్నీలు ఫిల్టరేషన్, వేస్ట్ మెటీరియల్‌ను విసర్జించే ప్రక్రియపై పరిశోధన చేస్తున్నారు. మనిషి ఎంబ్రియానిక్ స్టెమ్‌సెల్‌ను వినియోగించి ప్రయోగశాలలో దాని వృద్ధి చేశారు. మూడునెలల అనంతరం జరిపిన పరీక్షలో కిడ్నీ పనిచేసే విధానంలో ప్రధాన పాత్ర అయిన నెఫ్రాన్స్ ఏర్పడినట్లు గ్రహించారు. చిన్న చిన్న రక్తనాళాలు అయిన కేపిల్లరీస్‌తోపాటు రక్తాన్ని పడపోయడం, యూరిన్ తయారు కావడంపై మరింత పరిశోధన కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

సోడియంతో మెదడు పనితీరు



రక్తంలోని సోడియం శాతాన్ని బట్టి వృద్ధులలో మెదడుపనితీరును గుర్తించవచ్చునని తెలుస్తోంది. రక్తంలో సోడియం శాతం తక్కువ ఉంటే (హైపోనట్రిమియా) మెదడు కాగ్నిటివ్ పనితీరు తగ్గినట్లు తెలుస్తోంది. రక్తంలో సోడియం శాతం లీటరుకు 135 మిల్లిమోల్స్ కన్నా తక్కువ ఉంటే హైపోనెట్రిమీయా సూచనలు ఉన్నట్లు అమెరికన్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ వెల్లడించింది. ఏకాగ్రత లోపించడం, కార్డియోవాస్కులార్ జబ్బులు, ముందస్తు మరణాలు సోడియంలోపించడంతో సంభవిస్తాయని యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో పరిశోధనలో వెల్లడైంది. 65ఏళ్లు దాటిన 5435 మంది వ్యక్తులపై 4.6 సంవత్సరాలపాటు చేపట్టిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. సోడియం లెవెల్స్ 141-142 ఎమ్ఎమ్ఓఎల్/లీటర్ ఉన్న పురుషులు 126-140 ఎమ్ఎమ్ఓఎల్/ఎల్ కన్నా 30శాతం కాగ్నిటివ్ పరీక్షలో మెరుగ్గాఉన్నట్లు తేలింది.

నడిచే చేపలే పరిణామానికి నాంది



నడిచే చేపల ద్వారా మొదటిసారి భూమి మీద జంతువులు ఎలా అభివృద్ధి చెందాయే తెలుస్తోంది. పరిణామ క్రమంలో భాగంగా 380 మిలియన్ సంవత్సరాల క్రితం నీటి నుండి నడిచే చేపలు భూమి మీదకు రావడం ద్వారా పరిణామ క్రమానికి నాంది పలికినట్లు తెలుస్తోంది. నీటిలోని చేపల ద్వారా ఈ ప్రక్రియకునాంది పలికినట్లు శాస్త్రజ్ఞుల పరిశోధనలో వెల్లడైంది. న్యూయార్క్ యూనివర్సిటీ చేపట్టిన అధ్యయనంలో టెట్రాపోడ్స్ (రెండుజతల రెక్కలుకలిగిన వర్టిబ్రేట్స్) భూమి మీదకు వచ్చి వృద్ధి చెందినట్లు తెలుస్తోంది.

నీతులు సరే... టాయిలెట్లేవీ..?



విశాలాంధ్ర- జనరల్ డెస్క్ : ఈ మధ్య ఎక్కడచూసినా.... 'ఇక్కడ మూత్ర విసర్జనచేయడం నేరం రూ.500ల జరిమానా విధించబడును' అని రహదారులు వెంబడి గోడలపై, బస్ షెల్టర్ల వద్ద, జన సమ్మర్థం ఉండే ప్రాంతాలలో కన్పించే ఈ ప్రకటనలలో శుభ్రం పాటిస్తే, ఆరోగ్యరక్షణ అన్న సూక్తులు సాక్షాత్కరిస్తూ ఉంటాయి. పరిసరాలు శుభ్రంగా ఉండాలి, తద్వారా ఆరోగ్యంగా ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమే కాదు...ప్రజల ఆకాంక్ష కూడా...కాని ఇందుకు అవసరమైన వసతులను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నది నగ్న సత్యం. బహిరంగ మూత్ర విసర్జన చేయడం మంచిదికాదు... అందరికీ తెలుసు..మనిషిలో ఉండే సిగ్గు అలా చేయనివ్వదు కూడా..అయితే ఎటువంటి వసతులు లేనప్పుడు అటుఇటు గమనించుకుంటూ బిడియంగానే బహిరంగంగానే ఆపని చేయవలసిన అగత్యం ఏర్పడుతుంది.

ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పరిధిలోని ప్రధాన నగరాలైన విజయవాడ,గుంటూరులనే తీసుకుందాం.. విజయవాడలో ఏలూరురోడ్, బందరు రోడ్లు అతి ముఖ్యమైనవి, జనసమ్మర్థం బాగా ఉండే ప్రాంతాలు. వాణిజ్యపరంగా అభివృద్ధిచెందిన ఈ రెండు రోడ్లలో మూత్రవిసర్జన శాలలు మచ్చుకైనా కన్పించవు. షాపింగ్‌కీ లేదా ఏదైనా ముఖ్యమైన పనులమీద బయటకు వచ్చినవాళు అరగంటలోనో, గంటలోనే ఇళ్లకు వెళ్లిపోరు కదా... మరి ఇటువంటి పరిస్థితులలో మూత్ర విసర్జన ఎక్కడ చేయాలి..? ఆరోగ్యంగా ఉండే వారయితే ఆపుకోవచ్చు. కానీ మధుమేహం వంటి వ్యాధులు ఉన్నవాళ్ల పరిస్థితి ఏమిటి..? విజయవాడలో ఈ రెండు రోడ్లు కాకుండా ఉతర ప్రదేశాలలో అక్కడక్కడ మరుగుదొడ్లు కనిపిస్తూ ఉంటాయి. అత్యవసరమైన వాళ్లు గూగుల్ నేవిగేటర్ మ్యాప్‌లోకి వెళ్లి మరుగుదొడ్లు ఎక్కడ ఉన్నాయో..వెతుక్కొనేలా..దానికి ఒక యాప్ పెడితే అటువంటి మాప్‌ను వినియోగించడానికి ప్రజలు సిద్ధంగానే ఉన్నారు. గుంటూరు నగరంలో అయితే అటు బస్టాండ్ నుండి ఇటు గుజ్జనగుళ్ల వరకు ఒకటి, రెండు చోట్ల (బస్‌స్టాండ్ బయట, మార్కెట్ వద్ద) మాత్రమే మరుగుదొడ్లు కనిపిస్తాయి. ప్రజలు పడుతున్న ఈ ఇబ్బందిని తొలగించడానికి ఏర్పాట్లు చేయకుండా ప్రకటనలు గుప్పిస్తే ప్రయోజనం ఏమిటో పాలకులు ఆలోచించాలి. ఆ మధ్య విజయవాడలో ఇక్కడ మూత్ర విసర్జన చేస్తే కుక్కలు, గాడిదలంటూ మున్సిపల్ కార్పొరేషన్ వాళ్లు పెద్దపెద్ద ఫ్లెక్సీలు పెట్టాయి. ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో వాటిని తొలగించారు.

వారధి నుంచి బస్‌స్టాండ్ వరకు ఎక్కడా మరుగుదొడ్లు కనపడవు. బస్టాండ్ లోపలకు వెళ్లేగేట్‌లో పక్కన దుర్గ ఘాట్‌లో ఎదురుగా మాత్రం ఉన్నాయి. వాటికి కూడా తాళంవేసి ఉంటే ఒక వార్తపత్రికలో కథనం రావడంతో మరలా తెరిచారు. ఏర్పాట్లు చేయని వాళ్ళకు ఇటువంటి అవమానకర ప్రకటనలతో ఫ్లెక్సీలు పెట్టడం ఎంతవరకు సబబో ఆలోచించాలి.


కనీసం ఏర్పాట్లు చేయకపోయినా ప్రజల కోపం గమనించి ఆ బోర్డులను తొలగించినందుకు సంతోషపడాలి మరీ..విజయవాడ బస్టాండ్‌లో మాత్రం ఆర్టీసీ అధికారులు చక్కటి ఏర్పాట్లుచేశారు. కాంప్లెక్స్‌లో, సిటీబస్‌స్టేసన్ ఫ్లాట్‌ఫారాలపై టాయ్‌లెట్లు ఏర్పాటుచేసి రెండురూపాయలు, ఐదు రూపాయలు వసూలు చేస్తున్నారు. శుభ్రతను మనసా, వాచా కోరుకుంటున్న ప్రజలు రెండు లేదా ఐదు రూపాయలు చెల్లించడానికి ఏ మాత్రం వెనకాడడంలేదు. ఈ టాయిలెట్ల వద్ద ఉండే సిబ్బంది చిల్లర లేదంటూ ఇవ్వకుండా నొక్కేస్తున్నా బాధపడడంలేదు. విజయవాడ తర్వాత బాగా రద్దీగా ఉండే గుంటూరు బస్‌స్టేషన్‌లో కాంప్లెక్స్‌లోపల ఉండే మరుగుదొడ్లు విజయవాడలో మాదిరిగా కాకపోయినా ఉన్నంతలో శుభ్రంగానే ఉంటాయి. విజయవాడవైపు నుండి వచ్చే బస్సులు ఆగేచోట ఏర్పాటుచేసిన మూత్ర విసర్జన శాలను బహిరంగ మరుగుదొడ్లు అంటే బాగుంటుంది. ప్రయాణికులు ఆవైపు చూడడానికి కూడా సాహసం చేయలేనంతగా ఛండాలంగా ఉంటాయి. గుంటూరు బస్‌స్టాండ్ వద్ద బయట విజయవాడ వైపునుంచి వచ్చే బస్‌లు ఆగేచోట కూడా మరుగుదొడ్లు ఉన్నాయి. దీనిలో దబ్బులిచ్చి వాడుకొనేవి కొన్ని, మూత్ర విసర్జనకు డబ్బులు ఇవ్వకుండా వాడుకునేవి మరికొన్ని ఉన్నాయి. కానీ వీటి గురించి ఎంత తక్కువ వర్ణిస్తే అంత మంచిది.

ఇంత భయంకరంగా ఉన్నాయని అక్కడున్న సిబ్బందిని అడిగితే ఇష్టం ఉంటే..పోయండి లేదంటే పోండని చాలా నిర్లక్ష్యంగా సమాధానం వస్తుంది. విజయవాడ నగరంలో చాలా మరుగుదొడ్ల పరిస్థితి ఇదే మాదిరిగానే ఉంటుంది. పరిస్థితులు ఇంత దరిద్రంగా ఉన్నప్పుడు వీటి నిర్వహణ బాధ్యతను చూస్తే కార్పొరేషన్ సిబ్బంది ఏం చేస్తున్నారో అర్థంగాని ప్రశ్న. ఆరోగ్యరక్షణలో నీతి ఆయోగ్ రూపొందించిన సూచికలో ఏపీకి 8, తెలంగాణకు 11 వస్థానం దక్కడం చాలా సంతోషం. మరీ బహిరంగ, మల,మూత్ర విసర్జనకు మంచి ఏర్పాట్లు చేస్తే ఆ జాబితాలో మొదటి స్థానం దక్కే అవకాశం ఉంటుంది. ఈమధ్య ఇటువంటి సామాజిక అంశాల ఆధారంగా వస్తున్న సినిమాలు ఘన విజయం సాధిస్తున్నాయి. ఇళ్లలో మరుగుదొడ్ల ఆవశ్యకతపై తీసిన 'టాయిలెట్' మహిళలు రుతుక్రమం సమయంలో వాడే నాప్‌కిన్స్‌పై తాజాగా విడుదలైన 'పాడ్‌మ్యాన్' సినిమా ఎంతగా విజయం సాధించాయో పాలకులకు తెలిసేఉంటుంది. బహిరంగ ప్రదేశాలలో మరుగుదొడ్లపై కూడా సినిమా వస్తే తప్ప ప్రభుత్వంలో చలనం రాదేమో చూడాలి మరి....

భూమికే భారమవుతున్నాం

ప్రపంచ వ్యాప్తంగా ఏడాదిలో పెరిగిన జనాభా	
01.0217 నుండి 01.02.18 వరకు	
జన్మించినవారు	1,53,54,395
మరణించినవారు	63,59,736
పెరిగిన జనాభా	89,94,659

విశాలాంధ్ర జనరల్ డెస్క్ : పెరిగిపోతున్న ప్రపంచ జనాభా వలన భవిష్యత్తులో భూగ్రహానికే ముప్పురావచ్చునని శాస్త్రజ్ఞుల అంచనా... వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరిగిపోవడంతో సహజమైన ప్రకృతి సంపద దారుణంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. గత కొన్నేళ్లుగా ప్రపంచ జనాభా విపరీతంగా పెరగడంతో తాగేందుకు కూడా నీరు దొరకని పరిస్థితి ఏర్పడింది. విభిన్న రీతులలో పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. నార్త్ అమెరికాలో పక్షి సంపద దాదాపు కనుమరు గైపోతోందని శాస్త్రజ్ఞులు గగ్గోలు పెడుతున్నారు. జర్మనీలో క్రిమి కీటకాలు గత 25 సంవత్సరాల్లో దాదాపు 76శాతం తగ్గిపోయాయి. ప్రకృతి విలయతాండవాలు, వరదలు, ఉప్పెనలు, అమూల్యమైన అటవీ సంపద కాలిపోవడం, సముద్రాల ఆమ్లీకరణ వాతావరణాన్ని కాలుష్యానికి గురిచేయడంతో సముద్రజలాల్లోని ప్రాణులపైకూడా ప్రభావం చూపుతోందని జియాలజిస్టులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం మనిషి జీవన ప్రమాణాలపై పెను ప్రభావం చూపడంతో వింతైన రోగాల బారినపడడం చూస్తూనే ఉన్నాం.



50ఏళ్ల క్రిందట కేవలం మన జనాభా 340 కోట్ల జనాభా మాత్రమే ఉండేది. ప్రస్తుతం ఆ భారస్త్రం 760 కోట్లకు చేరింది. గత కొన్ని దశాబ్దాలుగా జననాల రేటు ఎక్కువకావడంతో జనాభా వృద్ధిరేటు అధికంగా నమోదవుతూ వచ్చింది. ప్రతి ఏడాది 80 మిలియన్ల జనాభా పెరుగుతూ వస్తోంది. 2056 నాటికి ప్రపంచ జనాభా 1000కోట్లుకు చేరుకుంటుందని ఐక్యరాజ్యసమితి నివేదికలు తెలుపుతున్నాయి.

జనాభా పెరుగుదలలో ఎన్నో నష్టాలు:

1.ఆకలితో పాటు కరవుకాటకాలు, 2. ప్రకృతి సంపదను మన అవసరాలకు దోచుకోవడంతో భూమి సారాన్ని కోల్పోవడం, జంతుజాలాలు హరించిపోవడంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతినడం, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ ఇబ్బందులు తలెత్తడం వంటి పరిస్థితులకు కారణమవుతాయి.

ప్రాంతాల వారీగా పెరుగుతున్న జనాభా		
ప్రాంతం	జనాభావృద్ధి	శాతం
ఆసియా	450,44,28,373	0.94
ఆఫ్రికా	126,62,68,025	2.55
ఐరోపా	74,20,73,853	0.08
లాటిన్ అమెరికా, కరేబియన్	64,55,93,253	1.02
ఉత్తర అమెరికా	36,12,07,811	0.73
ఓషియానా	4,06,90,786	1.43

300 సంవత్సరాల్లో మానవులకు ఆహారం అందించేందుకు అవసరమైన భూమి విస్తీర్ణం 10శాతంకంటే కూడా తక్కువే ఉంటుందని అంచనా... పరిశ్రమలునుండి, వాహనాల నుండి, వ్యవసాయం ద్వారా వెలువడే ఉద్గారాలు, కార్బన్ డయాక్సైడ్, మిథేన్‌లను భూమిమీద ఉన్న వాతావరణం, సముద్రాలు, అడవులు అన్నీ కలిసినా గానీ వాటిని తమలో ఇముడ్చుకోలేవు. 1990-2003 మధ్య కాలంలో అమెరికా తలసరి గ్రీన్‌హౌస్ ఉద్గారాలు 3.2శాతం పెరిగినట్లు తెలుస్తోంది. కానీ మొత్తం అమెరికా ఉద్గారాలు 20.2శాతంపెరిగాయి. ఇదెలా సాధ్యం..? మన జనాభా 16.1శాతం పెరుగుతూ వస్తోంది. ప్రపంచ జనాభాను తగ్గించకపోతే మాత్రం పెరుగుతున్న గ్రీన్ హౌస్ ఉద్గారాలను మాత్రం నియంత్రించలేమని పరిశోధకులు పలుమార్లు హెచ్చరించే పరిస్థితి వచ్చింది. ప్రసిద్ధ ఆర్థికవేత్త ఎడ్విన్ ఎస్.రూబెన్‌స్టిన్ "అంతర్జాతీయ వాతావరణ మార్పులపై అమెరికా జనాభా ప్రభావం" అనే పుస్తకం ముగింపులో దీర్ఘకాలంలో అమెరికాలో పెరుగుతున్న జనాభా ఆదేశంలో పెరుగుతున్న కర్బన ఉద్గారాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రముఖ పత్రిక లాన్సెట్‌లో రాసిన నిపుణుల అభిప్రాయం ప్రకారం కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించనిదే భవిష్యత్తులో పుడమికే ముప్పురావచ్చునని తెలిపింది.

జనాభా పెరుగుతున్న కొద్దీ సాంకేతికంగా అభివృద్ధి చెందని దేశాల్లో బొగ్గుకోసం తవ్వకాలు జరుగుతూ ఉంటాయి. ప్రాథమికంగా పర్యావరణానికి ఇదే ప్రధాన ముప్పుగా ఉన్నట్లు గూగుల్ స్కాలర్‌ర్లు రూపొందించిన పరిశోధనాపత్రాలలో పేర్కొన్నారు. బొగ్గును ప్రకృతినుండి వెలికితీసి వినియోగించడంతో వాతావరణాన్ని అంతగా కాలుష్యం చేసినట్లువుతుందని తెలుస్తోంది. 2015లో 28శాతంగా ఉన్న బొగ్గు వినియోగం 2100 నాటికి ప్రపంచంలో వివిధరీతుల్లో 94శాతం వరకు పెరుగుతుంది.

విశాలాంధ్ర బిజినెస్

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
టాటా స్టీల్	683.65	1.83
రెడ్డీ ల్యాబ్స్	2,194.80	0.73

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఎస్ బ్యాంక్	325.55	-2.84
ఐసీఐసీఐ బ్యాంక్	326.75	-2.33
హెచ్‌డీఎఫ్‌సీ	1,773.20	-2.13
ఇన్ఫోసిస్	1,124.90	-2.01
యాక్సిస్ బ్యాంక్	579.00	-1.93

విదేశీమారకం విలువ (ఫారెక్స్)		
కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.40	64.40
యూరో	78.79	78.71
పౌండ్	88.81	89.01
ఆస్ట్రేలియా డాలర్	50.16	50.30
సింగపూర్ డాలర్	48.39	48.44

బులియన్		
బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,790	30,791
చెన్నై	28,790	31,647
బెంగళూరు	28,200	30,160
ముంబై	29,590	30,160
విజయవాడ	28,750	31,647
విశాఖపట్నం	29,050	31,691
ప్రొద్దుటూరు	28,610	31,000

ముడి చమురు 62.79

కెఫె కాఫీడే 'డెజర్ట్ డిలైట్స్'



విశాలాంధ్రబ్యూరో - హైదరాబాద్ : కెఫె కాఫీ డే తన రుచికరమైన మెనూ 'డెజర్ట్ డిలైట్స్'ను ఆవిష్కరించింది. క్లాసిక్ పైనాపిల్, ఎవర్‌గ్రీన్ బ్లాక్ ఫారెస్ట్, హెవెన్లీ కేక్ వంటి నోరూరించే ఫ్లేవర్లను అందుబాటులో ఉంచింది. అన్ని కాలాల్లోనూ అభిమాన డెజర్ట్ స్టేషన్‌గా మారేందుకు సన్నద్ధమవుతోంది. కెఫె కాఫీ డే అనేది మెట్రోల్లో అందరికీ అందుబాటులో ఉండే కెఫె. నూతన డెజర్ట్ డిలైట్స్ విభాగంలో ప్రతి ఒక్కరి అభిరుచిని తీర్చేందుకు తాము ప్రయత్నిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సిగ్నేచర్ నుంచి క్లాసిక్ దాకా అన్ని రకాల మూడ్స్‌లో, పరిమాణాల్లో ఫుల్ రౌండ్ కేక్ ఆప్షన్స్.. సింగిల్ సర్వ్‌డెజర్ట్ ఆప్షన్స్.. ట్రెండింగ్ ఫ్లేవర్స్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రూ.55 ప్రారంభ ధరతో డెజర్ట్ డిలైట్స్ మెనూను నిర్ణయించినట్లు వెల్లడించారు. ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరుల్లోని తమ స్టోర్స్‌లో ఈ కొత్త రుచులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

వాట్సాప్ పేమెంట్స్ వచ్చేసింది



ముంబై : స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్న నేటి యువతకు వాట్సాప్ లేనిదే రోజు గడవని పరిస్థితి. ఎప్పటికప్పుడు సరికొత్త ఫీచర్లతో ఆకట్టుకుంటున్న వాట్సాప్ తాజాగా మరో కొత్త ఫీచర్‌ను యూజర్లకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటి వరకూ ఏదైనా నగదు చెల్లింపులు చేయా లంటే ఆయా బ్యాంకుల యాప్‌లు లేదా, పేటీఎం వంటి పేమెంట్స్ యాప్‌లను వినియోగించాల్సి వచ్చేది. ఇక నుంచి మీకు వాట్సాప్ ఉంటే చాలు మీరు చెల్లింపులు చేసేయొచ్చు. ఐవోఎస్, ఆండ్రాయిడ్ మొబైల్‌లో వాట్సాప్ బీటా వెర్షన్ వినియోగిస్తున్న వారు ఈ ఫీచర్‌ను వినియోగించు కోవచ్చు. భారత ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా వాట్సాప్‌లో నగదు లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. ఐవోఎస్‌లో 2.18.21 వాట్సావ్ వెర్షన్, ఆండ్రాయిడ్ మొబైల్ యూజర్లు 2.18.41 వెర్షన్‌లో ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. డిజిటల్ చెల్లింపులకు ఇది మరింత ఊతం ఇస్తుందని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాట్సాప్‌లోని చాట్ విండో ఓపెన్ చేస్తే గ్యాలరీ, వీడియో, డాక్యుమెంట్స్ జాబితాతో పాటు ఇప్పుడు పేమెంట్స్ ఆప్షన్ కూడా కనిపిస్తుంది. దాన్ని సెలక్ట్ చేసుకోవాలి. అక్కడ కనిపించే బ్యాంకుల జాబితాలో యూపీఐ కనెక్షన్ ఉన్న మీ బ్యాంకు ఖాతాను ఎంపిక చేసుకోవాలి. ఒకవేళ మీరు యూపీఐ పేమెంట్స్‌ను వినియోగించకపోతే ధ్రువీకరణ కోసం పిన్ అడుగుతుంది. యూపీఐ యాప్ లేదా బ్యాంకు వెబ్‌సైట్, యాప్ ద్వారా యూపీఐ ఖాతాను యాక్టివేట్ చేసుకోవాలి. ఇద్దరికీ వాట్సాప్ బీటా వెర్షన్ ఉండి, పేమెంట్స్ ఆప్షన్ లాగిన్ అయిన వారికి మాత్రమే నగదు లావాదేవీలు చేసుకునే వెసులుబాటు ఉంది.

గ్రీన్‌కార్డుల పెండింగ్‌కు 'వలస' చెక్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదిస్తున్న వలస విధానంతో గ్రీన్‌కార్డుల పెండింగ్ తగ్గిపోతుందని అధ్యక్ష నివాసం వైట్‌హౌస్ వెల్లడించింది. లాటరీ విధానాన్ని రద్దు చేసి ప్రతిభ ఆధారిత వీసాలు ఇవ్వాలని ట్రంప్ మద్దతిస్తున్న వలస విధానంతో నైపుణ్యం గల ఉద్యోగుల గ్రీన్ కార్డుల దరఖాస్తులు పెండింగ్ తగ్గిపోయే అవకాశముందని తెలిపింది. గ్రీన్ కార్డుల విషయంలో ఒక్కో దేశానికి ఇచ్చే కోటాను రద్దు చేయాలని భారతీయ హెచ్1బీ వీసాదారులు డిమాండు చేస్తున్న నేపథ్యంలో వైట్‌హౌస్ ఈ ప్రకటన చేసింది. హెచ్1బీ వీసాల ద్వారా అమెరికాకు వెళ్లిన చాలామంది భారతీయ అమెరికన్లు గ్రీన్ కార్డుల విషయంలో దేశాల వారీ కోటా కారణంగా చాలా ఇబ్బంది పడుతున్నారు. లక్షలాది మంది భారతీయ అమెరికన్ల గ్రీన్‌కార్డు దరఖాస్తులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. అమెరికాలోని వివిధ ప్రాంతాల్లో పలురకాల వీసాలపై వచ్చిన భారతీయులు ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో పలువురు వాషింగ్టన్ చేరుకుని వారం రోజులుగా వలస విధా నాల్లో మార్పు తీసుకురావాలని ట్రంప్‌ను, కాంగ్రెస్‌ను డిమాండు చేస్తున్నారు. ప్రస్తుత వలస విధానానికి స్వస్తి పలకడం ద్వారా మన ఆర్థిక వ్యవస్థకు కలుగుతున్న నష్టాన్ని నివారించనున్నామని వైట్‌హౌస్ ఈ నేపథ్యంలో ప్రకటించింది. దీనిపై ట్రంప్ కూడా ట్విటర్ ద్వారా స్పందించారు. లాటరీ విధానాన్ని రద్దు చేసే సమయం వచ్చింది, కాంగ్రెస్‌కు భేషైన వలస విధానాన్ని రూపొందించాల్సిన, అమెరికన్లను కాపాడాల్సిన అవసరముందని ట్రంప్ ట్వీట్ చేశారు. ప్రతిభ ఆధారిత వలసల ద్వారా ట్రంప్ ప్రపంచ వ్యాప్తంగా ప్రతిభావంతుల్ని, నిపుణులను అమెరికాకు వచ్చేలా ఆకర్షించాలని భావిస్తున్నారు.

13వేలమంది కొలువులకు ఎసరు..!

రైల్వేలో అనధికారిక సెలవులో ఉన్న ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు

న్యూఢిల్లీ : త్వరలో రైల్వే శాఖలో భారీగా ఉద్యోగుల కోత ఉండనుందట. చాలా కాలం పాటు అనధికారిక సెలవులో ఉన్న ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనుంది రైల్వేశాఖ. ఈ మేరకు ఇప్పటి వరకు అలా సెలవులో ఉన్న 13వేల మంది ఉద్యోగులను గుర్తించింది. వారిని త్వరలోనే విధుల నుంచి తొలగించనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. రైల్వే పనితీరును మెరుగుపరిచేందుకు, ఉద్యోగుల్లో నిబద్ధతను పెంచేందుకు ఇటీవల రైల్వేశాఖ ఓ డ్రైవ్ చేపట్టింది. ఇందులో భాగంగా చాలా కాలంగా సెలవులో ఉంటున్న సిబ్బంది వివరాలను సేకరించింది. 'మొత్తం 13 లక్షల మంది ఉద్యోగుల్లో 13వేల మంది చాలా కాలం నుంచి అనధికారికంగా సెలవులో ఉంటున్నట్లు గుర్తించాం. వారిపై క్రమశిక్షణ చర్యలను ప్రారంభించాం. అలాంటి ఉద్యోగులను విధుల నుంచి తీసేయాలని భావిస్తున్నాం' అని రైల్వే శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు ఉద్యోగుల జాబితా నుంచి వీరి పేర్లను తొలగించాలని ఇప్పటికే సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
-407.40	-121.90	-200	29,050	-1100	42,600	64.40
34,005.76	10,454.95	28,700	ప్రొద్దుటూరు 28,610	38,800	ప్రొద్దుటూరు 39,100 కిలో (రూపాయల్లో)	

వాహన బీమా..

సులువుగా...



రోడ్డు మీద తిరిగే ప్రతి వాహనానికీ బీమా తప్పనిసరి. అయితే, చాలామంది తమ బీమా పాలసీ పరిమితి ముగిసినా తీసుకోరు. ఆ తర్వాత తీసుకోవాలంటే.. బీమా సంస్థ దగ్గరకో, అధీకృత ఏజెంటు దగ్గరకో వాహనాన్ని తీసుకెళ్లాలి. ఇలాంటి ఇబ్బందులను తప్పించేందుకు హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో వినూత్న యాప్‌ను ప్రవేశ పెట్టింది. పాలసీ పునరుద్ధరించుకోవాలని భావించే వారు.. సంస్థ వెబ్‌సైటులో 'ఇన్సూరెన్స్ పోర్ట్‌ఫోలియో అప్లికేషన్ (ఐపీఏ)'కు వెళ్లి అవసరమైన వివరాలు పూర్తి చేయాలి. ఆ తర్వాత ఓ సంక్షిప్త సందేశం మీ నమోదిత మొబైల్‌కు వస్తుంది. అందులో ఒక రిఫరెన్స్ సంఖ్య, 'సెల్ఫ్‌ఇన్‌స్పెక్షన్'కు సంబంధించిన యాప్ లింకు వస్తుంది. ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని, ఎస్‌ఎంఎస్‌లో వచ్చిన సంఖ్యను పేర్కొనాలి. అప్పుడు వచ్చే సూచనలకు అనుగుణంగా 45 సెకన్ల వీడియో తీయాలి. అనంతరం వాహనం ఆర్‌సీతోపాటు, నాలుగు వైపులా ఫొటోలు తీయాలి. ఏ భాగమైనా దెబ్బతింటే.. వాటినీ పేర్కొనాలి. ఆ తర్వాత వీటిని అప్‌లోడ్ చేయాలి. అన్నీ సరిగా ఉంటే.. బీమా పాలసీకి ప్రీమియం చెల్లించాల్సిందిగా సమాచారం వస్తుంది. అప్పుడు మీరు మీ వాహన బీమాను పునరుద్ధరించుకోవచ్చు.



కార్డు వాడినా..

స్కోరు తగ్గకుండా..



నగదు రహిత చెల్లింపులకు ఆదరణ పెరుగుతుండటంతో చాలామంది క్రెడిట్ కార్డులను వాడటం ప్రారంభించారు. అయితే, కార్డు వాడే విధానంలో కొన్ని మార్పులు చేసుకోకపోతే.. మీ క్రెడిట్ స్కోరుపై ప్రభావం పడే అవకాశం ఉంది. కొన్ని జాగ్రత్తలతో అప్పుల ఊబిలో కూరుకుపోకుండా.. క్రెడిట్ స్కోరు దెబ్బతినకుండా చూసుకోవచ్చు.

- క్రెడిట్ కార్డును ఉపయోగించడమే కాదు.. వ్యవధిలోపు దాని బిల్లును తీర్చేయడమూ ముఖ్యమే. చాలామంది సమయానికి బిల్లులు చెల్లించక, పెద్ద మొత్తంలో కొనుగోలు చేసినప్పుడు దానిని ఈఎంఐగా మార్చుకోవడంలాంటివి చేస్తుంటారు. కార్డు వినియోగంలో చేయకూడని తప్పులివి. కాబట్టి, ముందుగా జాగ్రత్త పడాల్సింది ఈ విషయంలోనే.
- బిల్లు తప్పకుండా చెల్లిస్తామనే నమ్మకం ఉంటేనే పెద్ద లావాదేవీలు చేయండి. ఇబ్బందిగా ఉండొచ్చు అని ఏమాత్రం అనిపించినా మీ ఖర్చును వాయిదా వేసుకోవడమే ఉత్తమం. ఇప్పుడు ఖర్చు చేసి, తర్వాత చూసుకుందాం అనే మాట ఇక్కడ పనికిరాదని గుర్తించండి.
- సాధారణంగా మీ కార్డు పరిమితిలో 30శాతానికి మించి వాడకుండా చూసుకోండి. పరిమితి ఉంది కదా అని పూర్తిగా వాడటం అంటే.. మీరు అప్పుల మీదే ఆధారపడ్డారనే సంకేతాలు వెళ్తాయి. భవిష్యత్తులో మీరేదైనా రుణం తీసుకోవాలనే ఆలోచన ఉన్నప్పుడు ఇది ఇబ్బందికరంగా మారవచ్చు.
- మీరు గతంలో ఎప్పుడో కార్డు తీసుకొని ఉంటారు.. రుణ పరిమితి అప్పుడు చాలా తక్కువగా ఉండొచ్చు. పెరిగిన అవసరాల మేరకు కార్డు రుణ పరిమితిని పెంచుకోండి. దీనికోసం మీ కార్డు సంస్థను సంప్రదించండి. ఇది ఎందుకు అనే అనుమానం రావచ్చు.. అధికంగా పరిమితి ఉంటే లాభమే కానీ నష్టం లేదు.
- రెండు క్రెడిట్ కార్డులు ఉన్నప్పుడు సాధ్యమైనంత వరకూ రెండింటినీ సమానంగా వాడేందుకు ప్రయత్నించండి. ఒకటి పూర్తిగా పరిమితి వరకూ వాడేసి, మరోదాన్ని అసలు వాడకపోవడం సరికాదు. రెండు కార్డుల్లో రూ. 50వేల పరిమితి ఉంటే.. మీరు రూ. 40వేలు వాడాలనుకున్నప్పుడు.. రెండు కార్డుల నుంచీ రూ. 20వేల చొప్పున వాడటం ఉత్తమం.
- క్రెడిట్ కార్డులు, ఇతర రుణాలు ఉన్నప్పుడు కనీసం ఏడాదికోసారైనా మీ క్రెడిట్ స్కోరు, రుణ చరిత్ర నివేదికను పొందడం మంచిది. ఇప్పుడు ఏడాదికోసారి రుణ చరిత్రను ఉచితంగా పొందే అవకాశమూ ఉంది. దీనికోసం సిబిల్ వెబ్‌సైటులోకి వెళ్లి, మీ వివరాలు పూర్తి చేస్తే చాలు.
- రుణ చరిత్ర సరిగ్గా లేకపోవడం, క్రెడిట్ స్కోరు 750కన్నా తక్కువగా ఉన్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బ్యాంకులను సంప్రదించి, పాత బాకీలను తీర్చేయడమే ఉత్తమం. దీనివల్ల భవిష్యత్తులో అనవసర ఇబ్బందులు తప్పుతాయి.

మ్యూచువల్ ఫండ్లే సరైన దారి



చిన్న మొత్తాలతోనూ పెట్టుబడులు ప్రారంభించాలని భావించే వారికి మ్యూచువల్ ఫండ్లు మంచి మార్గం. ఇందులో క్రమానుగత మదుపు విధానం (సిప్)ను ఎంచుకొని మార్కెట్‌లోకి ప్రవేశించవచ్చు. సాధారణంగా మదుపరులు మార్కెట్‌లోకి సరైన సమయంలో ప్రవేశించరు. విలువలు ఎక్కువగా ఉన్న ప్పుడో.. లేక మార్కెట్ పడిపోతున్నప్పుడో పెట్టుబడులు పెట్టాలని ఆలోచిస్తుంటారు. కానీ, మార్కెట్ పరిస్థితులతో సంబంధం లేకుండా నిరంతరం మార్కెట్లో కొనసాగే వెసులుబాటు సిప్ కల్పిస్తుంది. దీంతోపాటు ఆర్థిక క్రమశిక్షణనూ ఇది నేర్పిస్తుంది.

ఇంటికి.. రక్షణగా..



నిర్మాణంతోపాటు.. గృహోపకరణాలకూ.. ప్రయాణాల్లో నగదు కోల్పోవడం, వ్యక్తిగత ప్రమాద బీమాలాంటి ప్రయోజనాలను కల్పిస్తూ ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ సింపుల్ హోం పేరుతో కొత్త బీమా పాలసీని విడుదల చేసింది. దీన్ని ఏడాది, రెండేళ్లు, మూడేళ్ల కాల వ్యవధికి తీసుకునే అవకాశం ఉంది. ఈ పాలసీకి కనీస ప్రీమియం రూ.250. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లో ఎక్కడైనా ఈ పాలసీని తీసుకునే వెసులుబాటు ఉంది. ఇంటి నిర్మాణానికి ఏదైనా నష్టం వాటిల్లినప్పుడు.. అంగీకరించిన విలువ మేరకు పరిహారం చెల్లిస్తుంది ఈ పాలసీ. సొంతిల్లు ఉన్నవారే కాకుండా.. అద్దెకు ఉంటున్న వారు కూడా తమ వస్తువుల రక్షణ కోసం ఈ పాలసీని తీసుకోవచ్చు.

విశాలాంధ్ర సినిమా

'రంగస్థలం'లో రామలక్ష్మిగా సమంత



సుకుమార్ సినిమా అంటేనే పాత్రలు, కథ, సన్నివేశాల్లో కొత్తదనాన్ని ఆశిస్తారు ప్రేక్షకులు. ఇప్పటివరకు చేసిన అన్ని సినిమాల్లోను ఆ కొత్తదనం ఉండేలా చూసుకున్న సుకుమార్.. త్వరలో రిలీజ్ కానున్న 'రంగస్థలం' లో కూడా అదే భిన్నత్వం చూపించనున్నారు. ముఖ్యంగా పాత్రల విషయంలో.. ఇప్పటికే వినికిడి లోపం ఉన్న చిట్టిబాబుగా రామ్‌చరణ్‌ను విభిన్నంగా చూపించిన ఆయన సమంతను మరింత ఆకట్టుకునేలా చూపించారు. ఇన్నాళ్లు గ్లామర్ పాత్రలు చేస్తూ వచ్చిన ఆమె 'రంగస్థలం'లో మాత్రం రామలక్ష్మిగా డీ గ్లామరైజ్డ్ పాత్రలో అచ్చమైన పల్లెటూరి యువతి లుక్‌లో ఇదివరకెప్పుడూ మనం చూడని సమంతలా కనిపిస్తూ సినిమాపై, తన నటనపై అంచనాలను పెంచేసింది. మరి ఈ మధ్య కాలంలో చూడనటువంటి పాత్రల తరహాలో ఉన్న చిట్టి బాబు, రామలక్ష్మిలు ప్రేక్షకులను ఎలా ఆకట్టుకుంటారో చూడాలంటే మార్చి 30 వరకు ఆగాల్సిందే.

షూటింగ్ పూర్తిచేసుకున్న 'నా నువ్వే'



కంప్లీట్ మేకోవర్‌తో కల్యాణ్ రామ్ చేస్తున్న సినిమా నా నువ్వే. ప్రఖ్యాత యాడ్ ఫిలిం మేకర్ జయేంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ప్యాచ్ వర్క్ మినహా దాదాపు షూటింగ్ పూర్తిచేసుకుంది. మూవీకి సంబంధించి ఓ సాంగ్‌ను రీసెంట్‌గా అన్నపూర్ణ స్టూడియోస్‌లో షూట్ చేశారు. బృంద కొరియోగ్రఫీలో హీరో ఇంట్రడక్షన్ సాంగ్ తీశారు. నా నువ్వే సినిమాకు సంబంధించి ఇప్పటికే ఫస్ట్‌లుక్ టీజర్ విడుదలైంది. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో సినిమా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కల్యాణ్ రామ్ సరసన తమన్న హీరోయిన్‌గా నటిస్తోంది. టోటల్ షూటింగ్ కంప్లీట్ అయిన తర్వాత పోస్ట్-ప్రొడక్షన్‌తో పాటు అఫీషియల్‌గా మూవీ ప్రమోషన్ ప్రారంభించబోతున్నారు. కూల్ బ్రీజ్ సినిమాస్ బ్యానర్‌పై, ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు పీసీ శ్రీరామ్ సినిమాటోగ్రాఫర్. శరత్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు.

పవన్ కళ్యాణ్ కోసం కథ రెడీ చేసిన మంజుల

మంజుల డైరెక్షన్‌లో తెరకెక్కింది 'మనసుకు నచ్చింది' సినిమా. సందీప్ కిషన్, అమైరా దస్తూర్ జంటగా నటించిన ఈ మూవీ ఫిబ్రవరి 16న గ్రాండ్‌గా రిలీజవుతోంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా జరిగిన ప్రెస్ మీట్‌లో మంజుల, పవన్ కళ్యాణ్ కోసం కథ రెడీ చేసుకున్నట్టు చెప్పుకుంది. 'పవన్ కళ్యాణ్ గారు వెరీ జెన్యూన్ పర్సన్. ఆయన మనసుకు నచ్చింది చేసే మనిషి. ఆయన ఇకపై సినిమాలు చేయకపోవచ్చు కానీ ఒక్కసారి ఈ కథ విన్నారంటే, ఎట్టి పరిస్థితుల్లో నో చెప్పలేరు. అంత అద్భుతంగా ఉంది కథ. ఈ ఒక్క సినిమా చేసి ఆయన పాలిటిక్స్‌కి వెళ్లిపోవచ్చు.' అని నవ్వుతూ చెప్పుకుంది మంజుల. సందీప్ కిషన్, అమైరా దస్తూర్ జంటగా నటించిన ఈ సినిమా ఇప్పటికే ఇంట్రెస్టింగ్ బజ్ క్రియేట్ చేస్తుంది. ఫ్రెష్ రొమాంటిక్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమాకి రాధన్ మ్యూజిక్ కంపోజ్ చేశాడు.

రౌడీ పోలీస్‌గా నికిషా పటేల్



పవన్ కళ్యాణ్ పులి సినిమాతో పరిచయమైన బ్యూటీ నికిషాపటేల్. మధ్యలో కొన్ని సినిమాల్లో అలరించిన నికిషా ఇప్పుడు ఓ లేడీ ఓరియంటెడ్ మూవీతో రాబోతోంది. ఈ సినిమాలో నిఖిషా పోలీస్ ఆఫీసర్‌గా పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తుంది. అందుకు తగ్గట్టుగానే సినిమా టైటిల్ కూడా "రౌడీపోలీస్" అని పెట్టారు. టైటిల్‌తో పాటు నికిషా పాత్ర కూడా చాలా పవర్ ఫుల్‌గా ఉంటుందని చెబుతున్నారు మేకర్స్. రౌడీపోలీస్‌లో ముకుల్ దేవ్ విలన్‌గా నటిస్తున్నాడు. మరో ఇంపార్టెంట్ రోల్‌లో సీనియర్ హీరో భానుచందర్ నటించారు. సినిమా కథను బట్టి యాక్షన్ ఎపిసోడ్స్‌కు చాలా స్కోప్ ఉంటుంది. రిస్కీగా సాగే రోప్ యాక్షన్ సీన్స్ కూడా ఉంటాయట. వాటిని ఎలాంటి డూప్ లేకుండా అత్యంత రియలిస్టిక్‌గా చేసింది హీరోయిన్ నికిషా. సినిమా కోసం కాదు కానీ ఆల్రెడీ నికిషా మార్షల్ ఆర్ట్స్‌లో ట్రెయిన్ అయి ఉంది. పైగా తను రియల్ బాక్సర్ కూడా. కాబట్టి ఈ యాక్షన్ సీక్వెన్స్ అన్నీ చాలా ఈజీగా చేసేసింది. అంతేకాదు.. ఇకపైనా ఇలాంటి యాక్షన్ ఓరియంటెడ్ సినిమాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తానని చెబుతోంది. జానీ అనే దర్శకుడు తెరకెక్కిస్తోన్న ఈ మూవీని ఆర్.ఎ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద వేణు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం క్లైమాక్స్ చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేస్తామని దర్శకనిర్మాతలు చెబుతున్నారు.

సెన్సార్ పూర్తి చేసుకున్న 'అ !'



వాల్ పోస్టర్ సినిమా పతాకంపై నాని నిర్మాతగా మారి నిర్మిస్తున్న సినిమా 'అ!'. నిత్యా మీనన్, కాజల్ అగర్వాల్, రెజీనా, ఈషా రెబ్బ, అవసరాల శ్రీనివాస్, ప్రియదర్శి ముఖ్య పాత్రల్లో కనిపించబోతున్న ఈ సినిమా ద్వారా ప్రశాంత్ వర్మ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. కార్తిక్ ఘట్టమనేని సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ సినిమా టీజర్‌కు మంచి స్పందన లభించింది. తాజాగా సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ సినిమాకు యు/ఏ సర్టిఫికెట్ లభించింది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు నాని, రవితేజ వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఫిబ్రవరి 16న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాపై మంచి అంచనాలున్నాయి. నాని హీరోగా నటిస్తూనే నిర్మాతగా మారి చేసిన మొదటి సినిమా ఇదే అవ్వడం విశేషం.

మణిరత్నం 'నవాబ్' ఫస్ట్ లుక్




చెలియా లాంటి ఇంటెన్సివ్ లవ్ ఎంటర్ టైనర్ తరవాత భారీ స్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌ని తెరకెక్కించనున్నాడు మణిరత్నం. చాలా రోజుల నుండి సోషల్ మీడియాలో చర్చల్లో ఉన్న ఈ సినిమా ఫస్ట్‌లుక్ రిలీజయింది. తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమాకి తెలుగులో 'నవాబ్' అని టైటిల్ ఫిక్స్ చేసింది సినిమా యూనిట్. అరవింద్ స్వామి, శింబు, విజయ్ సేతుపతి, అరుణ్ విజయ్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలో జ్యోతిక, అదితి రావ్ హైదరి ఫీమేల్ లీడ్స్‌గా కనిపించనున్నారు. దాదాపు ప్రీ ప్రొడక్షన్ పూర్తి చేసుకున్న ఈ సినిమాని త్వరలో సెట్స్ పైకి తీసుకువచ్చే ప్రయత్నాల్లో ఉన్నారు ఫిల్మ్ మేకర్స్. ఈ సినిమా మద్రాస్ టాకీస్‌తో పాటు లైకా ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై తెరకెక్కుతోంది. ఎ.ఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు.

వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో అల్లు అర్జున్



భిన్నమైన కథలను ఎన్నుకోవడమే గాక.. ప్రతీ చిత్రంలో కథకు సరిపడేట్టు తనని తాను మార్చుకునే నటుడు స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్. వైవిధ్యమైన కథలను వాణిజ్య అంశాలతో ముడిపెడుతూ.. ప్రేక్షకులను కట్టిపడేసేలా సినిమాలను తెరకెక్కించే దర్శకుడు వి.ఐ.ఆనంద్. ప్రేమని, ఆత్మతో ముడిపెట్టి సినిమా తీసినా సమాంతర జీవితాలు అంటూ చిత్రాలను తెరకెక్కించినా అది ఈ దర్శకుడికే చెల్లు. అందుకే ఆ దర్శకుడి స్టైల్ ఆఫ్ టేకింగ్‌కి స్టైలిష్ స్టార్ కూడా ఫిదా అయిపోయారు. ఆయనతో కలిసి సినిమా చేయడానికి ఆసక్తి ఉన్నట్టు ఇప్పటికే వెల్లడించారు కూడా. తాజా సమాచారం ప్రకారం.వి.ఐ.ఆనంద్ ఒక లైన్‌ని బన్నీకి చెప్పారట. అది బన్నీకి నచ్చి దాన్ని డెవలప్ చేసి పూర్తి కథతో రమ్మనమని కోరారట. దీంతో..ఇప్పుడు సదరు డైరెక్టర్ కథని తయారు చేసేపనిలో పడ్డారని పరిశ్రమ వర్గాల సమాచారం. త్వరలోనే బన్నీని కలిసే అవకాశాలు కూడా ఉన్నాయని తెలుస్తోంది. ఇదిలా వుంటేబన్నీ ఈ ప్రాజెక్టుకి గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. నిర్మించడానికి ఒక టాప్ నిర్మాణ సంస్థ కూడా సిద్ధంగా ఉన్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం వక్కంతం వంశీ డైరెక్షన్‌లో నటిస్తున్న 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' తర్వాత బన్నీ ఈ సినిమాని పట్టాలెక్కిస్తారేమో చూడాలి మరి.

'మెహబూబా' టీజర్‌కి మంచి స్పందన



డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఆకాష్ పూరి హీరోగా లావణ్య సమర్పణలో పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'మెహబూబా'. ఈ చిత్రానికి సందీప్ చౌతా సంగీతం అందిస్తున్నారు. 1971 ఇండియా-పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో సాగే ప్రేమకథగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, యు.ఎస్.లలో 500 థియేటర్లలో ఈ టీజర్ విడుదలైంది. చాలా డిఫరెంట్‌గా ఉన్న ఈ టీజర్‌కి ప్రేక్షకుల నుండి ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. సోషల్ మీడియాలో ఈ టీజర్‌కి అద్భుతమైన స్పందన లభిస్తోంది. పూరి జగన్నాథ్ కెరీర్‌లోనే డిఫరెంట్ మూవీగా 'మెహబూబా' తెరకెక్కుతోంది. సమ్మర్‌లో చాలా గ్రాండ్‌గా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆకాష్ పూరి సరసన నేహాశెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సందీప్ చౌతా, సినిమాటోగ్రఫీ: విష్ణుశర్మ, ఎడిటింగ్: జునైద్ సిద్ధిఖీ, యాక్షన్: రియల్ సతీష్, ఆర్ట్: జానీ షేక్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, నిర్మాత, దర్శకత్వం: పూరి జగన్నాథ్.

అయోధ్యపై కుదరని రాజీ

రవిశంకర్‌తో మౌలానా భేటీపై ఏఐఎంపీఎల్‌బీ విచారణ



బెంగళూరు : అయోధ్య వివాదంపై రాజీకుదరలేదని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో ఏఐఎంపీఎల్‌బీ సభ్యులు మౌలానా సల్మాన్ నద్వీ ఇటీవల ఆర్ట్ ఆఫ్ లివ్వింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్‌తో భేటీ అంశంపై విచారణ చేపట్టినట్టు తెలిపింది. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆమిలా (వర్కింగ్ కమిటీ) ఇప్పటికే దర్యాప్తును ప్రారంభించినట్టు వెల్లడించింది. శుక్రవారం రాత్రి బోర్డు సభ్యులకు మౌలానాకు మధ్య జరిగిన వాగ్వివాదం అనంతరం బోర్డు ఈ మేరకు నిర్ణయించినట్టు వర్కింగ్ కమిటీ సభ్యుడొకరు తెలిపారు. దర్యాప్తు కమిటీలో అధ్యక్షుడు మౌలానా రబే హసానీ, ప్రధాన కార్యదర్శి మౌలానా వలీ రెహమానీ, కార్యదర్శి మౌలానా ఖలీద్ సైపుల్లా రెహమానీ, ఆమిలా సభ్యుడు మౌలానా అర్షద్ మదానీ ఉన్నట్టు వెల్లడించారు. ఈ వ్యవహారంలో కమిటీ తమ నివేదికను ఎప్పుడు ఇస్తుందో చెప్పలేమని, ఆమిలా కార్యకలాపాలు రహస్యంగా జరుగుతాయన్నారు. ఇదిలావుండగా, మౌలానా నద్వీ.. ఆర్ట్ ఆఫ్ లివ్వింగ్ వ్యవస్థాపకుడిని కలిసిన విషయం వాస్తవమేనని, ఇది ఆయన వ్యక్తిగత భేటీ అని, దీంతో ముస్లిం లా బోర్డుకు ఎలాంటి సంబంధం లేదని బోర్డు కార్యదర్శి మౌలానా రెహమానీ స్పష్టంచేశారు.

ఆరోగ్య 'కేరళ'

ఆరోగ్యకర రాష్ట్రాల జాబితా విడుదల చేసిన నీతిఆయోగ్



న్యూఢిల్లీ : నీతిఆయోగ్ విడుదల చేసిన ఆరోగ్యకరమైన రాష్ట్రాల జాబితాలో కేరళ తొలి స్థానంలో నిలిచింది. కాగా ఈ జాబితాలో ఉత్తర్‌ప్రదేశ్ అట్టడుగు స్థానంలో ఉంది. పెద్దరాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలకు వేర్వేరుగా నీతిఆయోగ్ జాబితాను రూపొందించింది. పెద్ద రాష్ట్రాల్లో కేరళ మొదటి ర్యాంక్‌లో ఉండగా.. పంజాబ్, తమిళనాడు, గుజరాత్ ఆ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి. ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్, బిహార్, ఒడిశా చివరి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఈ జాబితాలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ 8, తెలంగాణ 11వ ర్యాంక్‌లో నిలిచాయి. ఇక చిన్న రాష్ట్రాల జాబితాలో మిజోరాం తొలి ర్యాంక్‌లో ఉండగా.. మణిపూర్, మేఘాలయా ఆ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాల్లో లక్షద్వీప్ ఆరోగ్యకరమైన ప్రాంతంగా నిలిచింది. కాగా.. యూపీ అట్టడుగు స్థానంలో ఉన్నప్పటికీ.. గతేడాదితో పోలిస్తే అక్కడ ఆరోగ్య పరిస్థితులు కాస్త మెరుగుపడ్డాయని నీతిఆయోగ్ పేర్కొంది. అంతేగాక.. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ఈ విషయంలో చాలా వేగంగా అభివృద్ధి చెంది. 4, 5 ర్యాంకులు దక్కించుకున్నట్లు తెలిపింది.

కాషాయ మూక దాష్టీకం

ఒడిశా అధికారి పాండియన్ ఇంటిపై దాడి

రెచ్చిపోయిన బీజేపీ కార్యకర్తలు : ఆస్తులు ధ్వంసం : పలువురి అరెస్టు



భువనేశ్వర్ : బీజేపీ కార్యకర్తలు కొందరు పార్టీ జెండాలు చేబూని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ కార్యాలయంలోని ఓ అధికారి ఇంటిపై దాడికి తెగబడి విధ్వంసం సృష్టించారు. నవీన్ ప్రైవేట్ సెక్రటరీ వీకే పాండియన్ అధికారిక నివాసాన్ని కొల్లగొట్టారు. ఆస్తులను ధ్వంసం చేశారు. పూలకుండీలు పగలగొట్టారు. ఇంటి ప్రధాన ద్వారంపై ఆవుపేడ జల్లి.. పాండియన్ అధికార బీజేడీ కోసం పనిచేస్తూ రాజకీయ వ్యవహారాల్లో తలదూర్చడం తగదని హెచ్చరించారు. తమను తాము బీజేపీ కార్యకర్తలుగా చెప్పుకొన్న దుండగులు బీజేపీ పార్టీ జెండాలు, ప్లకార్డులతో వచ్చి విధ్వంసం సృష్టించారని, ఇంటి ఆవరణలో ఉన్న పూలకుండీలను, కార్లను ధ్వంసం చేయడమే కాకుండా తమపై దాడి చేశారని సిబ్బంది తెలిపారు. ప్రభుత్వ అధికారి ఇంటిపై ఈ తరహా దాడి చేయడం మామూలు విషయం



కాదని, దీన్ని తీవ్రంగా పరిగణిస్తామని పోలీసు కమిషనర్ వైబీ ఖురానియా తెలిపారు. చట్టవ్యతిరేక పనులను ఉపేక్షించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే రంగంలోకి దిగిన పోలీసులు పలువురిని అరెస్టు చేశారు. మిగతావారిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు. ఈ వ్యవహారంలో దర్యాప్తు కొనసాగుతోంది. పాండియన్ ఇంటిపై బీజేపీ కార్యకర్తల దాడిని బీజేడీ అధికార ప్రతినిధి, ఎంపీ ప్రతాప్ దేవ్ తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటన బీజేపీ నేతల ఆలోచనా విధానానికి అద్దంపడుతోందన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి హింసాత్మక చర్యలు, అసహనాన్ని సహించేది లేదని, దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండు చేశారు. బీజేపీ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడు సమీర్ మొహంతీ దాడిని సమర్థించేందుకు యత్నించారు. రాజకీయ వ్యవహారాల్లో ప్రభుత్వ అధికారి జోక్యం చేసుకోవడం తగదన్నారు. ఆయన అధికార పార్టీ కోసం పనిచేస్తున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కాగా, పార్టీ వ్యవహారాల్లో తలదూరుస్తున్నారంటూ బీజేడీలోని కొంతమంది ఈ అధికారిపై ఆరోపణలు చేయడం గమనార్హం.



అమితాబ్‌కు స్వల్ప అస్వస్థత

ముంబై : బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ (75) స్వల్ప అస్వస్థతకు లోనుకాగా, కుటుంబ సభ్యులు ఆయనను లీలావతి ఆసుపత్రిలో చికిత్స అందించారు. కొంత కాలంగా ఆయన జీర్ణాశయ సమస్యలతోపాటు మెడ, వెన్నెముక నొప్పితో బాధపడుతున్నారు. ఈ క్రమంలో వెన్నెముక కింది భాగంలో నొప్పిగా ఎక్కువ కావటంతో ఆయన ఆసుపత్రిలో చేరినట్టు సమాచారం. "లుంబార్ (నడుము కింది భాగం) ప్రాంతంలో నొప్పిగా ఉన్నట్టు అమితాబ్ చెప్పారు. కొన్ని ఇంజెక్షన్లు ఇచ్చి ఆపై డిశ్చార్జ్ చేశాం" అని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. అమితాబ్ ప్రస్తుతం '102 నాటౌట్' అనే చిత్రంలో నటిస్తున్నారు. దాదాపు 27 ఏళ్ల తర్వాత మరో సీనియర్ నటుడు రిషి కపూర్ తో ఆయన స్క్రీన్ పంచుకున్నారు. ఈ చిత్రం ఓ గుజరాతీ నాటిక ఆధారంగా రూపొందుతోంది.

ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ కుమారుడి మృతి

వారణాసి : ప్రఖ్యాత షెహనాయి సంగీతకారుడు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ మూడవ కుమారుడు జమీన్ హుస్సేన్ ఖాన్ (74) మృతి చెందారు. మూత్ర పిండాలు పనిచేయకపోవడంతో శనివారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. జమీన్ కుమారుడు అఫాక్ హైదర్ తాతగారి వారసత్వాన్ని కొనసాగిస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఫత్మాన్ దర్గాలోని ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ సమాధి పక్కనే ఆయనను సమాధి చేస్తామని వెల్లడించారు.

ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు ఇరిగేషన్ అధికారులు

న్యూఢిల్లీ : నీటిపారుదల, వరద సహాయక శాఖకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను నోడల్ అధికారులుగా నియమిస్తూ ఢిల్లీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమితం కాకుండా నోడల్ అధికారులు కాపాడ తారని ఆ శాఖ తెలిపింది. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన రికార్డులను నోడల్ అధికారులు భద్రపరుస్తారు. ప్రతినెలా 7న చీఫ్ ఇంజనీర్‌కు నెలవారీ నివేదికలను అందించాలని, నోడల్ అధికారి ఆధీనంలోని ఆస్తులు ఎవరైనా స్వాధీనం చేసుకున్నట్లయితే సదరు అధికారిపై చర్యలు తీసుకుంటారని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

కోరాపుట్‌లో ఒడిశా అధికారుల పర్యటన

కోరాపుట్ (ఒడిశా) : ఆంధ్రప్రదేశ్ - ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కోరాపుట్‌లో సమస్యలను తెలుసుకునేందుకు ఒడిశా అధికారుల బృందం పర్యటించింది. ఈ సరిహద్దు గ్రామాలను రెండు రాష్ట్రాలు తమవిగా గుర్తిస్తున్నారు. బృందానికి నేతృత్వం వహించిన జిల్లా ప్లానింగ్ కమిటీ చైర్మన్, పొట్టంగి ఎమ్మెల్యే ప్రఫుల్ల పాంగీ గ్రామస్తులను అడిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. వారికి ఇష్టమైతే శనివారం సాయంత్రి సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. రెసిడెన్షి యన్ స్కూలు, ఆరోగ్య కేంద్రం, పంచాయతీ కార్యాలయం ఇతర ప్రభుత్వ సంస్థల్లో పర్యటించామన్నారు. జనవరిలో విజయనగరం కలెక్టరు అక్కడ పర్యటించి జన్మభూమి కార్యక్రమాలను నిర్వహించారు.

వ్యక్తి సజీవదహనం

న్యూఢిల్లీ : కేంద్ర ఢిల్లీలోని కరోల్ బాగ్ గార్మెంట్ ఫ్యాక్టరీలో శనివారం తెల్లవారు జామున జరిగిన అగ్నిప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మంటలను చల్లార్చడానికి ఐదు అగ్నిమాపక దళాలు పనిచేశాయని ఢిల్లీ అధికారులు వెల్లడించారు. మొదటి అంతస్తులోని మెట్ల మీదనుంచి అగ్నికీలకాలు అంటుకున్నాయని, భవనం అంతటా దట్టమైన పొగ ఆవరిం చడంతో గార్మెంట్ ఫ్యాక్టరీలోని వ్యక్తి జుమ్మన్ ఊపిరాడక చనిపోయాడన్నారు. ప్రమాదానికి కారణాలపై దర్యాప్తు జరుపుతున్నామన్నారు. జనవరిలో భవన పారిశ్రామిక ప్రాంతంలో సంభవించిన అగ్నిప్రమాదంలో 17 మంది పనివారు మృతిచెందిన విషయం తెలిసిందే.

బీర్ తాగే అమ్మాయిలంటే భయం : పారికర్

పనాజీ : ప్రభుత్వం మాదక ద్రవ్యాల వాడకాన్ని నిరోధించిందని అయితే రాష్ట్రంలోని అమ్మాయిలు కూడా బీరు తాగుతున్నారన్న భయం పట్టుకుందని గోవా ముఖ్యమంత్రి మనోహర్‌పారికర్ అన్నారు. గోవాలో మాదక ద్రవ్యాల అమ్మకాలు ఎక్కువగా ఉన్నప్పటికీ వాటి నిరోధానికి కట్టుబడి ఉన్నామని అయితే మద్యం అమ్మ కాలే తనకు భీతి కలిగిస్తున్నాయని రాష్ట్ర యూత్ పార్లమెంట్‌లో వెల్లడించారు. ఇప్పటివరకు 170 మంది మాదకద్రవ్యాల అక్రమరవాణాదారులను అరెస్టు చేశామన్నారు.

వాయుకాలుష్యానికి ముంబై సిస్టర్స్ పరిష్కారం

ముంబై: నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద మోటారుబైకుల స్విచ్ ఆఫ్ చేస్తే వాయుకాలుష్యం తగ్గడంతోపాటు ఇంధనం ఆదా అవుతుందని శివానిఖోట్ (19), ఈశ (14) సిస్టర్స్ వెల్లడిస్తున్నారు. నీలం సిగ్నల్ రావడంతోనే ఇంజన్‌ను ఆపు చేయాలని గ్రీన్ వచ్చిన తర్వాత మళ్లీ ఆన్ చేయాలని వారు కోరుతున్నారు. సైకాలజీ విద్యార్థి అయిన శివానీ మాట్లాడుతూ కేంద్ర రోడ్డు అధ్యయన సంస్థ (సీఆర్ఆర్ఐ) నివేదిక ప్రకారం 20 శాతం మంది మోటారిస్టులు సిగ్నల్స్ వద్ద స్విచ్ ఆఫ్ చేస్తున్నారన్నారు. దీంతో ఏడాదికి రూ. 70 కోట్ల ఇంధనం ఆదా అవుతుందని వారు వివరించారు.

బాలిక మృతి కేసులో పోలీసు అధికారి అరెస్టు

జమ్ము : ఖతువాలో జరిగిన బాలిక కిడ్నాప్,హత్యకేసులో ప్రత్యేక పోలీసు అధికారి(ఎస్‌పీవో)దీపక్ ఖజూరియాని అరెస్టు చేశామని జమ్ముకాశ్మీర్ నేర పరిశోధనా విభాగపు పోలీసులు శనివారం వెల్లడించారు. బాలిక (8) ఆచూకీ గల్లంతైన వారం తర్వాత ఆమె మృత దేహాన్ని రస్సన్న అడవిలో స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై అసెంబ్లీ అట్టుడికిపోయింది. జనవరి 23న ఈ కేసును నేరపరిశోధనా విభాగానికి బదిలీ చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో అరెస్టయిన వారి సంఖ్య రెండుకు పెరిగింది. అంతకుముందు ఆమెపై అత్యాచారానికి ప్రయత్నించగా, నిరోధించిన బాలికను చంపివేశాడని 15 ఏళ్ల యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.

లోయా పిల్‌పై విచారణకు మహా నో

న్యూఢిల్లీ : ప్రత్యేక సీబీఐ జడ్జి బీహెచ్‌లోయా అనుమానాస్పద మృతిపై సుప్రీంకోర్టు విచారణను మహారాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. ఎల్లో జర్నలిజంలో భాగాంగా దీనిని నిర్వర్తిస్తున్నారని విమర్శించింది. సోహ్రాబుద్దీన్ ఎన్ కౌంటర్‌కేసు విచారణ సాగుతుండగా, 2014, డిసెంబరు 1న సహ ఉద్యోగి కుమార్తె పెళ్లికి వస్తూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఇప్పటికే వాంగ్మూలాలను నలుగురు న్యాయాధికారులు నమోదు చేశారనీ, వారిని విశ్వసించడమో లేదా వారంతా అబద్ధం చెబుతున్నారని న్యాయస్థానం ప్రకటించడమో జరగాలని మహారాష్ట్ర తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోరారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఎదుట ఆయన వాదనలు వినిపించారు.

ఎన్నికల బరిలో.. సోదరులే ప్రత్యర్థులు

అగర్తలా : వేర్వేరు ప్రధాన రాజకీయ పార్టీల ప్రత్యర్థులుగా ఇద్దరు సోదరులు ఎన్నికల్లో పోటీ చేస్తున్న త్రిపుర ఎన్నికల్లో చోటుచేసుకుంది. త్రిపుర కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యవసాయ శాఖ మాజీమంత్రి మన్సూర్ అలీ పెద్దకుమారుడైన బహరుల్ ఇస్లాం బుక్సానగర్ అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. బహరుల్ ఇస్లాం తమ్ముడు ముజిబర్ ఇస్లాం సోనామురా అక్కడి నుంచే కాంగ్రెస్ పార్టీ టికెట్టుపై ఎన్నికల బరిలోకి దిగారు. ముజిబర్ విద్యార్థి దశ నుంచే ఎన్ఎస్ యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారు. తమ రాజకీయ సిద్ధాంతాలు, పార్టీలు వేరైనా అవి తమ మధ్య ఉన్న వ్యక్తిగత కుటుంబ బంధాన్ని మాత్రం ప్రభావితం చేయవని సోదరులిద్దరూ చెపుతున్నారు.

కాంట్రాక్టుల కోసం భారీ ముడుపులు

అమెరికా కంపెనీ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులపై సీబీఐ కేసు

న్యూఢిల్లీ : అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న ఓ కంపెనీ సీడీఎం, ఎన్‌హెచ్‌ఏఐకు సంబంధించిన గుర్తు తెలియని కొంతమంది అధికారులపై సీబీఐ కేసు నమోదు చేసింది. కాంట్రాక్టులు పొందడానికిగాను రూ.1.18 బిలియన్ డాలర్లకు పైగా ముడుపులు చెల్లిం చారన్న ఆరోపణలపై ఈ కేసు దాఖలైంది. ఈ విషయాన్ని సీబీఐ అధికారులు శనివారం తెలిపారు. బెంగళూరు, చెన్నైలలో గల సీడీఎం స్మిత్ కార్యాలయా లపై సీబీఐ దాడులు చేసింది. తనిఖీలు నిర్వహించింది. దీనితోపాటు అప్పటి కంపెనీ డైరెక్టరు గోపకుమార్ నివాసంలోనూ పెద్దఎత్తున తనిఖీలు నిర్వహించినట్టు అధికారులు వివరించారు. అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న కంపెనీకి భారత్‌లో ఓ అనుబంధ కంపెనీ సీడీఎం స్మిత్ ఉన్నది. దీనిపేరు సీడీఎం స్మిత్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్. ఇది బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్నది. దీనికి గోపకుమార్ డైరెక్టరుగా పని చేస్తున్నారు. ఈ కంపెనీపైనా, ఆర్‌వీ ఇన్‌ఫ్రా సొల్యూ షన్స్ మేనేజరు ఎస్.కృష్ణమూర్తి, కంపెనీకి చెందిన ఇతర గుర్తు తెలియని అధికారులపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు పీకల్లోతు ఇరుక్కుపోయారు. కాంట్రాక్టులు పొందేందుకు ముడుపులు ఇచ్చిపుచ్చు కున్నట్టు ప్రాథమిక దర్యాప్తులో స్పష్టం కావడంతో సీబీఐ అధికారులు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగారు. 2011- 2016 మధ్యకాలంలో కాంట్రాక్టులు పొంద డానికి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సీడీఎం స్మిత్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి 1.18 మిలియన్ డాలర్లు ముడుపులుగా తీసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయని అధికారులు తెలిపారు. లంచాల ద్వారా తమ అక్రమ పనులను కప్పిపుచ్చుకున్నారన్నది ఆరోపణ. ఈ కేసులో గోపకుమార్‌ను కీలక నిందితుడిగా సీబీఐ భావిస్తోంది.

ఔరంగజేబు.. ఓ ఉగ్రవాది

బీజేపీ ఎంపీ మహేష్ గిరి



న్యూఢిల్లీ : మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ ఓ ఉగ్రవాది అంటూ బీజేపీ ఎంపీ మహేష్ గిరీ వివాదా స్పద వ్యాఖ్యలు చేశారు. ఔరంగజేబ్ సోదరుడు దారా షికో మాత్రం ఓ మేధావని, ఆయన మతవిశ్వాసాలు, విలు వలు చాలా గొప్పవని అభివర్ణించారు. సికో జీవితం గురించి అందరికీ తెలియజేయాలన్నారు. ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ)లో 'దారా షికో.. మరిచిన యువరాజు' పేరిట నిర్వహించిన ఎగ్జిబిషన్ ను తిలకించారు. 'ఔరంగజేబ్ & దారా షికో : ఇద్దరు సోదరుల గాథ' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొ న్నారు. గిరీ మాట్లాడుతూ 'నేటి పరిభాషలో ఔరంగజేబ్ ఒక ఉగ్రవాది. అతనికి పడాల్సిన శిక్ష పడలేదు... కానీ అతని పేరుమీదున్న రోడ్డు పేరును మార్చడం సంతోషకరం. ఔరంగజేబ్ రోడ్ అన్న పేరు చూసినప్పుడల్లా నాకు చాలా నొప్పికలిగేది. అతనో క్రూరమైన చక్రవర్తి' అని అన్నారు. ల్యూటెన్స్ ఢిల్లీలోని ఔరంగజేబ్ రోడ్డుకు డా॥ఏపీజే అబ్దుల్ కలామ్ రోడ్డుగా 2015లో పేరుమార్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ 'ఔరంగజేబ్ రోడ్డు పేరును మార్చాలన్న న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయాన్ని ముస్లింలు వ్యతిరేకిం చారు. ఈ చర్య చరిత్రను వక్రీకరించే యత్నంగా పేర్కొన్నారు' అని చెప్పారు. కాగా, దారా షికో జీవితంపై మొఘల్ శైలిలో గీసిన 30 చిత్రాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. ఈ ప్రదర్శన ఆదివారంతో ముగియనుంది.



యుద్ధమే... మరో అవకాశం లేదు

పాక్ ఉగ్రవాదానికి ముగింపు పలకాలి
లేని పక్షంలో యుద్ధంతోనే సమాధానం చెబుతాం
పాక్‌ను హెచ్చరించిన ఫరూఖ్ అబ్దుల్లా

శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్‌లో నిత్యం పాకిస్థాన్ ఉగ్రమూకలు దాడులకు తెగబడటంపై నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, ఆ రాష్ట్ర మాజీ సీఎం ఫరూఖ్ అబ్దుల్లా తీవ్రంగా స్పందించారు. ఉగ్రవాదానికి ముగింపు పలకపోతే పాక్ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ఉగ్రవాద శక్తులను ప్రోత్సహించడం, వారికి ఆశ్రయమిస్తూ భారత్‌పై దాడులు ఇలాగే కొనసాగిస్తే పాక్‌పై యుద్ధం తప్ప మనకు మరో ఆప్షన్ లేదన్నారు. శనివారం తెల్లవారుజామున సంజ్వాన్‌లోని ఆర్మీ శిబిరంపైనే పాక్ ఉగ్రవాదుల కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఫరూఖ్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడారు. పాక్ రోజూ జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడులకు పాల్పడుతోందని, అసలు దాయాది ఉగ్రవాదులు భారత్‌పై దాడులు చేయని రోజే లేదని ఫరూఖ్ అబ్దుల్లా మండిపడ్డారు. భారత్ నుంచి కేవలం శాంతిని మాత్రమే కోరుకున్నట్లయితే పాక్ ఉగ్రవా దానికి ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. లేనిపక్షంలో భారత్ నుంచి యుద్ధమే సమాధానం అవుతుందని పేర్కొన్నారు. భారత్‌తో సంబంధాలు మెరుగు చేసుకోవాలంటే పాక్ తన వైఖరిని మార్చుకుని, ఉగ్రవాదానికి దూరంగా ఉండటమే ఉత్తమమని చెప్పారు.. యుద్ధం వల్ల రెండు దేశాలకూ తీవ్ర నష్టం వాటిల్లుతుందని, కానీ పాక్ చర్యల వల్ల యుద్ధ వాతావరణం నెలకొంటుందన్నారు.

అబద్ధాల పుట్ట జైట్లీ

రాహుల్‌గాంధీ నిశిత విమర్శ



న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తీవ్రంగా నిందించారు. అరుణ్‌జైట్లీ అబద్ధాలకోరని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి నిలయమైన పార్లమెంటునే జైట్లీ అబద్ధాలతో తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. యూపీఏ ప్రభుత్వం రక్షణ కొనుగోళ్ల వివరాలను వెల్లడించడానికి 15 సార్లు నిరాకరించిందని గురువారం పార్లమెంటు సాక్షిగా జైట్లీ అసత్యాలు మాట్లాడారని రాహుల్‌గాంధీ శనివారం ఆరోపించారు. సుఖోయ్, మిరేజ్ 2000 యుద్ధవిమానాలు వంటి భారీ రక్షణ కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను యూపీఏ ప్రభుత్వం మూడుసార్లు పార్లమెంటుకు వివరించిందని సోదా హరణగా తెలిపారు. 'రక్షణ పరికరాల కొనుగోళ్ల ధరలను యూపీఏ ప్రభుత్వం ఏనాడు వెల్లడించలేదని మీరు చెప్పారు. మీరు ఉద్దేశపూర్వకంగానే సభను తప్పుదారి పట్టించారు. ధరలపై పూర్తి పారదర్శకతతో మూడుసార్లు యూపీఏ ప్రభుత్వం పార్లమెంటుకు వివరించింది. దీనిని విస్మరిస్తే ఎలా?' అని రాహుల్‌గాంధీ జైట్లీని తూర్పారబట్టారు. బీజేపీ ప్రభుత్వం ఎంత ఎదురుదాడి చేసినా రూ.58 వేల కోట్ల విలువైన రాఫెల్ ఒప్పందంలో అక్రమాలను తాము ఎత్తిచూపుతామని, ప్రజలకు వివరిస్తామని రాహుల్ స్పష్టం చేశారు. ఈ మేరకు రాహుల్ వరుస ట్వీట్లు వదిలారు. ఒక్కో రాఫెల్ జెట్ విమానం విలువ ఎంతో భారతదేశానికి వెల్లడించాలని రక్షణ మంత్రిని అడుగుతున్నానని రాహుల్ ట్వీట్ చేశారు. రాఫెల్ ఒప్పందంలో అక్రమాలు, అవకతవకలు జరిగినందునే స్పష్టమైన లెక్కలు చెప్పడానికి మోడీ ప్రభుత్వం భయపడుతోందని రాహుల్ అన్నారు.

కర్ణాటక నుంచి రాహుల్ ప్రచారం

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కర్ణాటకలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఉదయం బళ్లారి సమీపంలో విమానం దిగిన రాహుల్.. అక్కడి నుంచి 'జు అర్ దై' పేరుతో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. 19 ఏళ్ల క్రితం ఆయన తల్లి సోనియా గాంధీ కూడా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కర్ణాటకలోని ఇదే స్థానం నుంచి ప్రచారం ప్రారంభించారు. 1999 సాధారణ ఎన్నికల్లో బళ్లారి నుంచి పోటీ చేసిన సోనియాగాంధీ బీజేపీ తరపున పోటీ చేసిన సుష్మాస్వరాజ్‌ను ఓడించారు. నాడు సోనియా గాంధీ విజయవంతంగా ఎస్ఎం కృష్ణ నేతృత్వంలో కర్ణాటకలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తేగలిగారు. కానీ, కేంద్రంలో వాజ్‌పేయి చేతిలో ఓటమి చవిచూశారు. ఏప్రిల్‌లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాహుల్ బళ్లారి నుంచే ప్రచారం ప్రారంభిం చాలని నిర్ణయించారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. వచ్చే ఎన్నికల్లో కూడా రాష్ట్రంలో ఘన విజయం సాధించాలని కాంగ్రెస్ భావిస్తోంది. రాహుల్ కర్ణాటకలో మూడు రోజుల ప్రచారంలో భాగంగా పలు దేవాలయాలు, దర్గాలు సందర్శించనున్నారు. కొప్పాల్‌లోని హులిగమ్మ దేవాలయం, గావి సిద్ధేశ్వర మఠం సందర్శిస్తారు. అలాగే సోమవారం కలబురగి లోని ఖ్వాజా బండే నవాజ్ దర్గాకు వెళ్లనున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా రోడ్ షోలు, సభలు, సమావేశాలు, ప్రత్యేకంగా రైతులకు సంబంధించి సమావేశాలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

మళ్లీ తెరపైకి 2జీ స్కామ్

న్యూఢిల్లీ : దేశంలో అతిపెద్ద కుంభకోణంగా పేరొందిన 2జీ కుంభకోణం అంశం మళ్లీ తెరపైకి వచ్చేసింది. ఈ కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టు నిందితులను నిర్దోషులుగా ప్రకటించిన విషయం తెలిసిందే. తీర్పుపై సుప్రీంకోర్టులో అభ్యర్థన పిటిషన్ దాఖలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు సీబీఐ, ఈడీలకు పిటిషన్ దాఖలు చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతేకాదు కేసులో వాదనలు వినిపించేందుకు అదనపు సొలిసిటర్ జనరల్ 'తుషార్ మెహతా' పేరును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రతిపాదించింది. దీంతో ప్రస్తుతం ఈ కేసులో వాదనలు వినిపిస్తున్న ఆనంద్ గ్రోవర్ను స్థానంలో మెహతా నియమితులయ్యారన్న మాట. ఈ మేరకు ఓ గెజిట్ నోటిఫికేషన్‌ను కేంద్రం ఇటీవల విడుదల చేసింది. ఫిబ్రవరి 19న సీబీఐ పిటిషన్‌ను దాఖలు చేసే అవకాశం ఉంది. కాగా, సీబీఐ సరైన సాక్ష్యాలు సమర్పించకపోవడంతో 2జీ కుంభకోణంలో రాజా, కనిమొళి(కరుణానిధి కూతురు)తో సహా 17 మందిని నిర్దోషులుగా పేర్కొంటూ సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించిన విషయం విదితమే. తీర్పు అనంతరం సీబీఐ, ఈడీ విభాగాలపై తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. ఈ తీర్పుతో సీబీఐ పరువును, ప్రజల నమ్మకాన్ని పోగొట్టుకుందన్న అభిప్రాయం వ్యక్తమైంది.

మెహతా సరైనోడు.. :

2008లో గుజరాత్ ప్రభుత్వానికి అదనపు అడ్వొకేట్ జనరల్‌గా ఆయన పని చేశారు. ఆపై కేంద్రం ఆయన్ని 2014లో అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమించింది. కేసు ఎలాంటిదైనా సరే ముఖ్యమైన పాయింట్లతో ఆయన వాదనలు వినిపిస్తారనే పేరుంది. [illegible] పేరున్న ఆయన సరైన వ్యక్తని కేంద్రం నిర్ణయించింది.

తెలుగును ప్రపంచ భాష చేద్దాం



విశాలాంధ్ర - ఘంటశాల : తెలుగు భాషను ప్రపంచ భాషగా చేయాల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సంస్కృతీ సమితి, పర్యాటకశాఖ, దేవదాయ ధర్మదాయశాఖ, దివి ఐతిహాసిక మండలి ఆధ్వర్యంలో శనివారం కృష్ణాజిల్లా ఘంటశాలలో తెలుగు భాషా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను వెంకటరమణ దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ముందు తెలుగు మాట్లాడినప్పుడే మాతృ భాష మీద పట్టు వస్తుందన్నారు. తొలుత ఆలయ సహాయ కమిషనర్ ఎం శారదాకుమారి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆంధ్రమహావిష్ణువుకు అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ బుద్ధప్రసాద్, సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సంస్కృతి సమితి ముఖ్యకార్యనిర్వహణ అధికారి డాక్టర్ డీ విజయభాస్కర్, ఆచార్య గార్లపాటి ఉమామహేశ్వరరావు, కలెక్టర్ లక్ష్మీకాంతం, ఆర్‌డీఓ ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

గిరిజన బాలికల కోసం విశాఖ ఎక్స్‌ప్రెస్ సైకిల్ యాత్ర



విశాలాంధ్ర - నందిగామ : విశాఖపట్నం సమీపంలోని 130 మంది గిరిజన బాలికల విద్యావసరాల కోసం 'గ్లోబల్ ఎయిడ్' ఎన్‌జీఓ సంస్థకు ఆర్థిక సహకారం అందించేందుకు హైదరాబాదు నుంచి విశాఖకు 13 మంది సభ్యులతో కూడిన విశాఖ ఎక్స్‌ప్రెస్ సైకిల్ యాత్ర శనివారం ఉదయం కృష్ణాజిల్లా నందిగామకు చేరుకుంది. రైతుపేటలోని శ్రీ రామకృష్ణ ప్లాజా వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ నందిగామ భవ్య, లయన్స్ క్లబ్ ఆఫ్ నందిగామ సభ్యులు ఘనస్వాగతం పలికారు. కేవీఆర్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ యర్రంరెడ్డి గాంధీ బృందానికి అల్పాహార ఆతిథ్యం ఇచ్చారు. యర్రంరెడ్డి గాంధీ మాట్లాడుతూ గత ఏడాది ఈ బృందం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు సైకిల్ యాత్ర ద్వారా రూ. 3 లక్షల విరాళాలు సేకరించామన్నారు. ఈ సంవత్సరం మిత్రులు, పలు సంస్థలు రూ. 6 లక్షల విరాళాలు అందజేసినట్లు బృందం సభ్యుడు యలమంచిలి శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు టీ సీతారామయ్య, ఆర్ ఎల్. నరసింహారావు, ఎన్. సాంబశివరావు పాల్గొన్నారు.



ప్రత్యేక హోదా సాధనకు
పవన్ నాయకత్వం సరిపోదు

విశాలాంధ్రబ్యూరో - తిరుపతి : రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేందుకు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నాయకత్వం సరిపోదని రాష్ట్ర మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. ప్రత్యేక హోదా సాధన కోసం పవన్ జేఏసీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రచారం కొనసాగుతున్న నేపథ్యంలో శనివారం తిరుపతిలో బలిజల ఆత్మీయ కలయికలో ఆయన పై విధంగా వ్యాఖ్యానించారు. కాపుల అభివృద్ధి కోసం ప్రభుత్వంతో పోరాడేందుకు పవన్‌కళ్యాణ్ ముందుకు వస్తే ఆయనకు బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి బీసీ సర్టిఫికెట్ పొందినప్పుడే కాపులకు పండుగ అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని చంద్రబాబు త్రికరణ శుద్ధిగా అమలు చేయాలన్నారు. చంద్రబాబు హామీని నెరవేర్చకపోతే సరైన సమయంలో ఉద్యమం ద్వారా తగిన గుణపాఠం చెబుతామని పద్మనాభం హెచ్చరించారు. మార్చి చివరి వరకు మాత్రమే ముఖ్యమంత్రికి డెడ్ లైన్ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో పోకల అశోక్‌కుమార్‌తోపాటు కాపు రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

పోర్టు రామాయపట్నమేనా !

- దుగరాజపట్నంలో కుదరదని తేల్చిన కేంద్రం
- ప్రత్యామ్నాయంపై సర్వత్రా చర్చ



విశాలాంధ్రబ్యూరో - నెల్లూరు : రాష్ట్రంలో మరో పోర్టు నిర్మాణానికి దుగరాజపట్నం అనుకూలం కాదని కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన నేపథ్యంలో ప్రత్యామ్నాయం పై తీవ్ర చర్చ సాగుతోంది. రాష్ట్ర విభజన తర్వాత నెల్లూరు జిల్లాలో పోర్టు నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాయి. పోర్టు ఏర్పాటుకు అనుమతిచ్చినప్పటికీ ఎక్కడ నిర్మించాలనే దానిపై ఏళ్ల తరబడి సందిగ్ధత నెలకొంది. నెల్లూరు జిల్లా దుగరాజపట్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో అన్నిటికీ అనువైన రామాయపట్నంలో ఏర్పాటు చేయాలంటూ సీపీఐ, వైసీపీ, ప్రజా సంఘాలు వివిధ రూపాల్లో ప్రత్యక్ష ఆందోళనలు నిర్వహించాయి. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరగడంతో వామపక్షాల పిలుపుతో రాష్ట్ర ప్రజలు సంపూర్ణ బంద్ నిర్వహించి మోడీకి హెచ్చరిక జారీ చేశారు. ఈ క్రమంలో ప్రత్యేక హోదా అంశంపై పాతమాటే పాడిన కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ కొన్ని పనులను మాత్రం వేగవంతం చేస్తామని ప్రకటించారు. దుగరాజపట్నంలో పోర్టునిర్మాణానికి ఇస్రో అడ్డుచెప్పిందని, ఏపీ ప్రభుత్వం మరో ప్రాంతాన్ని ఎంపిక చేస్తే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రత్యామ్నాయం రామాయపట్నమే అనే చర్చ సాగుతోంది. దుగరాజపట్నానికి మొదట్లోనే సాంకేతిక అవాంతరాలు ఏర్పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం పున:పరిశీలనకు మరో నివేదిక పంపింది. ఇస్రో నిర్ణయంతో దానికి బ్రేక్ పడింది. జిల్లాలోని కృష్ణపట్నం పోర్టుకు సమీపంలోనే దుగరాజపట్నం ఉంది. రాకెట్ ప్రయోగ కేంద్రం శ్రీహరికోట అతి దగ్గరలోనే ఈ ప్రాంతం ఉంది. సముద్రమార్గం ద్వారా ఇంకా దగ్గర. పోర్టుకు నిత్యం నౌకలు, పడవలు, ఇతర వాహనాలతో సరకు రవాణా రద్దీగా ఉంటుంది. ఆగంతకులు ఆ మార్గం ద్వారా షార్‌లోకి చొరబడే అవకాశం ఉన్నందున భద్రత దృష్ట్యా ఇదే జిల్లాలో మరో పోర్టు అవసరం లేదని గతంలో కేంద్ర కమిటీ నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని పోర్టుకు బ్రేక్ పడింది. రామాయపట్నం ప్రకాశం జిల్లాలో ఉన్నప్పటికీ నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దు ప్రాంతం. రెండు జిల్లాల ప్రజలతోపాటు గుంటూరు, కృష్ణాజిల్లాలకు మేలు జరుగుతుందనే వాదన ఉంది. రెండు ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్న వాదన ఉంది. కావలి సమీపంలోని రామాయపట్నంలోనే పోర్టు నిర్మించాలంటూ కావలి కేంద్రంగా కమ్యూనిస్టు పార్టీ, ప్రజాసంఘాలు, వైసీపీ కలిసి పోర్టు సాధన సమితిగా పోరాటాలు నిర్వహించారు. గత ఏడాది కావలి నుంచి రామాయపట్నం వరకు పాదయాత్ర, ర్యాలీల ద్వారా ప్రజలను చైతన్యం చేశారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ ప్రకటన కాస్త ఊరటనిచ్చినట్లయింది.

అప్పులు చుట్టుముట్టి
కౌలురైతు ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర - నాదెండ్ల : వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ కౌలు రైతు పురుగులమందు తాగి ఆత్మహత్యానికి పాల్పడిన ఘటన శనివారం గుంటూరు జిల్లా నాదెండ్ల మండలంలో చోటుచేసుకుంది. ప్రస్తుతం రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నాదెండ్ల మండలంలోని సంక్రాంతిపాడు గ్రామానికి చెందిన మామిళ్లపల్లి నాగేశ్వరరావుకు 1.5 ఎకరాల సొంత భూమి ఉంది. మరో 25 ఎకరాల వరకు కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి, జూట్, అపరాలు సాగు చేస్తున్నాడు. దీంతోపాటు రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసి మిల్లులకు సరఫరా చేస్తున్నాడు. నాలుగేళ్లుగా వ్యవసాయంలో భారీ నష్టాలు వస్తున్నాయి. పత్తికి గులాబీరంగు పురుగు సోకడంతో దిగుబడి తగ్గిపోయింది. జూట్, శనగ ధరల పతనంతో తీవ్రంగా నష్టపోయాడు. సుమారు రూ.50 లక్షల వరకూ అప్పులు చేసినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ క్రమంలో అప్పులిచ్చిన వారి ఒత్తిడి పెరగడంతో తీర్చే మార్గం లేక కొంత కాలం నుంచి ఆందోళనలో పడినట్టు తెలుస్తోంది. శుక్రవారం ఉదయం పొలం వెళ్లిన నాగేశ్వరరావు వెంటతీసుకెళ్లిన పురుగుమందు తాగేశాడు. తోటి రైతులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. హుటాహుటిన చికిత్స కోసం నాగేశ్వరరావును నరసరావుపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించడంతో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.

కొత్త నటీనటులతో 'కళ్యాణం కమనీయం'



విశాలాంధ్ర - సోంపేట : శ్రీకాకుళం జిల్లా సోంపేట పట్టణంలో శనివారం కొత్త సినిమా షూటింగ్ ప్రారంభమైంది. శ్రీచీకటి సోమ పోలమాంబ అమ్మవారి ఆశీస్సులతో పూజల అనంతరం మూహూర్తపు షాట్‌ను ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ ఎమ్మెల్యే అశోక్ ప్రారంభించారు. స్థానిక ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు కెమెరా స్విచ్ వేయగా, జెడ్పీటీసీ సూరాడ చంద్రమోహన్ స్క్రిప్ట్ ఓపెన్ చేశారు. 'కళ్యాణం కమనీయం' టైటిల్‌తో రహే ఆర్ట్స్ బ్యానర్‌పై హేబంబర్‌రెడ్డి నిర్మాణ సారథ్యంలో కళ్యాణ్ దర్శకత్వంలో ఈ చిత్రం నిర్మిస్తున్నారు. బీసీ సంక్షేమ వసతి గృహం అధికారి కుమార్‌నాయక్ సమన్వయంతో ముందుకు సాగుతున్న ఈ చిత్రం సరికొత్త ప్రేమకావ్యమని దర్శకుడు కళ్యాణ్ పేర్కొన్నారు. సోంపేటతో పాటు పరిసర ప్రాంతాల్లోని బీచ్ ఏరియాల్లో కొంత భాగం చిత్రీకరిస్తామన్నారు. హైదరాబాద్ పరిసరాలతోపాటు ఒడిశా రాష్ట్రంలోని మహేంద్రగిరి, చంద్రగిరి ప్రాంతాల్లోని బౌద్ధుల నివాస ప్రాంతాల్లో చిత్ర నిర్మాణం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కవిటి జెడ్పీటీసీ సభ్యుడు బెందాళం రమేష్, ఇచ్ఛాపురం ఏఎంసీ చైర్మన్ సీపాన వెంకటరమణ పాల్గొన్నారు.

రావణ వాహనంపై మల్లన్న

విశాలాంధ్ర - శ్రీశైలం : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శనివారం సాయంత్రం శ్రీశైల మల్లన్న రావణవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ రాజగోపురం వద్ద ప్రత్యేక వేదికపై స్వామివార్ల ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేసిన తర్వాత పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీశైలం బ్రహ్మోత్సవాల్లో అయిదో రోజు పుష్పాలంకరణతో రావణ వాహనంపై శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల ఉత్సవ మూర్తులు దర్శనమిచ్చారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నారాయణ భరత్‌గుప్త ముందుకు నడిపారు. స్వామి అమ్మవార్ల గ్రామోత్సవానికి ప్రజలు తరలివచ్చారు. కోలాటాలు, గిరిజన నృత్యాలతో సందడిగా మారింది.

12న యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సు



విశాలాంధ్ర - గుంటూరు (జిల్లాపరిషత్) : యూనివర్సిటీల్లో వెలుగు చూస్తున్న పరిణామాలు, విద్యార్థుల సమస్యలపై ఈ నెల 12వ తేదీన గుంటూరులో యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గనిరాజు తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో కార్యా లయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అరండల్‌పేటలోని వైన్ డీలర్స్ కళ్యాణ మండపంలో జరిగే సదస్సులో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ అబ్దుల్‌నూర్ బాషా, పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రమాసుందరి ప్రసంగిస్తార న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు అనుసరిస్తున్న విధానాలతో విద్యా రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని, విశ్వవిద్యాలయాలు సమస్యలతో సతమ తం అవుతున్నాయన్నారు. సదస్సు గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఝాన్సీ, ప్రకృతి పాల్గొన్నారు.



సద్గుణాలే బౌద్ధ ధర్మ సారం

మహా సమ్మేళనంలో బౌద్ధ భిక్షువులు

విశాలాంధ్ర- తిరుపతి : మంచి ఆలోచన, మనసు, ఆచరణతో జీవించడమే బుద్ధుడు ప్రవచించిన ధర్మ సూత్రాల సారాంశమని బౌద్ధ భిక్షువులు అన్నారు. తిరుపతి వేదికగా శనివారం రాష్ట్ర స్థాయి బౌద్ధ సమ్మేళనంలో బౌద్ధ భిక్షువులు సంఘపాల బంతీజీ, అనాలియో బంతీజీ బౌద్ధ ధర్మ ప్రవచనాలు చేశారు. మనిషికి మనో నిగ్రహం లేకపోవడం వల్లే దుఃఖం కలుగుతోందన్నారు. మనసును అదుపులో పెట్టుకోగలిగితే దుర్గుణాలు దరి చేరబోవన్నారు. మనసును ఎప్పటికప్పుడు పరిశుద్ధి చేసుకోవటం ద్వారానే సన్మార్గంలో నడవగలమన్నారు. అంతఃశుద్ధి కోసం బుద్ధుడు ప్రత్యేకంగా ఎలాంటి ప్రక్రియ సూచించలేదని, జాగరూకతతో జీవించడమే ఉత్తమ మార్గమని ఉపదేశించారు. భారత్‌లో వేళ్లూనుకున్న కుల వ్యవస్థకు బౌద్ధమే పరిష్కారమని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఆంజనేయరెడ్డి అన్నారు. కుల వ్యవస్థ, అంటరానితనం నిర్మూలనకు వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న ప్రయత్నాలు విఫలయ్యాయని, దీనిపై 30 ఏళ్ల అధ్యయనం అనంతరం అంబేద్కర్ కూడా బౌద్ధమే పరిష్కారంగా గుర్తించారన్నారు. అందుకే ఆయన బౌద్ధాన్ని స్వీకరించారని, అంబేద్కర్‌వాదులు ఎవరైనా బౌద్ధాన్ని స్వీకరించాలని పిలుపునిచ్చారు. బౌద్ధమే నిజమైన భారతీయ సంస్కృతి అని పేర్కొన్నారు. యువ మహిళా అడ్వొకేట్ ఎం.గౌతమి మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని స్వేచ్ఛ సమానత్వం, సౌభ్రాతృత్వం, సమన్యాయాన్ని బుద్ధుని ధర్మసూత్రాల నుండే అంబేద్కర్ స్వీకరించారని చెప్పారు. చిత్తూరు జిల్లా రచయితల సంఘం నాయకులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంట్లో బుద్ధుని ధర్మానికి సంబంధించిన పుస్తకాలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఇప్పటికీ బౌద్ధ ఆచారాలు కొనసాగుతున్నాయని ఉపాసకులు శీలం ప్రభాకర్ వివరించారు. బుద్ధిస్టు సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎన్.ఆర్.భూపతి అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో విశ్రాంత న్యాయమూర్తి డి.గుర్రప్ప, సమ్మేళనం కో కన్వీనర్ దినకరమూర్తి, డాక్టర్ భాస్కర్‌రావు, ధర్మారావు, సీనియర్ జర్నలిస్టు ఎం.నాగరాజ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వారంలో జర్నలిస్టుల గృహాలపై స్పష్టత

- జర్నలిస్టుల హౌసింగ్ కోసం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు
- సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు



విశాలాంధ్ర- రాజమహేంద్రవరం సిటీ : రాష్ట్రంలో జర్నలిస్టులకు గృహ నిర్మాణాలపై వారం రోజుల్లో విధాన నిర్ణయం వెల్లడించనున్నట్లు రాష్ట్ర సమాచార, గృహనిర్మాణశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు వెల్లడించారు. జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణాలకు ప్రత్యేక నిధిని బడ్జెట్‌లో ప్రవేశపెట్టాలనే అంశంపై కసరత్తు జరుగుతుందన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆర్‌అండ్ బీ అతిథి గృహంలో మంత్రి శ్రీనివాసులును ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయుడబ్ల్యూజే) రాష్ట్ర ఉపాధ్యక్షులు మండెల శ్రీరామమూర్తితోపాటు మరికొందరు కలిశారు. ట్రిబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం, అక్రిడిటేషన్ల మంజూరు తదితర అంశాలకు సంబంధించి చర్చలో మంత్రి శ్రీనివాసులు స్పందిస్తూ వారం రోజుల్లో జర్నలిస్టుల హౌసింగ్‌పై విధివిధానాలు ప్రకటిస్తామన్నారు. అమరావతిని, జిల్లాలను కలిపి ఒకే విధానం అమలుచేయాలా, జిల్లాలకు ప్రత్యేకం చేయాలా అన్న అంశంపై కసరత్తు తుది దశకు చేరుకుందన్నారు. తొలుత జిల్లాలు, నియోజకవర్గాల కేంద్రాలు, మండలాల జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ ప్రకటించాలని భావిస్తున్నామన్నారు. అపార్ట్‌మెంట్ తరహాలో ఇళ్ల నిర్మాణం చేపట్టి జర్నలిస్ట్‌కు తన వాటా మొత్తాన్ని బ్యాంకు రుణం ఇప్పించడం, వ్యయంలో కొంత సబ్సిడీ ఇవ్వాలనే అంశంపై చర్చలు కొనసాగుతున్నాయన్నారు. బడ్జెట్‌లో రూ.200 కోట్ల నిధులను జర్నలిస్టుల హౌసింగ్ కోసం ప్రత్యేకంగా కేటాయించాలనే ఆలోచన ఉందన్నారు. గతంలో జర్నలిస్టుల కోటాలో ఇళ్లస్థలాలు పొందిన వారికి ప్రభుత్వం తరఫున సబ్సిడీ రుణం అందించి ఇళ్ళు నిర్మించుకునే అవకాశం కల్పించే అవకాశం ఉందన్నారు. వీటన్నింటికీ విధివిధానాల రూపకల్పన తుదిదశకు చేరుకుందన్నారు. అక్రిడిటేషన్ల నియమ నిబంధనల విషయంలో కసరత్తు పూర్తి అవుతున్నందున త్వరలోనే ఉత్తర్వులు జారీ అవుతాయన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జీఏ భూషణ్ బాబు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా గౌరవాధ్యక్షులు కె. పార్థసారథి ఉన్నారు. ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, మేయర్ పంతం రజనీశేషసాయి, ఎమ్మెల్సీ అప్పారావు పాల్గొన్నారు.

దళిత సాహిత్యానికి గౌరవం తెస్తాం

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు



విశాలాంధ్ర - ఏఎన్‌యూ (గుంటూరు) : సమాజంలో దళిత సాహిత్యానికి విలువలతో కూడిన గుర్తింపు, గౌరవం తెస్తామని రాష్ట్ర సాంఘిక గిరిజన సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ డైక్‌మన్ ఆడిటోరియంలో 'అడుగు సామాజిక వేదిక' ఆధ్వర్యంలో శనివారం మద్దూరి నగేష్‌బాబు జాతీయ విశిష్ట సాహిత్య పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ప్రముఖ కవి గోరటి వెంకన్నకు పురస్కారాన్ని ఆనంద్‌బాబుతోపాటు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ, ఉపకులపతి ఆచార్య రాజేంద్రప్రసాద్ అందజేశారు. ప్రముఖ సాహితీవేత్త, బుద్ధిజం విభాగానికి చెందిన ఆచార్య సిహెచ్. స్వరూపరాణి అధ్యక్షత వహించిన సభలో మంత్రి ఆనందబాబు మాట్లాడుతూ సమాజంలో బడుగు, బలహీనవర్గాలుగా జీవనం కొనసాగిస్తున్న దళితులను మేల్కొలిపేలా నగేష్‌బాబు రచనలు ఉండేవన్నారు. దళిత అభ్యున్నతికి ఆ రచనలు ఎంతో తోడ్పాటు అందించాయన్నారు. సాహిత్య విలువలు ఉండేవని కొనియాడారు. దళిత సాహిత్యం, దళిత కళాకారులు, కవులు అంశాలతో కూడిన ప్రణాళిక రూపొందిస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అమలుకు కృషిచేస్తానన్నారు. కారెం శివాజీ మాట్లాడుతూ దళితులు రాస్తే దళిత సాహిత్యమని, అగ్రకులాలు రాస్తే ప్రజాసాహిత్యమని విడదీసి చూపటం నిజంగా బాధాకరమన్నారు. . దళిత సాహిత్యానికి గుర్తింపు లేకపోవటంవల్లే వెనుకబాటు వెంటాడుతోందన్నారు. వివక్షత వలనే దళిత సాహిత్యం వెలుగులోకి రాలేకపోతుందన్నారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధిలో తరచూ కుల ప్రస్తావన రావటం విచారకరమన్నారు. అంబేద్కర్ ఆశించిన ప్రజా స్వామ్యాన్ని నెలకొల్పటానికి కృషి చేస్తామన్నారు. ఆచార్య శిఖామణి, గుంటూరు రెవెన్యూ ఆఫీసర్ మద్దూరి విజయశ్రీ, సాహితీవేత్త డాక్టర్ కోయి కోటేశ్వరరావు, డా. పీపీ ఎస్‌పాల్ కుమార్, డా. జి.వి రత్నాకర్, వికాస ఉపాధ్యక్షులు బి.రాజశేఖర్ పాల్గొన్నారు.

58 ఎర్రచందనం దుంగల స్వాధీనం

విశాలాంధ్ర - చంద్రగిరి : తిరుపతిలో శనివారం రెండు టాస్క్‌ఫోర్స్ బృందాలు ఆకస్మిక దాడులతో 58 ఎర్ర చందనం దుంగలు, రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నాయి. కొన్ని లోడింగ్ పాయింట్ల వద్ద రోజూ పాదాల అడుగులను ఈ బృందాలు పరిశీలిస్తూ వచ్చాయి రెండు రోజుల క్రితం రెడ్డి కుంట లోడింగ్ పాయింట్ నుంచి కొందరు వ్యక్తులు వెళ్లడాన్ని గమనించి ఆ పరిసరాల్లోని నాలుగు పాయింట్ల వద్ద మాటు వేశారు. శనివారం ఉదయం 5.30 గంటల సమయంలో రెడ్డికుంట సమీపంలో భవన నిర్మాణానికి సామాగ్రి చేరవేసే నెపంతో సెంట్రింగ్ పలకల మాటున ఎర్రచందనం దుంగలు లోడ్ చేయడంతో ఆర్‌ఎస్‌ఐ విజయ్ నరసింహులు బృందంలోని డీఆర్‌ఓ శ్రీనివాస్, ఎఫ్ఎస్ఓ నాగరాజు అప్రమత్తమయ్యారు. టాస్క్ ఫోర్స్ సిబ్బందితో అక్కడకు చేరుకోవడ మన్రంతో గమనించిన స్మగ్లర్లు పారిపోతూ రాళ్లు విసురుతూ పారిపోయారు. స్మగ్లర్లు వదిలివెళ్లిన వాహనంలో 42 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. తిరుపతి జూపార్క్ రోడ్డులోని టూరిజం గెస్ట్‌హౌస్ వద్ద రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఏఆర్‌ఎస్‌ఐ లక్ష్మణ్ బృందంతో ఎర్రచందనం లోడ్ చేస్తున్నారన్న సమాచంతో దాడి చేయడంతో సుమారు 20 మందికి పైగా స్మగ్లర్లు వాహనం నుంచి పారిపోయారు. ఆ ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించడం తో వారం రోజులకు పైగా ఉపయోగించే కూరగాయలు, వంటకు కావాల్సిన పదార్థాలు, బియ్యం బస్తాలు, సెల్ ఫోన్, వేయింగ్ మిషన్, తవేరా వాహనం సహా 16 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ డీఎస్పీ హరినాథబాబు, ఆర్ఐ మురళి పరిశీలించారు.

దివ్యాంగుల రాజకీయ రిజర్వేషన్లపై అసెంబ్లీ తీర్మానం చేయాలి



విశాలాంధ్ర - మంగళగిరి : రాష్ట్ర జనాభాలో 20 లక్షలున్న దివ్యాంగులకు దామాషా ప్రకారం చట్టసభల్లో నాలుగు శాతం రిజర్వేషన్ల కల్పన కోసం శాసనసభలో తీర్మానం చేయాలని ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నీలా జోజిబాబు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో శనివారం దివ్యాంగుల రాజకీయ భేరి సభ జరిగింది. సభలో ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులకు ఎన్నిసీట్లు కేటాయిస్తారో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రతిపక్ష నేత జగన్ స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. దివ్యాంగులకు అన్ని రాజకీయ పార్టీలు ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానం కేటాయించాలన్నారు. దివ్యాంగులకు స్థానిక సంస్థల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పిస్తే 6,348 మంది ప్రజాప్రతినిధులుగా అవకాశం పొందుతారన్నారు. దివ్యాంగులు పింఛన్లు, ఇళ్లు, రేషన్‌కార్డులు ఇతర సంక్షేమ రంగాలతోపాటు రాజకీయ రంగంలోనూ ప్రాధాన్యత సాధించేలా ముందుకు సాగాలన్నారు. రూ.16వేల కోట్లు లోటు బడ్జెట్‌లోని రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు, విద్యా సంస్థలకు, ఆధ్యాత్మిక సంస్థలకు వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను [illegible] కట్టబెడుతున్నారు. [illegible] దివ్యాంగులకు పింఛన్లు రూ.1500కు పెంచకుండా కుంటిసాకులు వెదకడం శోచనీయమన్నారు. దివ్యాంగులకు కావాల్సింది రాయితీలు కాదని, రాజ్యాధికారంలో భాగస్వామ్యం అనే నినాదంతో మార్చి బడ్జెట్‌లో దివ్యాంగుల రాజకీయ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీ తీర్మానం చేయకపోతే ఏప్రిల్‌లో చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు దివ్యాంగుల రాజకీయ చైతన్యయాత్ర చేపడతామన్నారు. సభలో దళిత క్రిస్టియన్ మిషన్ డైరెక్టర్ కర్రా హెనోక్ బెంజిమన్, సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, ఆదివాసీ సంక్షేమ సంఘం [illegible] ప్రసాద్, దళిత నాయకులు [illegible]రుమంచి రామారావు తదితరులు పాల్గొన్నారు.

జూలై నాటికి తారకరామ ఎత్తిపోతల పూర్తి



విశాలాంధ్ర - గుడివాడ : జూలైనాటికి అరిపిరాల తారకరామ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఈ ప్రాంత రైతులను ఆదుకుంటామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. కృష్ణాజిల్లా నందివాడ మండలం అరిపిరాల వద్ద రూ. 890.30 లక్షలతో నిర్మించనున్న తారకరామ ఎత్తిపోతల పథకం పనులకు శనివారం మంత్రి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణాడెల్టాలో కాలువ శివారు ప్రాంత భూములకు కూడా సకాలంలో సాగునీరు అందిస్తామన్నారు. బుడమేరుపై అరిపిరాల వద్ద చేపట్టిన ఎత్తిపోతల పథకం ద్వారా తుమ్మలపల్లి, పుట్టగుంట, పెదలింగాల, కురిపిరాల, కుదరవల్లి, రామపురం, నందివాడ గ్రామాల్లోని 3,597 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. 120 హెచ్.పి సామర్థ్యంతో నాలుగు పంపులు 16 గంటలపాటు నిర్విరామంగా పనిచేస్తాయన్నారు. దీనికి 315 కేవీఏ గల రెండు విద్యుత్ లైన్లు అందిస్తున్నామన్నారు. బుడమేరు అభివృద్ధిలో 141 ఎకరాల్లో 232 మంది రైతులకు రూ. 25 లక్షల 30 వేలు అందించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, అప్కాబ్ చైర్మన్ పిన్నమనేని వెంకటేశ్వరరావు, తూర్పుకృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ(చంటి), గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఆర్డీవో చక్రపాణి, జలవనరులశాఖ ఎస్ఈ ఎస్.కె వల్లి తదితరులు పాల్గొన్నారు.



అరుణ్ జైట్లీతో సుజనా భేటీ

విభజన హామీలపై ముమ్మర కసరత్తు

రైల్వే జోన్ కోసం పీయూష్ గోయల్‌కు ఆదేశం ?

న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో : న్యూఢిల్లీలోని జైట్లీ నివాసంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత సుజనా చౌదరి శనివారం సమావేశమై విభజన హామీలపై చర్చించారు. విశాఖ రైల్వే జోన్ విషయంలో కసరత్తు ముమ్మరం చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆదేశించారు. విశాఖ రైల్వే జోన్ విషయంలో ఒడిశాకు ఎలాంటి నష్టం ఉండదని, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పిలిపించి జైట్లీ మాట్లాడినట్లు తెలిసింది. విశాఖ రైల్వే జోన్‌తో పాటు దుగ్గరాజపట్నం విషయంలో కూడా ప్రణాళికలను వేగంగా రూపొందించాలని ఆర్థిక శాఖను జైట్లీ ఆదేశించారు. రెవిన్యూ లోటు అంశంపై కూడా ఏపీని అన్ని విధాలా ఆదుకుంటామని సుజనాకు హామీ ఇచ్చారు. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సమక్షంలో జరిగిన సమీక్షపై మరో మారు జైట్లీ, సుజనా చర్చించుకున్నారు. కిరండల్, విశాఖపట్నం, గుంతకల్లు జోన్‌లను కలిపి విశాఖ జోన్ కిందకు వచ్చే విధంగా కేంద్ర రైల్వే శాఖ కసరత్తులను ప్రారంభించిందని సమాచారం. అయితే దీనిపై కేంద్ర మంత్రులు , టీడీపీ ఎంపీలు అధికారిక ప్రకటన చేయలేదు. విభజన హామీలను నెరవేర్చుకునే దిశగా పావులు కదుపుతున్నామని టీడీపీ ఎంపీలు చెబుతున్నారు. తేడా వస్తే ఈసారి ఎవ్వరూ ఊహించని విధంగా ఆందోళ జరుపుతామని కేంద్రాన్ని హెచ్చరించామన్నారు.

విద్యారంగంలో ప్రతిభ కనబర్చాలి: జస్టిస్ ఈశ్వరయ్య



విశాలాంధ్రబ్యూరో - హైదరాబాద్ : విద్యా రంగంలో జరిగే మార్పులకు అనుగుణంగా బోధన ఉండాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి, జాతీయ వెనకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జస్టిస్ వంగల ఈశ్వరయ్య అన్నారు. ఆధునిక శాస్త్ర, సాంకేతిక రంగాలలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, విద్యారంగంపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని చెప్పారు. శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతి ఆడిటోరియంలో వివేకానంద కాన్వెంట్ స్కూల్ 35వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జ్ఞానప్రద ఏర్పాటు చేసిన ఉత్సవాలకు అయన హాజరయ్యారు. విద్యతోపాటు ఇతర రంగాల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రానికి, దేశానికీ కీర్తి ప్రతిష్టలు తేవాలన్నారు. విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లదేనన్నారు. కార్యక్రమంలో రాయన్స్ కెమికల్స్ అధినేత మెట్ల జగన్, ఫోకస్ మిషన్ చీఫ్ కోఆర్డినేటర్ వాసుదేవ శర్మ, భగవద్గిత ఫౌండేషన్ అధ్యక్షులు వి.గంగాధర శాస్త్రి, మెజిషియన్ చొక్కాపు వెంకట్ రమణ, నిర్మాణ్ సంస్థ చైర్మన్ విజయ్ కుమార్, గోదావరి పాలిమెర్స్ డైరెక్టర్ రాజేందర్‌కుమార్, లేపు క్లబ్ యూత్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

అందనంత దూరంలో ముర్రుపాలు...

- 50 శాతం మంది శిశువులకే తల్లిపాలు..
- పౌష్టికాహారంలోను వెనకంజలోనే...
- అనారోగ్యాల బారిన చిన్నారులు..
- పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం..



విశాలాంధ్ర అమరావతి : చిన్నారుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ముర్రుపాలు రానురాను అందనంత దూరంగా వెళుతున్నాయి.పుట్టిన వెంటనే అందాల్సిన ముర్రుపాలు బిడ్డలకి అందటంలేదు. అనారోగ్యాల బారిన పడకుండా ముర్రుపాలు కాపాడతాయనే విషయం చాలా మందికి నేటికి తెలియకపోవడం శోచనీయం. ఆస్పత్రుల్లో పుట్టిన బిడ్డలకు మొదటి గంటలో చాలామందికి తల్లి ముర్రుపాలు అందటం లేదని గణాంకాలు వెల్లడిస్తు న్నాయి. దేశవ్యాప్తంగా 80 శాతం గర్భిణులకు ఆస్పత్రుల్లోనే కాన్పులు జరుగుతున్నా 50 శాతం మంది శిశువులకు మాత్రమే తొలి గంటలో తల్లి పాలు అందుతున్నట్లు జాతీయ పోషకార సంస్థ అధ్యయనం ఇటీవలే వెల్లడించాయి.30 శాతం మంది బిడ్డలకు వెంటనే తల్లి పాలు అందటంలేదు. తల్లిపాలు అందని వారిలో 22 శాతం మంది శిశువులు తరువాత తీవ్ర వ్యాధుల బారిన పడుతున్నట్లు గుర్తించారు. తక్కువ బరువు ,పోషకాహార లోపం వంటి సమస్యలతో మరణిస్తున్న వారి సంఖ్య కూడా అధికంగానే ఉంటున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి.

నేటికి కొరవడిన ఆవశ్యకత...

ముర్రుపాలు గొప్పతనం నేటికి చాలందికి తెలియదంటే ఆశ్చర్యం కలగక మానదు. అవగహన లోపం కొంతైతే నిర్లక్ష్యం మరికొంత కనిపిస్తుంది. చిన్నారులు జీవితాంతం ఆరోగ్యంగా పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించాలి.ఇదే అనాది నుంచి పెద్దలు సైతం చెబుతున్న విషయం.అయితే మన రాష్ట్రంలోనే కాకా మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణలో కూడా ఇటు తల్లులు అటు ఆసుపత్రుల యాజమాన్యం ముర్రుపాలు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవటం లేదని ఎన్ ఐ ఎం నివేదికలో వెల్లడించడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఆసుపత్రులలో కాన్పుపగానే శిశువును తల్లి వద్దకి చేర్చి ముర్రుపాలు ఇప్పించాల్సిన బాధ్యత ఆసుపత్రి వర్గాలది. అయితే అదే సమయంలో తల్లికి చనుబాలు రావటం లేదంటూ పిల్లలకి చనుబాలు రావడంలేదని బిడ్డకు పాలు పట్టించడం మానేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే బిడ్డ ఆరోగ్యానికి ఎంతగానో ఉపకరించే ముర్రుపాలు మొదటి పది ,పదిహేను నిమిషాల సేపు రాకపోయినా కొంత సమయానికి వస్తాయని అనుభవజ్ఞులైన వైద్యులు సూచిస్తున్నారు. అయితే ఇప్పటికీ పలువురు తల్లులు పోతపాలు ,పట్టిక బెల్లం వంటి వాటిని ఉపయోగించి బిడ్డల ఆకలి తీరుస్తున్నారు.ఆసుపత్రులలో జరిగే 80 శాతం కాన్పులలో తొలి గంటలో 50 శాతం మంది మాత్రమే మొదటి గంటలో ముర్రుపాలు పట్టిస్తున్నారు. అయితే ముర్రుపాలు అందని ,అందించటంలో నిర్లక్ష్యం కనబరచటం వలన చిన్నారులు మరణాల పాలవుతున్నారు.కాగా 22 శాతం మంది శిశువులు మరణం పాలు కావటం మరింతగా ఆందోళన కలిగించే అంశంగా మారింది. కొంతందిలో పలురకాల వ్యాధుల బారిన పడుతున్నట్లు గణాంకాలు తెలియచేస్తున్నాయి. పిల్లలకు తొలి ఆరునెలలు తల్లిపాలు పాటించిన తర్వాత ఏడో నెల నుంచి అదనపు ఆహారం ఇప్పించాలని వైద్యులు సూచిస్తున్నారు.పోషకాహార విషయంలోనూ అత్యంత వెనకబడి ఉండటం.పిల్లలు ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఏ విధమైన పౌష్టికాహారం అందించాలనే విషయంలో సైతం అవగహన లేకపోవటమే ఇందుకు కారణంగా కనిపిస్తుంది.

ఇతర రాష్ట్రాలు ముందంజలో ...

ముర్రుపాలు అందించటంలో అయినా పౌష్టికాహారం అందించే విషయంలోనైనా ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా నిలుస్తున్నట్లు గణాంకాలు తెలియచేస్తున్నాయి. ముర్రుపాలు అందించటంలో 76 శాతంతో మహారాష్ట్ర ముందంజలో ఉండగా , నవ్యాంధ్ర 34.9 శాతంతో దిగువలో ఉండిపోయింది. అయితే అతితక్కువగా ఉన్న రాష్ట్రాల్లో గుజరాత్ 14.1 శాతంతో వెనుకంజలో ఉంది. పుట్టిన ఆరునెలల అనంతరం శిశువులకు మంచి ఆహారం అందించే విషయంలోనూ 64 శాతంతో ఒడిశా ముందంజలో ఉండగా కరా?టక అత్యల్పంగా 7.7 శాతంతో పూర్తిగా వెనకబడిపోయి ఉంది. మన రాష్ట్రం విషయానికొస్తే 36.3 శాతం మంది చిన్నారులకు అదనపు ఆహారం అందిస్తున్నట్లు తెలుస్తుంది. తల్లులు కొంత భయంతో ,మరికొంత అవగాహన లోపంతో బిడ్డలకి ఏ సమయంలో ఏ విధమైన ఆహారం అందించాలనే అంశంపై సందిగ్ధంలో ఉండిపోతునట్లు పలు సర్వేలలో వెల్లాడవుతుంది.

బృహత్తర ప్రణాళికతోనే....

శిశువుల ఆరోగ్యంపై సర్కారు ప్రత్యేక శ్రద్ధ కనబరచి బ ృహత్తర ప్రణాళికతో ముందుకెళ్లాలని భావిస్తుంది. ముర్రుపాలు ప్రాధాన్యతను విస్త ృతంగా ప్రచారం చేసి గ్రామస్థాయిలోకి వెళ్లాలని యోచిస్తోంది. పుట్టిన ఆరు నెలల నుండి ఐదు సంవత్సరాలు వయసు వచ్చే వరకు బిడ్డలకు అందించాల్సిన పౌష్టికాహారం పై కూడా పూర్తిగా అవగాహన కల్పించాలని నిర?యయించినట్లు తెలుస్తుంది. అంగన్ వాడీలతో పాటు .ఏ ఎన్ ఎం ల సేవలను వినియోగించుకోవటంతో పాటుగా స్వఛరేద సంస్థలను బాగస్వామ్యులను చేయాలని ప్రభుత్వం . సంబంధిత శాఖ సమాలోచనలు చేస్తుంది. వైద్య శాఖతో సమన్వయం చేసుకుంటూ ఆసుపత్రులలో ముర్రుపాలు ,పౌష్టికాహారం ,పిల్లల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు పరిశుభ్రత వంటి అంశాలతో పాటు ముర్రుపాలు అనారోగ్యాలుపై ఔషధం వంటివని తెలియచేయాలని ప్రణాళికలు రచిస్తోంది. మత శిశు సంరక్షణ శాఖ అద్వరంలో పటిష్ట చర్యలు చేపట్టి ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించే కార్యక్రమం చంద్రబాబు సర్కార్ చేపట్టనున్నది.

గొల్లపూడి నుండే ఏఐటీయూసీ కార్యకలాపాలు



విశాలాంధ్ర బ్యూరో- విజయవాడ : ఎఐటీయూసీ రాష్ట్ర కార్యకలాపాలు ఇకనుండి పూర్తిస్థాయిలో గొల్లపూడిలో నూతనంగా నిర్మించిన జోశ్యభట్ల సత్య నారాయణ భవన్ నుండే సాగుతాయని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. వెంకట సుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం విడిపోయిన తదుపరి హైదరాబాద్ నుండి విజయవాడకు రాష్ట్ర ఆఫీసు మారిన తరుణంలో హనుమాన్‌పేట దాసరి నాగభూషణరావు భవన్ నుండి ఇప్పటి వరకు కార్యకలాపాలు నిర్వహించామన్నారు. 2016 ఆగష్టు 28న గొల్లపూడిలో నూతన కార్యాలయానికి అంకురార్పణ చేసి 15 మాసాల్లో గొల్లపూడిలో కార్యాలయ నిర్మాణం పూర్తిచేసి, జనవరి 7వ తేదీన లాంఛనంగా ఎఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అమర్‌జిత్ కౌర్ ప్రారంభించిన విషయం విదితమే. అప్పటి నుండి చిన్నపాటి పనులు పూర్తి చేసుకుని నేడు పూర్తిస్థాయిలో ఆఫీసు విధి నిర్వహణలోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. కార్యాలయంలోని విధుల్లో ఎఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంకట రామారావు, ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్, కార్యదర్శులు కిర్ల క్రిష్టారావులు నిమగ్నమైనట్లు తెలిపారు.ఇకనుండి కార్మిక నాయకులు వివిధ రంగాల రాష్ట్రాల, జిల్లాల బాధ్యులు ఆయా యూనియన్ల పని మీదగానీ, కార్మికుల సమస్యలపై గానీ గొల్లపూడిలోని హైస్కూల్ బస్‌స్టాప్‌కు ఎదురుగా వున్న ఎఐటీయూసీ కార్యాలయం (జోశ్యభట్ల సత్యనారాయణ భవన్) రావాలని కోరారు. వివరాలకు ఆఫీసు ఫోన్ నెం:0866 2413575ను సంప్రదించాలని తెలిపారు. ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.

అర్హులందరికీ పెన్షన్ : చాడ

విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్ : బోదకాలు బాధితులకు రూ.1000 పెన్షన్ ఇవ్వడం మంచి పరిణామమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆసరా పథకం కింద పెన్షన్‌లు ఇస్తున్నప్పటికీ ఇంకా 5 లక్షల మంది 65 సంవత్సరాలు పైబడిన వారు వృద్ధాప్య పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వృద్ధాప్య పెన్షన్ వస్తే జీవనోపాధికి తోడ్పడుతుందని వృద్ధులు ఆశిస్తున్నారు. ఆసరా పథకం సంపూర్ణంగా అమలు కావడానికి 60 సంవత్సరాలు నిండిన అర్హులైనవారందరికీ ఇస్తే బాగుంటుంది. కానీ 65 సం॥లు నిండినా అర్హులైన వృద్ధులకు పెన్షన్ ఇవ్వడం లేదు. బయోమెట్రిక్ విధానం ద్వారా పెన్షన్ ఇవ్వడం మూలంగా కొంతమంది వృద్ధులకు వేలిముద్రలు సరిగా లేకపోవడంతో పెన్షన్ పొందడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చౌకధరల దుకాణాలలోనూ ఇలాంటి సమస్యలున్నాయి. వీటి విషయంలో పునర్ పరిశీలించి, అర్హులైన వారందరికీ పెన్షన్ మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని చాడ డిమాండు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వమే కందులు కొనాలి

విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్ : కందులను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండు చేశారు. కందుల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని కోరారు. పప్పు పంటలను ఎక్కువగా సాగు చెయ్యాలని రైతులను ప్రోత్సహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట చేతికొచ్చేసరికి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని విమర్శించారు. 40 శాతం కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చెయ్యాలని ఉన్నా యిప్పటి వరకు కేవలం 75,300 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయడానికి అనుమతివ్వడం కేంద్ర పాలకుల మాటలకు, చేతలకు పొంతన లేదని తెలుస్తోందన్నారు. కేంద్రంతో లేఖాస్త్రాలు మాని రాష్ట్రమే ముందుకు వచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 2.84 లక్షల టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఈ మొత్తం పంటను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం డిమాండు చేసింది.

బోదకాలు పెన్షన్లు మేమే ఇచ్చాం

కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డి

విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పింఛన్లు పెంచాలని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. గతంలో కాంగ్రెస్ రూ.200 పింఛన్ ఇస్తే ప్రస్తుతం టీఆర్ఎస్ రూ.వెయ్యి ఇస్తున్నదని, వచ్చే ఎన్నికల తరువాత వాటిని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోదకాలు బాధితులకు ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా ఇచ్చిందేమీ లేదని, గతంలో కాంగ్రెస్ పార్టీ బోదకాలును అంగవైకల్యం కింద గుర్తించి పింఛన్లు ఇచ్చినట్టు గుర్తు చేశారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని నిలిపివేసి ఇప్పుడు పునరుద్ధరిస్తున్నారని, అదేసమయంలో పక్షవాతానికీ వికలత్వం కింద పింఛన్లు ఇవ్వాలని డిమాండు చేశారు. వచ్చే ఎన్నికల తరువాత వికలాంగులకు రూ.3వేలు, వృద్ధాప్య, వితంతు, ఇతర పింఛన్లను రూ.2వేలకు పెంచాలన్నారు. బీడీ కార్మికుల జీవనభృత్తి విషయంలో 2014 తరువాత ఈపీఎస్ కింద నమోదు అయిన వారికి ఇప్పటికీ పింఛన్లు రావడం లేదన్నారు. ఇందులో ఆంక్షలు తొలగించి వారికీ పింఛన్లు అందేలా చూడాలని, 50 ఏళ్లు పైబడిన వారందరికీ పింఛన్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగుల మాదిరిగానే వీరికి పీఆర్సీ ప్రకారం ధరలకు అనుగుణంగా జీవనభృతిని పెంచాలన్నారు.

మానవ విలువల పరిరక్షణ అవశ్యం

విశాలాంధ్ర బ్యూరో - హైదరాబాద్: రోజుకు తగ్గిపోతున్న మానవ విలువలను కాపాడుకోవడంతో పాటు ఉమ్మడి కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాతృదేవోభవ సంస్థ అధ్యక్షుడు కేవీ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి డబ్ల్యూ కృష్ణమూర్తి అన్నారు. మాతృ ప్రేమ విలువను నేటి తరానికి తెలియచేయాలన్నారు. శనివారం లిబర్టీ ప్లాజాలోని మాతృదేవోభవ కార్యాలయంలో జరిగిన కుటుంబ వ్యవస్థపై సదస్సులో వీరు పాల్గొన్నారు. మంచిని పెంచి, ప్రేమను పంచి, మానవతా విలువలను ,నవతరానికి తెలపాలన్నారు. సమాజంలో వృద్ధులపై వివక్షత కొనసాగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తూ విదేశాల్లో స్థిరపడిన పిల్లలు తమ తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పరిమితం చేస్తున్నారని, అక్కడ వారు దయనీయ జీవితాలు గడుపుతున్నారని చెప్పారు. భారతీయ సంస్కృతిలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు గొప్ప పేరుందని, ఆధునిక యుగంలోనూ ఈ వ్యవస్థ బలంగానే ఉందన్నారు. కార్యక్రమంలో కేవీ రాంమూర్తి, చిత్ర, కమలాకరరావు, అంజయ్య పాల్గొన్నారు.



వచ్చే నెల్లో చలో పార్లమెంట్ : రఘువీరా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆందోళన, నిరసనకు దిగుతున్నారని, ప్రజల ఆగ్రహానికి దర్పణమే ఈ నిరసనలు అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ రఘువీరారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మార్చి 6, 7, 8వ తేదీల్లో ఢిల్లీలోనే ఉండి తాడోపేడో తేల్చుకోవాలని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో సహా అందరినీ ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో 6, 7వ తేదీల్లో దీక్ష చేద్దామని, 8వ తేదీన పార్లమెంట్‌ను ముట్టడిద్దామన్నారు. కేంద్రం మెడలు వంచి, మన హక్కులను సాధించుకుందామన్నారు. ఇప్పుడు జరగకపోతే మళ్లీ జరగదనే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పోరాటం సాగించాల్సి ఉందన్నారు. రాజకీయాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా అందరం కలిసి వెళదామని పిలుపునిచ్చారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడుకుందామని అనే నినాదంతో అందరం కూడా ప్రజలను చైతన్యవంతం చేద్దామన్నారు. కాంగ్రెస్ పార్టీగా అధ్వర్యంలో ఈనెల 15వ తేదీ వరకు అన్ని మండల కేంద్రాల్లో ప్రజల భాగస్వామ్యంతో నిరసన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అలాగే 20 నుంచి 28వ తేదీ వరకు రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ డివిజన్ కార్యాలయాల ముందు ఒక రోజు 'ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష' నిర్వహించాలన్నారు. కేంద్రం ప్రభుత్వం మెడలు వంచే విధంగా మన సత్తా చాటేలా రాష్ట్రంలో ఉన్న జాతీయరహదారులన్నీ కూడా స్తంభింపజేయాలని పిలుపునిచ్చారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగ్రహానికి గురికావద్దు...

- కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం
- ఏపీజేఫ్ రిలే నిరాహారదీక్షలో పలువురు నాయకుల ధ్వజం

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌పై కక్షకట్టి తీవ్ర అన్యాయం చేస్తోందని తక్షణం విభజన హామీలను అమలు చేయకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని పలువురు నాయకులు హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం (ఏపీజేఎఫ్) ఆధ్వర్యంలో శనివారం విజయవాడలోని లెనిన్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమంలో భాగంగా రిలే నిరాహారదీక్ష నిర్వహించారు. ఈ శిబిరానికి పలు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని తమ మద్దతును ప్రకటించాయి. దానిలో భాగంగా 'ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు' అంటూ నినాదాలు చేశారు.ముఖ్య వ్యక్తగా రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకహోదా, విభజన చట్టంలోని అన్ని అంశాలు అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాలుగేళ్లుగా పోరాడుతోందని, ఈ అంశంపై ఎవరు పోరాడినా కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. తమ భవిష్యత్‌పై 5 కోట్ల మంది కూడా ఆలోచన చేసుకోవాలని, సిద్ధాంతాలు, ఆలోచనలు, వృత్తులు భిన్నం అయినా, అందరూ సంఘటితం కావాలన్నారు. ఈ సందర్భంగా పార్టీలను , ప్రజలను సంఘటితం చేసిన జర్నలిస్టులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ నెల 20 నుంచి 28 వరకు రాష్ట్రంలో ఉన్న ప్రతి రెవెన్యూ డివిజన్ కార్యాలయాల ముందు ఒక రోజు "ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష" చేద్దామన్నారు. సీపీఐ నాయకులు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఎండకట్టారు. కేంద్రం ఆంధ్ర రాష్ట్రానికి చేసిన ద్రోహాన్ని ఏ ఆంధ్రుడు సహించరని వీటిని వెలికి తీసిన జర్నలిస్టు సంఘాలకు అభినందనలు తెలిపారు. ఎన్నికల ముందు వచ్చే చివరి బడ్జెట్‌లో అయినా ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరుగుతుందని ఆశిస్తే ఆశలు ఆడియాసలయ్యా యన్నారు. ఇప్పటికైనా బడ్జెట్లో సవరణ చేసి ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలో అన్ని హామీలు నెరవేర్చాలని ఆయన డిమాండు చేస్తూ బీజేపీ, టీడీపీలపై మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు చెవుల కృష్ణాంజనేయులు మాట్లాడుతూ ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలో అన్ని హామీలు నెరవేర్చాలని డిమాండు చేశారు. శిబిరంలో ప్రత్యేక అతిధిగా పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రాంపిళ్ల జయప్రకాశ్ నిమ్మరసం ఇచ్చి నిరశన దీక్షను విరమింపజేశారు. దీనికి ముందు స్వచ్ఛంద సంస్థ కొరగంజి శేఖర్‌బాబు మెమోరియల్ ట్రస్టు చైర్మన్ కొరగంజి జగన్ ఆధ్వర్యంలో మహిళలు, యువకులతో భారీ ర్యాలీ నిర్వహించి దీక్షా శిబిరానికి చేరుకుని తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సభలో వైసీపీ నాయకులు మాజీ మంత్రి కొలుసు పార్థసారధి, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు,వెలంపల్లి శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి కొణిజేటి రమేష్, రాష్ట్ర కార్యదర్శి షేక్ ఆసీఫ్, సూరసాని రామిరెడ్డి,టీడీపీ నాయకులు పట్టాభి, తాడిశకుంతల, వరలక్ష్మీనాయుడు, వీఎంసీ కోఆప్షన్ సభ్యులు ఎండీ ఫతావుల్లా సీపీఐ నాయకులు జి.కోటేశ్వరరావు, డి.వి.రమణబాబు, సంఘుల పేరయ్య, మహిళా నాయకురాలు పి.దుర్గాంబ,ఏపీజేఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ గాంధీబాబు, నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసు, యేమినేని వెంకటరమణ, ఉపాధ్యక్షులు కొండూరి శ్రీనివాసరావు, టి.అనిల్‌కుమార్, వినోదకుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీర్ల శ్రీరామ్ యాదవ్, దయాకర్, ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ పసుపులేటి చైతన్య, జిల్లా నాయకులు మత్తి శ్రీకాంత్, ఏపీఎస్ఆర్‌టీసీ కార్మిక ప్రధాన కార్యదర్శి వరహాలనాయుడు, బీసీ ఇంటర్నెషనల్ సంక్షేమ సంఘం నాయకులు ఎస్వీరావ్, నమ్మి అప్పారావు, బీసీ ఐక్యవేదిక నాయకులు బాయన శేఖర్‌బాబు, బి.నాగేశ్వరరావు పాల్గొని సంఘీభావం తెలిపారు.

నేటి నుంచి మహిళాబృందం సాహసయాత్ర

- ఏడు దేశాలు...
- 17 వేల కిమీల ప్రయాణం



విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్: తెలంగాణ పర్యాటక రంగాన్ని ప్రపంచానికి తెలియజేయడానికి నలుగురు తెలంగాణ ఆడబిడ్డలు మోటారు బైకులపై సాహసయాత్ర చేయడం అభినందనీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖమంత్రి అజ్మీర చందూలాల్ తెలిపారు. శనివారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న ఉదయం 7 గంటలకు పర్యాటక భవనం నుండి సాహసయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ నలుగురు మహిళలు మోటారు బైక్‌లపై 7 దేశాలను రోడ్డు మార్గం ద్వారా సాహసయాత్ర నిర్వహిస్తారన్నారు. ఈ సాహసయాత్ర కొనసాగే ప్రాంతాలలో భారత దేశం, తెలంగాణ పర్యాటక రంగ విశేషాలను ప్రచారం చేస్తారని మంత్రి చెప్పారు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు తూర్పు ఆసియా దేశాలదీ సాహసయాత్ర సుమారు 17 వేల కిలోమీటర్లు ప్రయాణిస్తుందని చెప్పారు. ఈ బైక్ సాహసయాత్రకు జై భారతి నాయకత్వం వహిస్తారని, ఆమెతో పాటు [illegible] కంబోడియా, వియత్నాం దేశాలలో పర్యటించి తెలంగాణ పర్యాటకరంగాన్ని చాటి చెబుతుందన్నారు. యాత్ర సమయంలో వీరు 19 యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్లు, 35 యునెస్కో సైట్లను సందర్శిస్తారన్నారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లడుతూ నలుగురు మహిళలు 50 రోజులలో 7 దేశాలలో పర్యటించి వస్తారన్నారు. వీరికి 400సీసీ బైకులను బజాజ్ ఆటో కంపెనీ వారు స్పాన్సర్ చేశారని తెలిపారు.

మహిళలు సురక్షితంగా పర్యటనలు నిర్వహించడానికి ఈ యాత్ర దోహదపడుతుందన్నారు. వీరు పర్యటించే రాష్ట్రాలు, దేశాల అధికారులతో సంప్రదించి వీరికి అవసరమైన సౌకర్యాలు కల్పించే విధంగా రాష్ట్ర పర్యాటక శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రయాణమార్గంలో గుర్తించిన ప్రాంతాలలో తెలంగాణ పర్యాటక శాఖకు సంబంధించిన వీడియోలు ప్రదర్శిస్తారన్నారు. మోటార్ బైక్ సాహసయాత్ర బృందానికి నాయకత్వం వహించే జై భారతి మాట్లడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత షీ టీమ్‌లను ఏర్పాటు చేసి [illegible] సాహసయాత్రలో పాల్గొనగలుగు తున్నారని తెలిపారు.

విజయవాడ
ఆదివారం
11 ఫిబ్రవరి 2018
విశాలాంధ్ర

క్రీడలు

వారిని చూసి బీసీసీఐ నేర్చుకోవాలి !



ముంబై: అత్యంత ధనిక బోర్డుగా పేరుగాంచిన బీసీసీఐ... ఛారిటీ మ్యాచ్‌ల నిర్వహణలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా బోర్డులను చూసి నేర్చుకోవాలి. కాస్త చొరవ చూపించి ప్రతి సీజన్‌లో ఒక అంశాన్ని ఎంచుకుని దానిపై అవగాహన కల్పించే ఆలోచన చేయాలని దిగ్గజ ఆటగాడు గవాస్కర్ సూచించాడు. ఐపీఎల్ లోనూ ఇలాంటి అంశాలకు చోటివ్వచ్చుననీ, ఆటగాళ్లపై, వారి ఇతరత్రా ఖర్చులతో పోలిస్తే ఇదేమంత పెద్ద మొత్తం కాదన్నాడు. పైగా వచ్చే మంచి పేరు వెలకట్టలేనిది. విద్యకు సంబంధించిన విషయంపై ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ ఇలానే చేస్తోంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 'గ్రీన్ డే' మ్యాచ్ ఆడుతోంది. ఇలా ప్రతి ఫ్రాంచైజీ ఒక మంచి ఉద్దేశంతో ముందుకొస్తే సమాజానికి మేలు చేసిన వారవుతారు. డబ్బు ఆడించే ఆటగా ఐపీఎల్‌పై ఉన్న వ్యతిరేకత కూడా కొంత తగ్గుతుందని సూచించాడు. డివిలియర్స్ వంటి ఆటగాడు తిరిగి జట్టుతో చేరడం చిన్న విషయమేం కాదు. ఆటను అతడెలా మార్చేయగలడో ప్రపంచానికంతటికీ తెలుసు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న 'పింక్ డే' మ్యాచ్‌లలో అతడి నమ్మశక్యంకాని ఇన్నింగ్స్‌లు మార్క్‌రమ్ బృందానికి స్ఫూర్తిదాయకమైనవే. దీంతోపాటు 'గులాబీ' రంగు దుస్తుల్లో దక్షిణాఫ్రికా ఇంతవరకు ఓడలేదు. ఓవైపు భారత మణికట్టు స్పిన్ ద్వయాన్ని ఎదుర్కోవడంలో సఫారీల వైఫల్యం కొనసాగుతుండగా... మరోవైపు కోహ్లిని నిలువరించడం పెద్ద ఆందోళనగా మారింది. కోహ్లికి రబడ మాత్రమే సవాల్ విసరగలుగుతున్నాడు. వీరి పోరాటం చూడదగినదేనని పేర్కొన్నాడు.

హ్యాట్రిక్ విజయంతో ఫైనల్‌కు..!



మెల్‌బోర్న్: న్యూజిలాండ్, ఇంగ్లండ్‌తో జరుగుతున్న ముక్కోణపు టీ 20 సిరీస్‌లో ఆస్ట్రేలియా జైత్రయాత్ర కొనసాగుతోంది. శనివారం ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తద్వారా ఈ సిరీస్‌లో హ్యాట్రిక్ విజయాన్ని ఆసీస్ ఖాతాలో వేసుకుని ముందుగా ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది. అంతకుముందు ఇంగ్లండ్, న్యూజిలాండ్ మ్యాచ్‌ల్లో ఆసీస్ ఘన విజయాల్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. ఇంగ్లండ్ కెప్టెన్ జాస్ బట్లర్(46), శ్యామ్ బిల్లింగ్స్(29)లు మాత్రమే మోస్తరుగా రాణించగా మిగతావారు తీవ్రంగా నిరాశపరిచారు. ఆసీస్ బౌలర్లలో కేన్ రిచర్డ్‌సన్ మూడు వికెట్లు సాధించగా, స్టాన్‌లేక్ రెండు వికెట్లు తీయగా, టైకు వికెట్ దక్కింది. ఆపై 138 పరుగుల సాధారణ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన ఆసీస్ 14.3 ఓవర్లలో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని సాధించింది. ఆసీస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్(2) నిరాశపరిచినప్పటికీ, ఆర్సీ షాట్(36), క్రిస్ లిన్(31), మ్యాక్స్‌వెల్(39), అరోన్ ఫించ్(20 నాటౌట్)లు సమయోచితంగా ఆడటంతో ఆసీస్ సునాయాసంగా గెలుపొందింది.

దక్షిణాఫ్రికాకు రైనా..!



ముంబై: సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులోకి పునరాగమనం చేయనున్నాడు సురేశ్ రైనా. దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో అతడు చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రైనా ఆదివారం దక్షిణాఫ్రికాకు పయనమవ్వనున్నాడు. భారత్ తరపున రైనా చివరిసారిగా 2017 ఫిబ్రవరి 1న ఇంగ్లాండ్‌పై ఆడాడు. ఆ తర్వాత ఫిట్‌నెస్ సమస్యలు, యో యో టెస్టు పాసవ్వకపోవడం తదితర కారణాలతో ఏడాదిపాటు జట్టులో చోటు సంపాదించలేకపోయాడు. గత ఏడాది ఆఖర్లో యో యో టెస్టు పాసైన రైనా తాజాగా దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈనెల 18 నుంచి భారత్-దక్షిణాఫ్రికాల మధ్య మూడు టీ20ల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో రైనా ఆదివారం భారత్ నుంచి సఫారీగడ్డకు పయనమవ్వనున్నట్లు సమాచారం. ప్రస్తుతం రైనా విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్న సంగతి తెలిసిందే.



వారు రేసులోనే ఉన్నారు : అరుణ్

జొహానెస్‌బర్గ్: భారత స్టార్ ఆటగాళ్లు రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ 2019లో జరగబోయే ప్రపంచకప్ రేసులో ఉన్నారని భారత జట్టు బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ స్పష్టం చేశారు. కేప్‌టౌన్‌లో మూడో వన్డేలో విజయం అనంతరం కెప్టెన్ కోహ్లి స్పిన్ ద్వయం చాహల్, కుల్‌దీప్‌పై ప్రశంసల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. దీంతో వన్డే జట్టులో అశ్విన్, జడేజా పునరాగమనంపై అభిమానుల్లో పలు అనుమానాలు లేవనెత్తాయి. తాజాగా కోచ్ భరత్ అరుణ్ దీనిపై స్పందించారు. జొహానెస్‌బర్గ్‌లోని వాండరర్స్ మైదానంలో శుక్రవారం ఆటగాళ్లు ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. అనంతరం భరత్ మాట్లాడుతూ.. 'ప్రపంచకప్ కోసం జట్టును ఎంపిక చేసే సమయంలో అందర్నీ దృష్టిలో పెట్టుకుంటాం. ఆటగాళ్ల ప్రతిభ ఆధారంగానే జట్టు ఎంపిక జరుగుతుంది. కాబట్టి అశ్విన్, జడేజా కూడా ప్రపంచకప్ రేసులో ఉన్నట్లే. వారి కోసం తలుపులు తెరిచే ఉన్నాయి. ప్రస్తుతం జట్టులో విపరీతమైన పోటీ నెలకొంది. మంచి ప్రదర్శన చేయకపోతే బెంచ్‌కే పరిమితమైపోతామని వారికి తెలుసు. అందుకే ఆటగాళ్లు పోటీని తట్టుకునేందుకు స్థాయికి మించి ప్రదర్శన చేస్తున్నారు. శ్రీలంకతో సిరీస్ సమయంలో మన ఆటగాళ్ల ప్రతిభను గుర్తించేందుకు ప్రయత్నాలు చేపట్టాం. ఇందులో విజయవంతమయ్యాం. ఎంతో మంది ప్రతిభ గల బౌలర్లు ఇప్పుడు మన వద్ద ఉన్నారు' అని భరత్ వివరించారు.

పన్ను మినహాయిస్తేనే..!



దుబాయ్: ప్రతిష్టాత్మక చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ సిద్ధమైంది. కానీ, ఇందుకు కొన్ని అడ్డంకులు ఉన్నాయి. ముఖ్యంగా పన్ను మినహాయింపు. 2021లో భారత్‌లో చాంపియన్స్ ట్రోఫీ నిర్వహించాలంటే పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరుతోంది ఐసీసీ. 2016లో టీ20 ప్రపంచకప్‌నకు భారత్ ఆతిథ్యం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం టోర్నీ నిర్వహణకు పన్ను మినహాయింపు ఇవ్వలేదట. దీంతో ఐసీసీ నిర్వాహకులు 'భారత్‌లో చాంపియన్స్ ట్రోఫీ నిర్వహించడానికి మాకు ఎలాంటి అభ్యంతరాలు లేవు. కాకపోతే మాకు పన్ను మినహాయింపు కావాలి అని కోరుతున్నాం. ఎందుకంటే మాకు టోర్నీ నిర్వహించడానికి చాలా పెద్ద మొత్తంలో ఖర్చవుతుంది. ఇలాంటి సమయంలో పన్ను మినహాయింపు మాకు కాస్త ఊరట ఇచ్చే అంశం' అని తెలిపారు. దీనిపై ఇప్పటికే బీసీసీఐ కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. క్రీడలను జీవితంలో భాగం చేసుకోమని పిలుపునిచ్చిన ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందో చూడాలి మరి.

న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ మృతి



అక్లాండ్: న్యూజిలాండ్ దిగ్గజ క్రికెటర్, మాజీ కెప్టెన్ బెవాన్ కంగ్‌డన్ మృతి చెందాడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి మరింత విషమించడంతో తుదిశ్వాస విడిచారు. 1965లో క్రికెట్‌లో అరంగేట్రం చేసిన బెవాన్ తన 13 ఏళ్ల కెరీర్‌లో మొత్తం 61 టెస్టులు ఆడారు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగడాన్ని ఇష్టపడే బెవాన్ 32.22 సగటుతో 3,448 పరుగులు చేశారు. ఇందులో ఏడు సెంచరీలు ఉన్నాయి. 17 టెస్టులకు సారథ్య బాధ్యతలు వహించిన బెవాన్ ఆస్ట్రేలియాపై తొలి టెస్టు విజయాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించారు. పాకిస్థాన్‌తో న్యూజిలాండ్ ఆడిన తొలి అంతర్జాతీయ వన్డేకు బెవాన్ నాయకత్వం వహించారు. 11 వన్డేల్లో 56.33 సగటుతో ఐదు అర్ధ సెంచరీలు, ఓ సెంచరీ నమోదు చేశారు. న్యూజిలాండ్ తరపున పది ఇన్నింగ్స్‌లలో ఇప్పటికీ ఇదే అత్యుత్తమ సగటు కావడం విశేషం. బెవాన్ మృతితో న్యూజిలాండ్ అభిమానులు, ఆటగాళ్లు శోకసంద్రంలో మునిగిపోయారు.

ధావన్ రికార్డు

జొహానెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో నాలుగో వన్డేలో టీమిండియా ఓపెనర్ శిఖర్ ధావన్ శతకంతో చెలరేగాడు. ఆరంభం నుంచి ఆతిథ్య బౌలర్లపై ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడుతూ భారీ ఇన్నింగ్స్ ఆడాడు. ధావన్ 99 బంతుల్లో 10ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో సెంచరీ పూర్తి చేశాడు. కెరీర్‌లో 100వ వన్డే ఆడుతున్న ధావన్ ఇదే వన్డేలో సెంచరీ చేసిన తొలి భారత ఆటగాడిగా రికార్డు సైతం నెలకొల్పాడు. వన్డే కెరీర్లో అతనికిది 13వ శతకం కావడం విశేషం. దక్షిణాఫ్రికాపై అతనికి మూడో సెంచరీ. కాగా 2015 ప్రపంచకప్‌లో భాగంగా మెల్‌బోర్న్‌లో ఇదే జట్టుపై చెలరేగి 137 పరుగులు సాధించాడు. ఇదే ఇప్పటి వరకు ఆ జట్టుపై గబ్బర్‌కు అత్యధిక స్కోరు. వ్యక్తిగత వన్డే క్రికెట్ కెరీర్‌లో వందో వన్డే మ్యాచ్‌లో శతకం చేసిన ఆటగాళ్ల జాబితాలో తాజాగా ధావన్ చేరాడు.

చెలరేగిన ధావన్



- రాణించిన కోహ్లి, ధోనీ
- మిడిలార్డర్ విఫలం
- దక్షిణాఫ్రికా లక్ష్యం 290

జొహానెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న నాలుగో వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా అదరగొట్టింది. ఆరంభంలో భారత బ్యాట్స్‌మెన్ శిఖర్ ధావన్(109: 105 బంతుల్లో 11ఫోర్లు, 2సిక్సర్లు), విరాట్ కోహ్లి(75: 83 బంతుల్లో 7ఫోర్లు, సిక్సర్) చెలరేగగా..ఆఖర్లో మహేంద్రసింగ్ ధోనీ(42 నాటౌట్: 43 బంతుల్లో 3ఫోర్లు, సిక్సర్) రాణించడంతో నిర్ణీత ఓవర్లో 7 వికెట్ల నష్టానికి భారత్ 289 పరుగులు చేసింది. ధావన్, విరాట్ మరోసారి 150 పరుగులకు పైగా భాగస్వామ్యం నెలకొల్పడంతో టీమిండియా భారీ స్కోరు చేయగలిగింది. మిడిలార్డర్‌లో రహానె(8), శ్రేయాన్ అయ్యర్(18) విఫలమయ్యారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. జట్టు స్కోరు 20 పరుగుల వద్ద రోహిత్‌శర్మ రూపంలో టీమిండియా వికెట్‌ను కోల్పోయింది. అయితే వికెట్ తీశామన్న ఆనందం దక్షిణాఫ్రికా జట్టులో ఎక్కువ సేపు నిలవలేదు. ఓపెనర్ శిఖర్ ధావన్, కెప్టెన్ విరాట్ కోహ్లిలు సఫారి బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్నారు. వికెట్ల మధ్య పరుగులు తీస్తూ జట్టు స్కోరును పరుగులెత్తించారు. రెండో వికెట్‌కు వీరిద్దరూ 158 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించారు. ఈ జోడీని విడదీయడానికి దక్షిణాఫ్రికా కెప్టెన్ మార్క్‌రమ్ చేసిన ప్రయోగం ఏదీ ఫలించలేదు. చివరకు 31.1ఓవర్‌లో మోరిస్ వేసిన బంతిని ఆడిన కోహ్లి కవర్‌లో మిల్లర్‌కు దొరికిపోయాడు. దీంతో 158 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత కొద్దిసేపటికే వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. మ్యాచ్ ఆరంభమైన కొద్దిసేపటికే భారత్ వరుసగా వికెట్లు చేజార్చుకుంది. స్వల్ప వ్యవధిలోనే భీకర ఫామ్‌లో ఉన్న శతక వీరుడు శిఖర్ ధావన్ వెనుదిరిగాడు. దక్షిణాఫ్రికా స్పీడ్‌స్టర్ మోర్నీ మోర్కెల్ బౌలింగ్‌లో డివిలియర్స్‌కు క్యాచ్ ఇచ్చి ధావన్ ఔటయ్యాడు. లుంగిని ఎంగిడి వేసిన తర్వాతి ఓవర్‌లో మరో కీలక ఆటగాడు రహానె కూడా ఔటవడంతో భారత్ భారీ స్కోరు చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. భారీ షాట్‌కు ప్రయత్నించిన రహానె బౌండరీ వద్ద రబాడకు చిక్కాడు. ఓ సమయంలో 178/1తో పటిష్ట స్థితిలో ఉన్న భారత్ తక్కువ సమయంలోనే 210/4 చేరి ఒత్తిడిని పెంచుకుంది. లుంగి వేసిన ఇన్నింగ్స్ 44వ ఓవర్లో భారీ షాట్‌కు ప్రయత్నించిన శ్రేయాస్ అయ్యర్(18) లాంగ్‌ఆన్‌లో క్రిస్ మోరీస్‌కు చిక్కాడు. 44 ఓవర్లకు భారత్ స్కోరు 249/4. ఈ దశలో క్రీజులో ఉన్న ధోనీ జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించేందుకు ఒంటరి పోరాటం చేశాడు. మరో ఎండ్‌లో వికెట్లు పడుతున్నప్పటికీ సింగిల్స్, డబుల్స్ తీస్తూ స్కోరు బోర్డును పరుగులెత్తించాడు. ఆతిథ్య బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తున్నప్పటికీ వీలుచిక్కినప్పుడల్లా ధోనీ బౌండరీలు బాదుతూ 289 వరకు తీసుకొచ్చాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో రబాద, లుంగిని ఎంగిడి చెరో రెండు వికెట్లు తీశారు. మోర్నీ మోర్కెల్, క్రిస్ మోరీస్ తలో వికెట్ దక్కించుకున్నారు.

ఫైర్‌ఫాక్స్ సాహస క్రీడలు



విశాలాంధ్రబ్యూరో - హైదరాబాద్: ఫైర్‌ఫాక్స్ బైక్స్, అడ్వెంచర్స్ బియాండ్ బారియర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఖాజాగూడలో ఎవ్రీడే ఎబిలిటీ కార్యక్రమాన్ని నిర్వహించింది. శరీర సౌష్టం కలిగిన వ్యక్తులతో పాటు దివ్యాంగులు సైతం రాక్ క్లైబింగ్‌లో పాల్గొన్నారు. ఎవ్రీడే ఎబిలిటీ సీరిస్ ఇది ఐదవది, ఇప్పటికే పూనే, ముంబై, గుర్‌గావ్, బెంగుళూరులలో రాక్ క్లైబింగ్ కార్యక్రమాలు జరిగాయి. సంభాషణ, అంగీకారం, సమానత్వం సూత్రాలపై ఆధారపడిన పర్యావరణ వ్యవస్థను నిర్మించాలనే లక్ష్యంతో దీని నిర్వహించారు. ఫైర్‌ఫాక్స్ అడ్వెం చర్ బియాండ్ బారియర్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం ద్వారా అందరికీ సాహసం అనే అంశాన్ని ప్రదర్శించింది. దివ్యాం గులపై ఉన్న అపోహలను తొలగించి సాహసాలకు అంగవైకల్యం అడ్డుకాదనే అంశాన్ని కార్యక్రమంలో పాల్గొని దివ్యాంగులు నిరూపించారు. ఫైర్‌ఫాక్స్ బైక్స్ సీఈవో అదిత్యముంజల్ మాట్లాడుతూ పీడబ్ల్యుడీ కోసం ఉపాధిని మెరుగుపరుస్తునే ఇన్‌క్లూజున్‌ను వృద్ధి చేయడానికి ఫైర్‌ఫాక్స్ ఎంతగానో ఉపయో గపడుతుందని చెప్పారు. 2014లో ప్రారం భమైన ఈ కార్యక్రమం 1.5లక్షల మంది దివ్యాంగులను శరీర సౌష్టం కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు.

పాలస్తీనాలో శాంతికోసం కృషి : మోడీ



రామల్లా: పాలస్తీనాలో శాంతి నెలకొల్పేందుకు కృషి చేస్తామని, ప్రజల ఆసక్తులను భారత్ గౌరవిస్తుందని ప్రధాన మోడీ తెలిపారు. పాలస్తీనా పర్యటకు వెళ్లిన భారత ప్రధాని నరేంద్ర మోడీకి ఆ దేశ అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ అధ్యక్ష నివాసంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారిద్దరి మధ్య చర్చలు జరిగాయి. పలు ఒప్పందాలపై సంతకాలు చేశారు. దాదాపు 50 మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు జరిగాయి. అందులో 30 మిలియన్ డాలర్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించే ఒప్పందం కూడా ఉంది. 5 మిలియన్ డాలర్లు విద్యారంగం కోసం, మరో 5 డాలర్లు మహిళా సాధికారిత కోసం సెంటర్ నిర్మించడం కోసం ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

అరుదైన సత్కారం

పాలస్తీనా పర్యటనకు వెళ్లిన భారత ప్రధాని నరేంద్ర మోడీని ఆ దేశ అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ పాలస్తీనా దేశం తరపున అత్యంత గౌరవాత్మకంగా ఇచ్చే ప్రశంసా పత్రంతో సత్కరించారు. భారత్, పాలస్తీనాల మధ్య సత్సంబంధాలను పెంచడంలో కీలక పాత్ర పోషించినందుకు గాను అబ్బాస్ మోడీని 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ పాలస్తీనా' పేరుతో ఘనంగా సన్మానించారు. ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్న అనంతరం ఆయన మోడీకి గ్రాండ్ కాలర్ ప్రశంసా పత్రాన్ని అందించారు. పాలస్తీనా పర్యటనకు వెళ్లిన తొలి భారత ప్రధాని నరేంద్ర మోడీ అన్న విషయం తెలిసిందే. ఇతర దేశాల రాజులు, దేశాధినేతలు, ఆ స్థాయి వ్యక్తులకు అత్యంత గౌరవ సూచకంగా పాలస్తీనా ఈ గ్రాండ్ కాలర్‌ను ఇస్తుంది. గతంలో సౌదీ అరేబియా రాజు సాల్మన్, బెహ్రెయిన్ రాజు హమద్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తదితరులకు అందజేశారు. పాలస్తీనా పర్యటన ముగించుకున్న మోడీ తిరిగి జోర్డాన్ బయల్దేరారు. అక్కడి నుంచి యుఈఏ వెళ్లనున్నారు.

అనుకూల్‌పై ఆరోపణలు



న్యూఢిల్లీ: అండర్-19 ప్రపంచకప్ విజేత భారత జట్టులో సభ్యుడైన అనుకుల్ రాయ్‌పై ఆరోపణలు వినిపిస్తు న్నాయి. క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బీహార్(సీఏబీ) కార్యదర్శి ఆదిత్య వర్మ అనుకుల్‌పై ఆరోపణలు చేశారు. అండర్-19లో పాల్గొనేం దుకు అనుకుల్ వయసు పరంగా మోసం చేశాడని అన్నారు. ఈ విష యం బీసీసీఐ ప్రస్తుత కార్యదర్శి అమితాబ్ చౌదరికి కూడా తెలుసునంటూ బాంబు పేల్చారు. ఆదిత్య వర్మ ఆరోపణలను అనుకుల్ ఖండించాడు. ఆదిత్య ఏం మాట్లాడుతున్నారో తనకు తెలియ దని, అన్ని రకాల పరీక్షలు పూర్తైన తర్వాత తాను ప్రపంచకప్‌కు ఆడేందుకు వెళ్లి నట్లు చెప్పాడు. స్పిన్నరైన అనుకుల్ ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్నాడు.

భారత్ మనసు గెలిచిన ఆఫ్రిది



ముంబై: శత్రుత్వం దేశాల మధ్యే కానీ, ఆటగాళ్ల మధ్య కాదని నిరూపించాడు పాక్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది. భారత్‌తో ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ అఫ్రిది తనదైన శైలిలో బంతులతో విరుచుకుపడిన సందర్భాలెన్నో. అయితే తన ప్రతాపం దాయాది దేశంతో మ్యాచ్ జరిగేంతవరకే అంటున్నాడు. శుక్రవారం నిన్నటి తరం క్రికెటర్లంతా రెండు జట్లుగా విడిపోయి స్విట్జర్లాండ్‌లో మంచుతో నిండిన పర్వతం మీద క్రికెట్ మైదానాన్ని తీర్చిదిద్ది శుక్రవారం రెండు మ్యాచ్‌లు ఆడారు. షాహిద్ అఫ్రిది నేతృత్వంలో రాయల్స్, వీరేంద్ర సెహ్వాగ్ సారథ్యంలో డైమండ్స్ మధ్య పోరు క్రికెట్ అభిమానులను అలరించింది. అయితే ఇరు జట్ల మధ్య మొదటి మ్యాచ్ అనంతరం ఓ ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. మ్యాచ్ అనంతరం అఫ్రిదితో అభిమానులు సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. ఈ క్రమంలో కొందరు తమ తమ దేశ పతాకాలను చేతబట్టి ఫొటోలు దిగుతున్నారు. ఇంతలో భారత్ నుంచి మ్యాచ్‌కు హాజరైన అభిమానులు కూడా అఫ్రిదితో సెల్ఫీలు దిగే ప్రయత్నం చేశారు. అయితే ఆ సమయానికి వారి చేతిలో భారత్ జాతీయ జెండా ఉంది. జెండాతో ఫొటో దిగడేమోనని సంశయించిన అభిమానులు దానిని పక్కకు పెట్టారు. అయితే అఫ్రిదినే స్వయంగా చొరవ తీసుకొని మరీ భారత్ జాతీయ పతాకాన్ని ఎదురుగా ఉంచి ఫొటో దిగాడు. దీంతో పట్టలేనంతం ఆనందంతో భారత్ అభిమానులు అఫ్రిదితో ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు. అఫ్రిది నేతృత్వంలోని రాయల్స్ మొదటి మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో సెహ్వాగ్ సారథ్యంలోని డైమండ్స్‌పై గెలిచిన సంగతి తెలిసిందే. నిర్ణీత 20ఓవర్లలో సెహ్వాగ్ జట్టు 164/9 పరుగులు సాధించగా, అఫ్రిది జట్టు చెలరేగి ఆడి మరీ 15.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది. ఇంగ్లాండ్ మాజీ బ్యాట్స్‌మెన్ ఒవైస్ షా 74 పరుగులు చేశాడు. రెండో మ్యాచ్‌లోనూ రాయల్స్ జట్టు సెహ్వాగ్ జట్టుపై 8వికెట్ల తేడాతో గెలిచింది.

క్రికెట్‌ను పరిచయం చేయడానికే..

మంచు పర్వతాలలో ప్రత్యేకంగా క్రికెట్ మైదానాన్ని తయారు చేసి మరీ నిన్నటి తరం ఆటగాళ్లు క్రికెట్ ఆడటం వెనుక ఓ ప్రత్యేకత ఉంది. స్విట్జర్లాండ్ భూభాగాలకు కూడా ఈ ఆటను పరిచయం చేయాలని ఇలా ప్రయత్నించారట. ఈ మ్యాచ్‌లను పైలెట్ ప్రాజెక్టులుగా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఆమోదించిందట. 1988లో తొలిసారిగా మంచుపై క్రికెట్ ఆడారు.

కోహ్లి అరుదైన ఘనత



జొహన్నెస్‌బర్గ్: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి మరో అరుదైన ఘనతను సాధించాడు. వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాళ్లలో ఐదో స్థానం (టాప్ 5 క్లబ్)లో నిలిచాడు. దక్షిణాఫ్రికాతో ఆరు వన్డేల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన నాలుగో వన్డేలో కోహ్లి (75: 83 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకంతో రాణించాడు. ఈ క్రమంలో టీమిండియా మాజీ కెప్టెన్ అజహరుద్దీన్ (9378) పరుగులను కోహ్లి అధిగమించాడు. ఈ వన్డేకు ముందు 9348 పరుగులతో ఉన్న కోహ్లి వన్డేల్లో అత్యధిక పరుగుల చేసిన భారత క్రికెటర్లలో అజహరుద్దీన్ తర్వాతి స్థానంలో ఉన్నాడు. నాలుగో వన్డేలో వ్యక్తిగత స్కోరు 31 పరుగుల వద్ద అజహర్ వన్డే పరుగులను కోహ్లి అధిగమించాడు.



విశాలాంధ్ర దినపత్రిక 10 వార్షిక చందాలను సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చాపర సుందర్‌లాల్, ఎడిషన్ ఇన్‌ఛార్జి జి.సత్యనారాయణ, విశాఖ బ్రాంచి మేనేజర్ ఎస్.నర్సింహులుకు రణస్థలం మండల విలేకరి జి.రాము అందజేస్తున్న దృశ్యం. చిత్రంలో బ్యూరో ఎస్.వి.సత్యప్రసాద్ తదితరులున్నారు.
- విశాలాంధ్ర, శ్రీకాకుళం

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: J/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431901, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.